గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

2014 నుంచి కనీస పెన్షన్‌ను.. రూ.వెయ్యికే పరిమితం చేసిన మోదీ సర్కార్

అంతర్జాతీయ వ్యవహారాల్లో కర్రపెత్తనం ప్రమాదకరం

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 139 | శనివారం | 19-04-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రూ.10,500 కోట్లతో హైదరాబాద్‌లో
# ఎఐ డేటా సెంటర్ క్లస్టర్



- ఎన్‌టిటి డేటా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ సంస్థ, నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా ఏర్పాటు
- రూ.560 కోట్లతో టిటిడిఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీ
- ఆయా కంపెనీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఒప్పందాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

జపాన్ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. ఒక్క రోజులోనే రూ. 11,062 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. డిజిటల్ ట్రాన్స్ ఫర్‌మేషన్, ఐటి సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టిటి డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ సంస్థ, నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా దాదాపు రూ.10,500 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో 'ఎఐ డేటా సెంటర్ క్లస్టర్'ను ఏర్పాటు చేయనుంది. అలాగే విద్యుత్ సరఫరా పంపిణీ రంగంలో తోషిబా కార్పొరేషన్‌అనుబంధ సంస్థ టిటిడిఐ (ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) రూ. 562 కోట్ల పెట్టుబడితో 'సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీ'ని హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టోక్యోలో నిర్వహించిన "ఇండియా జపాన్ భాగస్వామ్య రోడ్‌షో"లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జపాన్‌లోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం సమావేశమైంది.తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అవకాశాలను , అనుకూలతను సిఎం వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్, ఐటి సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టిటి డేటా,అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ సంస్థ, నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా తరువాయి 2లో




## ప్రపంచానికి అద్భుతమైన
# భవిష్యత్‌ను నిర్మిద్దాం

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

ఇండియా – జపాన్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాలలో తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, తద్వారా భారత్, తరువాయి 2లో




# పేదల కన్నీటిని తుడిచేందుకే 'భూ భారతి'

- భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఇబ్బందులు పెట్టకుండా రైతులకు సేవలందిస్తాం
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు
- గత పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదు
- వారికి ఇంకా జ్ఞానోదయం కావడంలేదు
- ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి

పేదల కన్నీటిని తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందుకు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని, ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. ఈ ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తామన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టు రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ రామకృష్ణరావు, భూపాలపల్లి ఎంఎల్‌ఎ గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎంఎల్‌ఎ నాగరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ సిసిఎల్‌ఎ(రెవెన్యూ) బుద్ధ ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లతో భూభారతి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సు పెట్టలేదని ఒక వేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ఆ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడేవారని, గత పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదని వారికి జ్ఞానోదయం కావడం లేదన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని ఆబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాస గృహాలకు డాక్యుమెంట్లు తరువాయి 2లో

## మన రాజకీయ వ్యవస్థలో
# రాజ్యాంగమే సర్వోన్నతం



గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగానికి సమర్థనగా ధన్కర్ వ్యాఖ్యలు

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీల నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కడానికి గవర్నర్ల అధికారాలను బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ దుర్వినియోగించడానికి సమర్థనగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వ్యాఖ్యలు ఉన్నాయని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. రాష్ట్రపతి, గవర్నర్ల వంటి రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిర్దేశించే సుప్రీంకోర్టు అధికారాన్ని ప్రశ్నించేలా ధన్కర్ మాట్లాడటాన్ని సిపిఐ ఖండిస్తోందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మన రాజకీయ వ్యవస్థలో, రాజ్యాంగమే సర్వోన్నతమని రాజా నొక్కిచెప్పారు. రాజ్యాంగానికి మించిన ఏ పదవీ లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో 'చెక్స్ బ్యాలెన్స్' (మంచి, చెడు పర్యవేక్షణ) తరువాయి 12లో

మస్క్‌తో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ

నకిలీనోట్లతో రూ.35 లక్షల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు లోపలి పేజీల్లో

## రైల్‌లో అత్యాచారం
# ఉత్తిదే

- ఇన్‌స్టా గ్రాంలో రీల్స్ చేస్తుండగా కిందపడిన యువతి
- అత్యాచారయత్నం జరిగినట్లు నమ్మించిన వైనం
- 300కు పైగా సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సికింద్రాబాద్ ఎంఎంటిఎస్ రైల్లో యువతిపై అత్యాచారయత్నం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. యువతి పోలీసులను తప్పుదోవ పట్టించినట్లు రైల్వే ఎస్‌పి చందన దీప్తి వెల్లడించారు. ఆమె సెల్‌ఫోన్‌తో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడినట్లు తెలిపారు. అయితే, తనపై అత్యాచారయత్నం జరిగినట్లు పోలీసులను నమ్మించిందని ఆమె పేర్కొన్నారు.దర్యాప్తులో భాగంగా సుమారు 300కు పైగా సిసి కెమెరాలను రైల్వే తరువాయి 12లో

## హక్కుల పరిరక్షణకు
# సమరశీల పోరాటాలు

మేడే స్ఫూర్తితో సన్నద్ధం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- ఎఐటియుసి రాష్ట్ర సమితి మేడే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం /హైదరాబాద్




కార్మికుల తమ రక్తాన్ని చిందించి సాధించుకున్న హక్కులకు పరిరక్షించేందుకు మేడే స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర సమితి రూపొందించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎఐటియూసి రాష్ట్రఅధ్యక్షులుఎం.డి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షులు కె.ఏసురత్నం, కార్యదర్శి ఎస్.విలాస్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులతో కలిసి కూనంనేని సాంబశివరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ 139 ఏళ్ల క్రితం కార్మిక వర్గం తమ రక్తాన్ని చిందించి ఎనిమిది గంటల పని, శ్రమకు తగిన ఫలితం కోసం అవిశ్రాంత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్రం లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చట్టాలను సవరించడం ద్వారా బడా పారిశ్రామికవేత్తలకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అందులో భాగంగానే 8 గంటల పని విధానాన్ని మార్చి 12 గంటల వరకు పెంచడం దుర్మార్గమన్నారు.ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తరువాయి 2లో

## కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి
# రాష్ట్రానికేం తెచ్చారు?


- జవాబు చెప్పి తీరాల్సిందే?
- బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు మతం, కులం, రజాకార్ల జపం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా?
- టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కిషన్ రెడ్డి తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో, ఆరేళ్ల కేంద్రమంత్రిగా కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారో సమాధానం చెప్పాలని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బిజెపి, కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు రాష్ట్రంలో మతం, కులం, ఒవైసీ, తరువాయి 2లో


## అమెరికా చట్టాలకు వ్యతిరేకంగా వెళితే
# 'మూల్యం' తప్పదు



- యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికార ప్రతినిధి మార్గరెట్ మాక్‌లియోడ్ హెచ్చరిక
- జాతీయ చట్టం సహా ఇమ్మిగ్రేషన్ చట్టాలన్నింటినీ ట్రంప్ అధికార యంత్రాంగం కఠినంగా అమలుచేస్తుందని వెల్లడి

**న్యూఢిల్లీ :** అమెరికా చట్టాలకు వ్యతిరేకంగా వెళితే విద్యార్థులు దేశ బహిష్కరణ సహా అనేక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికాకు చెందిన డిపార్ట్ మెంట్ ఆఫ్ స్టేట్ హెచ్చరించింది. 'పిటిఐ'కి ఇచ్చిన వర్చువల్ ఇంటర్వ్యూలో అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికార ప్రతినిధి మార్గరెట్ మాక్‌లియోడ్ మాట్లాడుతూ ట్రంప్ అధికారయంత్రాంగం విదేశీయుల నమోదు చట్టం, ఇమ్మిగ్రేషన్, జాతీయ చట్టం సహా ఇమ్మిగ్రేషన్ చట్టాలన్నింటినీ ట్రంప్ అధికార యంత్రాంగం కఠినంగా అమలు చేస్తుందని తెలిపారు. మీరు ఒకవేళ అమెరికా చట్టాన్ని అనుసరిస్తే అమెరికా మీకు అవకాశాలను కల్పిస్తుంది. కానీ ఎవరైతే అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తారో తరువాయి 2లో

# ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎందుకు నిలపలే?



- కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు సమాధానం చెప్పాలి
- ఆ మూడు పార్టీలు రాష్ట్రాన్ని ముంచేందుకు ఎత్తుగడలు వేస్తున్నాయి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆరోపణ
- ఎమ్మెల్సీ ఎన్నికపై మాక్ పోలింగ్ నిర్వహణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్, బిఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు తెలంగాణ రాష్ట్రాన్ని ముంచేందుకు ఎత్తుగడలు వేస్తున్నాయని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆరోపించారు.కాంగ్రెస్,బిఆర్‌ఎస్ పార్టీలో హైదరాబాద్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బేగంపేట హరితప్లాజాలో తరువాయి 2లో



ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్

# ఎసిబి అదుపులో నస్పూర్ ఎస్ఐ

లంచం తీసుకున్న కేసులో కరుణాకర్ అరెస్టు

ప్రజాపక్షం/ నస్పూర్

మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ సిసిసి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు లంచం తీసుకున్న కేసులో అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్ శుక్రవారం వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, 2025 జనవరి 25న ఒక ఫిర్యాదుదారుడిని అక్రమంగా నిర్బంధించి అతని నుండి రూ. 2 లక్షలు వసూలు చేసిన కేసులో ఎస్ఐ కరుణాకర్‌కు సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, డబ్బును తరువాయి 2లో

# అన్నదాతతో ప్రకృతి చెలగాటం

అకాల వర్షాలతో దెబ్బతింటున్న పంటలు వేల ఎకరాల్లో నష్టం

ప్రజాపక్షం/ఖమ్మం



అన్నదాతతో ప్రకృతి చెలగాటమాడుతుంది. గడిచిన దశాబ్ద కాలంలో రైతుకు సహకరించని ప్రకృతి రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. అతి వృష్టో, అనావృష్టితోనో వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నష్టపరుస్తుంది. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ప్రారంభంలో అతివృష్టితో దెబ్బతీసిన ప్రకృతి యాసంగి పంటపై అకాల వర్షం రూపంలో దెబ్బతీస్తుంది. గడిచిన నాలుగు రోజులుగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నది. లక్షలాది బస్తాల ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయ్యింది. కష్టపడి పండించిన ధాన్యం కళ్లెదుటే కల్లాల్లో తడిసిపోతుంటే రైతాంగం తరువాయి 12లో


## మహానగరం
# అతలాకుతలం



- ఈదురుగాలులతో భారీ వర్షం
- కూలిన చెట్లు, పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు
- విద్యుత్ అంతరాయంతో హైదరాబాద్ అంధకారం
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. పలుచోట్ల ఈదురుగాలులతో మొదలైన వాన నగరమంతా క్రమక్రమంగా విస్తరించింది. పలు చోట్ల భారీ వర్షం కారణంగా రహదారులు క్షణాల్లోనే చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై వాహనదారులు అటు ఈదురు గాలులు, ఇటు వర్షం మధ్య చిక్కుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ నగరంపై క్యుములో నింబస్ మేఘాలు ఆవరించాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## గాజాలో యుద్ధం ముగించేందుకు బందీలను వదిలేస్తాం: హమాస్

**కైరో:** గాజాలో యుద్ధం ముగించేందుకుగాను బందీలందరినీ విడుదల చేసేందుకు సిద్ధమంటూ హమాస్ ప్రకటించింది. ఇజ్రాయిల్ ఖైదులోని పలస్తీనా ప్రజలను అప్పగిస్తే, తమ వద్ద ఉన్న బందీగా ఉన్న ఇజ్రాయిలీలను విడుదల చేస్తామని హమాస్ సీనియర్ అధికారి వెల్లడించారు. గాజాలో యుద్ధం ముగియాలంటే సమగ్ర ఒప్పందం జరగాలని స్పష్టంచేశారు. ఇజ్రాయిల్ ప్రతిపాదించిన తాత్కాలిక విరమణను తిరస్కరించారు. హమాస్ గాజా చీఫ్ ఖలీల్ అల్ హయ్యా టీవీ మాధ్యమంగా ఈ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన ప్రభుత్వం పాక్షిక ఒప్పందాల వెనుక యుద్ధాన్ని కొనసాగిస్తూ పస్తులు ఉంచడం ద్వారా పలస్తీనియన్లను చంపేయాలన్న రాజకీయ అజెండా దాచివుంచిందని హయ్యా వ్యాఖ్యానించారు. అందుకోసం బందీలందరిని త్యాగం చేయడానికి నెతన్యాహు వెనుకాడటం లేదన్నారు. ఇటువంటి విధానంలో భాగస్వాములం కాబోమని హయ్యా వెల్లడించారు. మా వళ్లను అప్పగిస్తే... మా వద్ద బందీల విడుదల చేస్తామని, సమ గ్ర ఒప్పందం జరిగితే గాజాలో యుద్ధం ముగించాలని భావిస్తున్నామని ఆయనన్నారు.

# మీ విముక్తి... మన స్వాతంత్ర్యమే ధ్యేయం

### పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ
### 'ప్రిజనర్స్ డే'న 9 వేల మంది ఖైదీలకు సంఘీభావం

**జెరూసలేం:** 'మీ (పలస్తీనా ఖైదీలు) విముక్తి.... మన (పలస్తీనా ప్రజలు) స్వాతంత్ర్యమే ధ్యేయంగా ముందుకెళుతున్నామంటూ ప్రిజనర్స్ డేను పురస్కరించుకొని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన చేసింది. ఇజ్రాయిల్ దురాక్రమణ క్రమంలో యూద దేశం నిర్బంధించిన తొమ్మిది వేల మందికిపైగా పలస్తీనా ఖైదీలకు సంఘీభావం ప్రకటించింది. అమానవీయ పరిస్థితుల్లో వేధింపులు, నిర్లక్ష్యాన్ని గురై ప్రాణాలు కోల్పోతున్న ఖైదీల దుస్థితిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా అంతర్జాతీయ సమానం మౌనం వీడకపోవడాన్ని ఆక్షేపించింది. మానవతా సంఘాలు ఇప్పటికైనా స్పందించి పలస్తీనా పౌరుల హక్కులు, స్వాతంత్ర్యం, స్వయంప్రతిపత్తి, ఔన్నత్యాన్ని కాపాడటానికి ముందుకు రావాలని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. మన మాతృభూమి ఔన్నత్యాన్ని, మన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం, కిరాకత్వాన్ని, అవమానాలను, అణచివేతను ఎదిరించడం కోసం దురాక్రమణదారుల నిర్బంధానికి గురైన పురుషులు, మహిళలు సహా తొమ్మిది వేల మందికిపైగా పలస్తీనా ఖైదీల నిబద్ధతకు సంఘీభావం తెలుపుతున్నామని 'పలస్తీనియన్ ప్రిజనర్స్ డే' ప్రకటనలో కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. 'గాజా, వెస్ట్‌బ్యాంక్, జెరూసలేంలో ఇజ్రాయిల్ దురాక్రమణ, వైమానిక, భూతల దాడులు, వేధింపుల నడుమ ప్రిజనర్స్ డే జరుపుకుంటున్నాం. పలస్తీనా ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఆకలి చావులకు దారితీస్తూ వినాశసం సృష్టిస్తున్నారు. సామూహిక నిర్బంధ కాండ కొనసాగిస్తున్నారు. ఖైదీలుగా ఉన్న మన వాళ్ల హక్కులు హరిస్తూ... శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. వారి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పౌష్టికాహారం లేక వారు నీరసించిపోతుంటే చూసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. విచారణకు తావు లేకుండా దశాబ్దాల పాటు జైళ్లకు పరిమితం చేస్తున్నారు. వందల సంవత్సరాల శిక్షలు విధిస్తూ వేధిస్తున్నారు. అమానవీయ పరిస్థితుల్లో గత ఏడాదిలో 70 మంది చనిపోయారు. ముఖ్యంగా గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం మొదలైనప్పటి నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది' అని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ఖైదీల విడుదలకు డిమాండ్ చేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, మానవతా సంస్థలు ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ తక్షణమే జోక్యం చేసుకొని సామూహిక అరెస్టులు, నిర్బంధ కాండ, వేధింపుల నుంచి ఖైదీలకు విముక్తి కల్పించాలని పిలుపునిచ్చింది.'ఖైదీలకు విముక్తి, అమరులకు గౌరవం, ప్రజా ఉద్యమాల్లో విజయమే లక్ష్యమంటూ సంకల్పించింది. పలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలి, పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ, శ్రామిక వర్గ గళంతిరుగుబాటు వర్ధిల్లాలని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ నినదాలిచ్చింది.


## త్వరలో చైనాతో వాణిజ్య ఒప్పందం: ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికాచైనా మధ్య సుంకాల యుద్ధం తీవ్రతరమవుతూ వాణిజ్య యుద్ధానికి దారితీస్తున్న పరిస్థితుల్లో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాతో మరో మూడు లేక నాలుగు వారాల్లో వాణిజ్య ఒప్పందం ఖరారు కాబోతోందని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. 'వచ్చే మూడు లేక నాలుగు వారాల్లో చైనాతో వాణిజ్య ఒప్పందం జరుగుతుంది. ఇదంతా త్వరలోనే పూర్తవుతుంది' అని శ్వేతసౌధం వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్ అన్నారు. చైనాతో చాలా మంచి వాణిజ్య ఒప్పందం జరగబోతోందని వెల్లడించింది. అమెరికా ప్రతీకార సుంకాలపై అనేక ఆసియా దేశాలు ఇప్పటికే సంప్రదింపులు మొదలు పెట్టాయి. కొన్ని దేశాలకు మినహాయింపులు ఇచ్చేందుకు అమెరికా ఒప్పుకుంది. కొంత కాలం విరామాన్ని కూడా ప్రకటించింది. అయితే చైనాకు ఎలాంటి ఊరటనివ్వకపోగా ఆ దేశ ఉత్పత్తులపై ఏకంగా 245 సుంకాన్ని ప్రకటించింది. ఈ పరిణామాల క్రమంలో వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ట్రంప్ చెప్పడం చర్చకు దారితీసింది.

**యుద్ధం ఆపకపోతే సాయం ఆపేస్తాం...**
**ఉక్రెయిన్‌కు హెచ్చరిక:**
యుద్ధం ముగించకపోతే ఇక మీ దేశాన్ని పట్టించుకోమని ఉక్రెయిన్‌ను అమెరికా హెచ్చరించింది. పశ్చిమాసియాకు ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో కలిసి యూరప్, ఉక్రెయిన్ నాయకులతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది మా యుద్ధం కాదు. మూడేళ్ల నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోంది. ఇకపై సాయాన్ని ఆపేయాలని భావిస్తున్నాం. యుద్ధం ఆపలేని పరిస్థితుల్లో ఉక్రెయిన్ గురించి పట్టించుకోవడం మానేసి అమెరికా తన దారిని తాను చూసుకుంటుంది' అని రుబియో వెల్లడించారు.

## పోర్టులపై తప్పుడు విధానాలు ఆపండి



### అధిక చార్జీలతో అందరికి నష్టం: అమెరికాకు చైనా స్పష్టీకరణ

**బీజింగ్:** అమెరికా పోర్టులను సందర్శించే చైనా సంబంధిత నౌకలపై భారీ రుసుము వసూతు చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. తాజా చర్యలను బీజింగ్ తీవ్రంగా ఆక్షేపించింది. పోర్టులపై తప్పుడు విధానాలు ఆపాలంటూ అమెరికాకు స్పష్టంచేసింది. భారీగా చార్జీలు విధించడంతో అన్ని వర్గాలకు నష్టం జరుగుతుందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ శుక్రవారం తేల్చిచెప్పారు. 'అంతర్జాతీయ షిప్పింగ్ వ్యయం అమాంతం పెంచేశారు. ఇది అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా గొలుసుల సుస్థిరతను దెబ్బతీస్తుంది. ఈ పద్ధతిలో అమెరికా నౌకల తయారీ పరిశ్రమను పునరుద్ధరించలేరు' అని ఆయనన్నారు. పద్ధతి మార్చుకోవాలని... వాస్తవాలను, బహుపాక్షిక నిబంధనలను గౌరవించాలని అమెరికాను కోరారు. తప్పుడు విధానాలను తక్షణమే ఆపేయాలన్నారు. చైనా తన న్యాయపరమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసం అవసరమైన చర్యలన్నీ తీసుకుంటుందని స్పష్టంచేశారు. చైనాలో తయారైన, ఆ దేశానికి చెందిన నౌకలు అమెరికా పోర్టుల్లో డాక్ అయితే వాటిలోని మొత్తం సరుకుపై భారీగా చార్జీలు వసూలు చేస్తామని అమెరికా వాణిజ్య ప్రతినిధి గురువారం వెల్లడించారు.

## మహానగరం అతలాకుతలం
(మొదటి పేజీ తరువాయి)

ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. హైదరాబాద్ నగరంపై క్యుములో నింబస్ మేఘాలు ఆవరించాయి. దట్టమైన మేఘాలతో పగలే చీకట్లు అన్నట్లు వాతావరణం మారిపోయింది. భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు చెరువులను తలపించాయి. మ్యాన్ హోల్స్ పొంగిపొర్లాయి. ఐటి కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో దాదాపు నగరమంతటా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం బీభత్సం సృష్టించడంతో హైడ్రా, డిఆర్‌ఎఫ్, జిహెచ్‌ఎంసి అత్యవసర బృందాలు రంగంలోకి సేవలు అందించాయి. నగర వ్యాప్తంగా 21 చెట్లు నెలకూలాయి.

**జలమయమైన లోతట్టు ప్రాంతాలు..** లోతట్టు ప్రాంతాలు జలమయమాయ్యయి. కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ముందుగా ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి. అమీర్‌పేట్, పంజాగుట్ట, మధుర నగర్, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, పరిసరాల ప్రాంతాల్లో వర్షం కురిసింది. కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్, కార్వాన్, ఎల్.బి.నగర్, వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోనూ సుమారు గంటపాటు ఏకదాటిగా వర్షం కురిసింది. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. చాదర్‌ఘాట్, ఆజంపురాలో ఈదురు గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోకాపేటలో ఈదురుగాలుల బీభత్సానికి నిర్మాణ సామాగ్రి గాల్లో ఎగురుతూ కనిపించాయి. నాంపల్లి, హిమాయత్ నగర్, ముషీరాబాద్, ఖైరతాబాద్‌లలో ఒక్కసారిగా ఈదురు గాలులలో కూడిన వర్షం కురిసింది. నాంపల్లి రెడ్ హిల్స్‌లో ఈదురుగాలుల తీవ్రతకు చెట్టు కూలి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలిపోయింది. అటు బషీర్ బాగ్‌లోని నిజాం లా కాలేజ్ ముందు కూడా చెట్టు కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఖైరతాబాద్, లక్డీకపూల్, పంజాగుట్ట ప్రాంతాల్లో గాలి దుమారంతో వడగండ్లు పడ్డాయి. దీంతో రాజ్ భవన్ ప్రాంతంలో పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవటంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు మంత్రి :పొన్నం**
భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ జిహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. వర్షపాతం ప్రభావం జిహెచ్ ఎంసి ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ టీమ్స్, డిఆర్‌ఎఫ్ బృందాలు విరిగిన చెట్లను తొలగించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో అత్యవసర సేవలు అందించాలని ఆదేశించారు.

## నిర్మిద్దాం (మొదటి పేజీ తరువాయి)

జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో 'ఇండియాజపాన్ ఎకనామిక్ పార్టనర్ షిప్ రోడ్‌షో' జరిగింది. ఈ రోడ్‌షోలో వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం వివరించింది. ''దేశంలోనే తెలంగాణ కొత్త రాష్ట్రం, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నది.. తెలంగాణ మీకు హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుతోంది..జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశంగా పిలుస్తారు. మా తెలంగాణ ప్రభుత్వ నినాదం..తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది,'' అని, సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆహ్వానించారు. 'టోక్యో చాలా గొప్ప నగరమని, ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతమన్నారు. జపాన్ ప్రజలు సౌమ్యులని, మర్యాదస్తులని, క్రమశిక్షణ కలిగినవారని, జపాన్ వాసుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని అన్నారు.

**'రోడ్‌షో'లో 'తెలంగాణ ప్రాజెక్ట్'ల వీడియోల ప్రదర్శన:** దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించతలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. రోడ్‌షో తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం మరియు జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం జరిగింది.

## ఎందుకు నిలపలే? (మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల బిజెపి సన్నాహక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఎన్నికపై మాక్ పోలింగ్ నిర్వహించి, పోలింగ్‌పై బిజెపి ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బిజెపి నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఎల్‌సి బిజెపి అభ్యర్థి గౌతంరావు, బిజెపి నేతలు రాంచందర్ రావు, చింతల రాంచంద్రారెడ్డి, నాయకులు దీపక్ రెడ్డి, పార్టీ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలను దోపిడీ చేసి, ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు జీ హుజూరంటున్నాయని మండిపడ్డారు.

**సమావేశానికి ఎమ్మెల్యే రాజాసింగ్ డుమ్మా....** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల బిజెపి సన్నాహక సమావేశానికి గోషామహల్ ఎంఎల్‌ఎ రాజాసింగ్ గైర్హాజరయ్యారు.గ్రేటర్ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రేటర్‌లో బిజెపికి ఉన్న ఏకైక ఎంఎల్‌ఎ రాజాసింగ్ గైర్హాజరవ్వడం చర్చనీయంశంగా మారింది. గౌతంరావు అభ్యర్థిత్వాన్ని ఇది వరకే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## పోరాటాలు (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , కర్షక, ప్రజా వ్యతిరేక విధానల కారణంగా దేశ జిడిపి ఒకవైపు గణనీయంగా తగ్గుముఖం పట్టగా, మరొకవైపు అమెరికాలో ఉంటున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా స్వదేశానికి తిప్పి పంపిస్తున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కనీసం ఒక్క మాట కూడ మాట్లాడడం లేదన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలే కారణగా భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడూ లేనంతగా బలహీన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత వ్యవస్థను ప్రతిష్టపరిచి కార్మిక వర్గ చైతన్యాన్ని పెంపొందించి కార్మిక హక్కుల్ని సాధించుకోవడానికి ప్రపంచ కార్మిక ఐక్య పోరాట దినోత్సవమైన మేడే స్ఫూర్తితో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. గడిచిన 10 ఏళ్ల కాలంల నిసిగ్గుగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను గుప్త పెట్టుబడిదారులకు తెగ నమ్మడంతో నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అవలభింస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు, కార్మికులు ఐక్యమత్యంతో పోరాడి భారతదేశ సంపదను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

## ఎఐ డెటా సెంటర్ క్లస్టర్
(మొదటి పేజీ తరువాయి)

దాదాపు రూ.10,500ల కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న 'ఎఐ డేటా సెంటర్ క్లస్టర్' ప్రాజెక్ట్‌కు సంబంధించి టోక్యోలో సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాలపైన ప్రభుత్వ అధికారులు,పెట్టుబడి పెట్టనున్న సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఎన్‌టిటి డేటా, నెయిసా నెట్వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎటిటి గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సిఇఒ,ఎన్‌టిటిగ్లోబల్ డేటాచైర్మన్ షరద్‌సంఘీఈఒప్పందంలో పాల్గొన్నారు.

**దేశంలో అత్యంత శక్తివంతమైన 'ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయం'**
హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్ 25,000 జిపియులతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన 'ఎఐ సూపర్ కంప్యూటింగ్' మౌలిక సదుపాయాలను సమకూర్చనుంది. దేశంలోనే తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌టిటి డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా'ఎఐఫస్ట్ సొల్యూషన్స్‌ను' అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. 500ల మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్ మిశ్రమంతో ఈ క్లస్టర్‌ను నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను అత్యున్నత ఇఎస్‌జి (ఎన్విరాన్‌మెంటల్,సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో 'ఎఐ' ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డి జిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుంది.టోక్యోలో ప్ర ధాన కార్యాలయం కలిగిన ఎన్‌టిటి డేటా, ఐటి సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బిఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది. నెయిసా నెట్ వర్క్ ఏఐఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌ను అందించడం పట్ల ఈ కంపెనీ దృష్టి సారిస్తుంది..

**పెట్టుబడులను ఆకర్షిస్తున్న తెలంగాణ పారిశ్రామిక విధానాలు : సిఎం**
భారీ పెట్టుబడుల ఒప్పందం కుదరడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక వి ధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఎఐ సంబంధిత డిజిటల్ సేవలలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. ఎడబ్ల్యూఎస్, ఎస్టిటి, టిల్మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టిటి భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని సిఎం అన్నారు.

**రూ.562 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం**
తోషిబా కార్పొరేషన్‌అనుబంధ సంస్థ టిటిడిఐ (ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 562 కోట్లతో హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టిటిడిఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు,ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టిటిడిఐ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఫురుటా ఈ ఒప్పందాలపైన సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టిటిడిఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జిఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టిటిడిఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. అలాగే ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది.

**ఆకట్టుకున్న తెలంగాణ పారిశ్రామిక విధానాలు: టిటిడిఐ చైర్మన్ హిరోషి పురుటా :**టిటిడిఐ చైర్మన్ హిరోషి ఫురుటా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తు న్న పారిశ్రామిక విధానాలు తమను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత , తెలంగాణను పెట్టుబడుల గమస్థానంగా మార్చుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు తాము ఉత్సాహంతో ఉన్నట్లు ప్రకటించారు.

## తుడిచేందుకే భూ భారతి
(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. భూ భారతి సమస్యల పరిష్కారానికి గాను తమ కార్యాలయం, సిసిఎల్‌ఏ కార్యాలయంను అనుస ంధాని ంచే టోల్ ఫ్రీ నంబర్‌ను త్వరలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రా ంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కే ంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. 2020 ధరణి చట్టంలో సాదా బైనామా అనే అం శాన్ని గత ప్రభుత్వం తొలగించిందని అన్నా రు. గ తంలో రైతులు సాదా బైనామా కోసం ఆన్‌లైన్‌లో ద రఖాస్తు చేసుకున్న 9లక్షల 24వేల దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈచట్టం ద్వారా భూ మిపై ఎవరైతే కాస్తులో ఉంటారో వారికే పాస్‌బుక్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలకే రె వెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ధరణి పార్ట్ బిలో ఉన్న ఆరు నుండి ఆరున్నర లక్షల ఎకరాల పేదవారి భూములకు భూభారతి 2025 చట్టం ద్వారా పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ప్రతిగ్రా మంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుంద ని, పేదవారి చిరకాల కోరిక ఇం దిరమ్మ ఇల్లు అని , కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంత, పార్టీలకు అతీతం గా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూ రు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. రైతులు ఎవ రు మధ్యవర్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ంలో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుంద ని అన్నారు. తప్పులు చేసే అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవ డం జరుగుతుందన్నారు.

**పేదలసంక్షేమమేప్రభుత్వ ధ్యేయం:మంత్రి సీతక్క:**పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, తల్లి బిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో అదే తరహాలో భూమికి రైతుకు సంబంధం ఉంటుందని మంత్రి సీతక్క అ న్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి రై తులు ఆత్మహత్యలకు కారకుల అయ్యారని, నేడు రైతుల భూ సమస్యను పరిష్కరించడానికి సిఎం ఎ నుముల రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. ధరణి పేరుతో గత పాలకులు రై తులను దగా చేశారని, అధికారులను బెదిరించి గ త ప్రభుత్వ నాయకులు అక్రమంగా వందల ఎకరాల భూములు వారి పేరు మీద నమోదు చేసుకొ ని కోట్లాది రూపాయల రైతుబంధు దిగమింగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ రామకృష్ణారావు, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, భూపాలపల్లి ఎంఎల్‌ఏ గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎంఎల్‌ఏ కెఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్, ఏఎస్‌పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, డిఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జా దవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన రవి చందర్, రెవె న్యూ సదస్సుల ప్రత్యేకాధికారి కిరణ్ ప్రకాష్, ఆర్‌డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక కళాకారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## 'మూల్యం' తప్పదు
(మొదటి పేజీ తరువాయి)

వారు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇమ్మిగ్రేషన్ సమంధిత సమస్యలను అమెరికాలోని వివి ధ యూనివర్సిటీలలో ఎదుర్కొంటున్న విషయమై మాక్‌లియోడ్ 'పిటిఐ' వీడియో ఇంటర్వ్యూ లో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పాలస్తీనా అనుకూల నిరసనలలో పాల్గొనడం మొదలు చిన్న చట్టపరమైన ఉల్లంఘనల వరకూ అనేక సమస్యలపై అధికారులు ఎఫ్ 1 వీసాలను రద్దు చ చేయడంలో అమెరికాలోని భారతీయ విద్యార్థులు నానాటికీ పెరుగుతోన్న బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. గురువారం నాడు విలేకరుల సమావేశంలో కేంద్ర విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ 'ఎఫ్1వీసా స్టేటస్‌కు సంబంధించి అమెరికా ప్రభుత్వం నుంచి పలు సమాచారాన్ని అందుకుంటున్నారనే విషయం గురించి మాకు అవగాహన ఉన్నది. విద్యార్థుల వీసా విషయంలో ఏమి జరుగుతున్నదనే విషయాన్ని మేం పరిశీలిస్తూనే ఉన్నాం. మా రాయబార కార్యాలయం, కాన్సులేట్‌లు మద్దతు అందించే విషయంలో విద్యార్థులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం'అని ఆయన వివరించారు.అమెరికాకు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారు కఠినమై బల ప్రయోగ చర్యలను తప్పించుకునేందుకు స్వచ్ఛందంగా వెళ్లిపోతారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 202324 అకడమిక్ ఇయర్‌లో అమెరికా ఉన్నత విద్యాసంస్థలలో దాదాపు 3.3లక్షల మందికి పైగా నమోదు చేసుకున్నారు. అది ఇంతకుముందు సంవత్సరం 23శాతం పెరిగింది.అమెరికాలో ఉన్న విద్యార్థులలో అత్యధిక సంఖ్యలో ఉన్నది భారతీయ విద్యార్థు. ఇలా ఉంటే ఫిబ్రవరి నెలలో భారతీయ విద్యార్థుల సంఖ్య 30శాతం మేరకు పడిపోయినట్లు నివేదికలు వెల్లడించాయి. అమెరికా వైస్ ప్రసిడెంట్ జెడి,వాన్సెస్ భారతదేశాన్ని సందర్శించనున్న విషయం ప్రస్తావించినప్పుడు అమెరికా అధికారి సమాధానమిస్తూ కొద్ది రోజుల్లో జైపూర్, ఆగ్రాలో ఆయన ప్రైవేట్ పర్యటన విషయమై ప్రధాన మంత్రి నరేంద్రమోడీతోచర్చించనున్నారని చెప్పారు. ఇరుదేశాలకు చెందిన అన్ని ముఖ్యమైన అంశాల గురించి వారు చర్చిస్తారని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికార ప్రతినిధి మాక్‌లియోడ్ చెప్పారు.

## రాష్ట్రానికేం తెచ్చారు? (మొదటి పేజీ తరువాయి)

రజాకార్ల జపం తప్ప, వారికి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు పట్టబోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకేంత కాలం కులం, మతం పేరుతో పబ్బం గుడుపుతారని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోనికి వస్తుందనేది ఒక పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. ఏ రాజకీయ పార్టీపై ప్రేమ చిగురించాలనే ఉద్దేశంతో బిజెపి జిహెచ్‌ఎంసి ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తుందని నిలదీశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఒక ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎంఐఎం గెలిస్తే రాజకార్లు వస్తారా?, మళ్లీ రజకార్ల జమానా రావాలని బిజెపి ఎందుకు కోరుకుంటుందో అర్థం కావడం లేదని, కేంద్రమంత్రులుగా వారు ఎందుకు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరి ఓట్లు వస్తాయని బిజెపి స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీకి అభ్యర్థిని నిలబెట్టిందని, ఏ ఓట్ల ఆధారంగా ఆ పార్టీ పోటీలో ఉన్నదని ప్రశ్నించారు. 15 నెలల కాలంలో కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, అందుకు ఆయనకు కనీసం బాధ,సిగ్గు అనిపించడం లేదా అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం నుంచి నిధులను తీసుకొచ్చేందుకు కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెబితే , వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి చెందిన 8 మంది ఎంపిలు, 8 మంది ఎంఎల్‌ఎలు ఉండి రాష్ట్రానికి ఏం చేశారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు , విభజన హామీలపైన ఏ ఒక్కరూ , ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పథకంలో కేంద్రం వాటా ఉన్నదని చెబుతున్న కేంద్ర మంత్రి బ ండి సంజయ్, ఈ స్కీమును బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎందుకు అమలు చేయడం లేదని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కేంద్రమంత్రిగా అవకాశం వచ్చినప్పుడు ఏదో ఒక మంచి పని చేయాలని, కనీసం కరీంనగర్ జిల్లాలలోనైనా కేంద్రం నుంచి ఏదైనా ఒక ప్రాజెక్ట్‌ను తీసుకురావాలని ఆయన హితువుపలికారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాజకీయ పార్టీకి తొత్తుగా వ్యవహరించబోదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రైతు వ్యతిరేక లాంటి అనేక చట్టాలు, అంశాలలో కేంద్రంలోని బిజెపి తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్‌ఎస్ మద్దతు తీసుకున్నదని గుర్తు చేశారు. అనేక ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి కలిసి ఓట్లు వేసుకుంటాయని, ఎన్నికలు కాగానే ఆ రెండు పార్టీలు పరస్పరం పోరాడినట్టుగా వ్యవహరిస్తాయని ఆరోపించారు.

## నస్పూర్ ఎస్ఐ (మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, అదే కేసులో ఫి ర్యాదుదారుడినే నిందితుడిగా చేరుస్తానని బెదిరించి, రూ. 30,000 లం చం డిమాండ్ చేశాడని ఎస్ఐ కరుణాకర్‌పై ఆరోపణలు ఉన్నాయని, తన సొంత బ్యాంకు ఖాతాలో కాకుండా వేరే వ్యక్తి పేరు మీద ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించాలని కూడా కోరినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అనంత రం, ఫిర్యాదుదారుడు రూ. 2 లక్షలు ఇస్తున్నట్లు నటించి ఫోటో తీయగా, రూ.50,000 ఇవ్వకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడని అధికారులు వెల్లడించారు. ఈ విషయం కోర్టు దృష్టికి వెళ్లడంతో, ఫి ర్యాదుదారుడికి న్యాయస్థానం ఆదేశాల మేరకు రూ. 2 లక్షలు తిరిగి ల భించాయని, తన పదవిని దుర్వినియోగం చేసిన ఎస్ఐ కరుణాకర్‌ను ఎసి బి అధికారులు అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఎసిబి కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఎసిబికి సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. బాధితు లు ఫేస్‌బుక్, ఎక్స్, (ట్విట్టర్) ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని, వా రి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అధికారులు భరోసా ఇచ్చారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నిజామాబాద్‌లో 21 నుంచి 23 వరకు రైతు మహోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుండి 23 తేదీవరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి తెలిపారు. జిల్లాలోని స్థానిక జిజి కాలేజీ గ్రౌండ్‌లో జరిగే ఈ రైతు మహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను రైతు మహోత్సవ ప్రదర్శనలో పెట్టనున్నట్లు తెలిపారు. ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయం, అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్లు, ఎఫ్‌పిఒ, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన దాదాపు 150 కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల/ అవార్డు గ్రహీతలు కొత్త సాంకేతికత పద్ధతులపై 3 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తారని వెల్లడించారు.

## విత్తనాలపై విదేశీ కంపెనీల ఆధిపత్యం ప్రమాదకరం



ప్రత్యేక ప్రతినిధి : హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ''విత్తన సార్వభౌమత్వం మరియు జన్యునిధిపై రైతుల హక్కులు'' అనే అంశంపై గురువారం జాతీయ సెమినార్ నిర్వహించబడింది. కిసాన్ మజ్దూర్ కమీషన్, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్, దక్కన్ అభివృద్ధి సంస్థ, జన విజ్ఞాన వేదిక, ప్రకృతి వ్యవసాయ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులు ప్రముఖ గ్రామీణ రంగ, రైతు నేతలు డా.సుమన్ సహాయ్, పాలగుమ్మి సాయినాథ్, డా.దినేష్ అబ్రోల్, డా.సోమమర్ల, డా.రామాంజనేయులు, శరత్‌బాబు, వడ్డె శోభనాద్రీశ్వరరావు, కవిత కురుగంటి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త డా.సోమమర్ల ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రకృతిలోని జీవవైవిధ్యంతో రైతుల జీవన సరళి ముడిపడి ఉన్నదని, అనాదిగా ప్రకృతిలో నుండే పాత విత్తనాల భద్రతలో రైతుల, పాత్ర ప్రధానమైనదన్నారు. ఈ కారణంగా జన్యునిధి (సీడ్ బ్యాంకు) నిర్వహణలు చిన్నరైతులకు ప్రధాన పాత్ర నివ్వాలని, విత్తనాలపై ప్రైవేటు విత్తన కంపెనీల ఆధిపత్యాన్ని నిరోధించాలని కోరారు. ప్రముఖ వ్యవసాయ రంగ విశ్లేషకులు డా. సుమన్ సహాయ్ ప్రసంగిస్తూ ప్రభుత్వం రెండవ జీను బ్యాంకును ఏర్పాటు చేయటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. శ్రేష్ఠమైన విత్తనాలు, నేలతో రైతుల సేద్యం ముడిపడి ఉన్నదని, ప్రైవేటు కంపెనీలకు, విదేశీ బహుళజాతి సంస్థలకు విత్తనాలపై ఆధిపత్యాన్ని ఆమె నిరోధించాలని ప్రభుత్వాన్ని కోరేరు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా. శరత్ బాబు ప్రసంగిస్తూ ఉత్తరాంధ్ర, తూర్పు తెలంగాణలో కొన్ని రైతు విత్తన బ్యాంకులు (సామూహిక విత్తన కేంద్రాలు) లాభాపేక్ష లేకుండా ఇచ్చిపుచ్చుకునే విధానాల్తో రైతుల విత్తన అవసరాలను తీరుస్తున్నాయని, ఈ విత్తన సంస్థలకు ఐసిఆర్, ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహకారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఇక్రిశాట్ శాస్త్రవేత్త డా.కులదీప్ సింఘ్ ప్రసంగిస్తూ విత్తన భద్రతకై వివిధ ప్రభుత్వ రంగ వ్యవసాయ పరిశోధన సంస్థలు చేస్తున్న కృషిని సవివరంగా పేర్కొన్నారు. రైతుల విస్తృత విత్తన అవసరాలను తీర్చటానికే ప్రైవేటు భాగస్వామ్యంతో రెండవ విత్తన జీను బ్యాంకును ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదన్నారు. ప్రముఖ వ్యవసాయ విధాన విశ్లేషకులు, కిసాన్ మజ్దూర్ కమీషన్ అధ్యక్షులు డా.దినేష్ అబ్రోల్ ప్రసంగిస్తూ విత్తన రంగంపై ఆధిపత్యానికి ప్రైవేటు, బహుళ జాతి కంపెనీలకు కల్పిస్తే దేశంలో విత్తన వైవిధ్యం, భద్రతకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. మోన్ సాంటో కంపెనీ ప్రవేశపెట్టిన జన్యుమార్పిడి ప్రత్తి విత్తనాల ప్రకారంతో దేశీ ప్రత్తిరకాలు అంతరించిపోవడమే కాక, రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ప్రముఖ గ్రామీణ రంగ విధాన విశ్లేషకులు పాలగుమ్మి సాయినాథ్ ప్రసంగిస్తూ విదేశీ బహుళ జాతి విత్తన కంపెనీల ప్రవేశంతో అనేక రాష్ట్రాల్లో రైతుల ఆర్థిక స్థితి క్షీణించిందని, దేశంలో సగటున రోజుకి 200 మంది రైతులు ఆత్మహత్యకు ఒడిగడుతున్నారు. ప్రముఖ రైతు నాయకులు శ్రీ సారంపల్లి మల్లారెడ్డి ప్రసంగిస్తూ 1990 వ దశకం అనంతరం వ్యవసాయ పరిశోధనల్లో ప్రభుత్వ రంగ పరిశోధనలు తగ్గిపోయిన కారణంగా ఈనాడు 80 శాతం విత్తనాలు మార్కెట్‌లో ప్రైవేటు విత్తనాల కంపెనీల ఆధీనంలోకి చేరాయన్నారు. ప్రముఖ రైతు నాయకులు శ్రీవడ్డే శోభనాదీశ్వర్‌రావు ప్రసంగిస్తూ విత్తన చట్టాన్ని పార్లమెంటులో 2004లో ప్రవేశపెట్టినా, ప్రైవేటు విత్తన కంపెనీల ఒత్తిడి కారణంగానే ఇప్పటికీ ఈ చట్టాన్ని ప్రభు త్వం ఆమోదించలేదు. ప్రముఖ పర్యావరణరంగ నాయకులు ప్రొఫెసర్ నర్సింహారెడ్డి ప్రసంగిస్తూ నకిలీ విత్తనాలు వలన రైతులు విపరీతంగా నష్టపోతున్నారని, సత్వరం విత్తన చట్టాన్ని తేవాలని కోరారు. ఈ జాతీయ సదస్సులో స్వామినాథన్ సంస్థ (చెన్నై)కు చెందిన శ్రీ ఇజ్రాయిల్ కింగ్, ఉత్తరాంధ్ర రైతు ద్వ్యనిధి సంస్థ, సుస్థిర వ్యవసాయ సాగు సంస్థ, దక్కన్ అభివృద్ధి సంస్థలకు చెందిన రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు 5 విభాగాలుగా ఏర్పడి వివిధ విత్తన సమస్యలు, చేపట్టవలసిన విధానాలపై చర్చించారు. విత్తన రంగంపై ప్రైవేటు, విదేశీ బహుళ జాతి కంపెనీల ఆధిపత్యం విత్తనసార్వభౌమత్వానికి, ఆహారభద్రతకు, రైతు మనుగడకు ప్రమాదకరమని విత్తనరంగ పటిష్టతకు ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశోధనలను ప్రోత్సహించాలని, రైతు ప్రయోజనాలకై పార్లమెంటులో విత్తన చట్టా న్ని వెంటనే ఆమోదించాలని జాతీయ సదస్సు తీర్మానించింది. డా.శరత్‌బాబు వందన సమర్పణతో సదస్సు ముగిసింది.

## ప్రతీ కార్యకర్తా శక్తివంచన లేకుండా కృషి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : సిపిఐ ఎదుగుదల కోసం ప్రతి ఒక్క కార్యకర్త శక్తివంచన లేకుం డా కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ కరీంనగర్ నగర 11వ మహాసభ సంధర్భంగా సిపిఐ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. రిపోర్టును నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ప్రవేశపెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ఎర్రజెండా అంటే దోపిడీదారులకు పేదలను అణిచివేసే వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతాయని పేర్కొన్నారు. సిపిఐ మార్క్సిజం, లెనినిజం పునాదులపై ఆవిర్భవించిందన్నారు. సమాజంలో అంతరాలు లేని సమాజ స్థాపన కోసం నిర్విరామ పోరాటం చేసి ఉందని, భూమి లేని నిరుపేదలకు భూమి, ఇండ్లస్థలాలు, రేషన్‌కార్డుల కోసం అనేక పోరాటాలు చేసిన ఘన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. కరీంనగర్ నగరంలో అనేక భూపోరాటాలు చేసి వేలాదిమందికి ఇండ్లు ఇప్పించిన చరిత్ర సిపిఐదేనని, చింతకుంట, రేకుర్తి, బద్దిపల్లి గ్రామాల్లో ఎంతోమంది నిరుపేదలకు ఇండ్లస్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించడంలో సిపిఐ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి రాజ్యమేలిందన్నారు. అవినీతిపై పాలక ప్రభుత్వాలు నోరు మెదకపోవడం సిగ్గుచేటన్నారు. తీగల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్‌లలో కోట్ల రూపాయల దోపిడీపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. అన్ని డివిజన్లలో పార్టీ, ప్రజాసంఘాల విస్తరణకై ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ 100 సంవత్సరాలు చరిత్ర గల పార్టీ ఈ దేశంలో సిపిఐ మాత్రమేనన్నారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పంజాల శ్రీనివాస్, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, శార ద, బోనగిరి మహేందర్, నగర కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.

## వక్ఫ్ చట్టం వెనక్కు



### జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం వలన మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని వెంటనే చట్టం సవరణను వెనక్కి తీసుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ నల్లగొండ జిల్లా సమితి కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మగ్దూమ్ భవన్‌లో జరిగింది. సమావేశానికి పల్లా వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్నివర్గాల ప్రజలు కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరిని పోరాటాల ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంపన్న వర్గాలకు దేశ సంపదను కట్టబెట్టడం కాకుండా వారికి అనుకూలమైన చట్టాలను తీసుకొచ్చి పేద ప్రజలపై ధరలు, పన్నుల భారం మోపుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం 500 రూపాయలు వంటగ్యాస్‌పై రాయితీ ఇస్తుంటే కేంద్రప్రభుత్వం 50 రూపాయలు గ్యాస్ ధర పెంచడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని ఎత్తివేసి భూ భారతి తీసుకురావడం జరుగుతుందని ఈ భూ భారతి ద్వారానైనా కొన్ని ఏళ్ల నుండి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్ అంజయ్య చారి, బులుగూరి నరసింహ, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు వేగవంతం చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

వాతావరణం మార్పుల వల్ల వడగాలులతో కురుస్తున్న అకాల వర్షాల వలన ఆరుగాలాలు రైతులు కష్టపడి పండించిన పంటలు పూర్తిగా దెబ్బతినిపోయాయని వెంటనే సర్వే చేసి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరిధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. సిపిఐ గ్రామ శాఖ, మండల సమితి మహాసభలు మే, జూన్ మాసంలో జిల్లా వ్యాప్తంగా ఉత్సాహపూరితంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 'సుప్రీం' ఆదేశాలను స్వాగతిస్తున్నాం




### సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

హైదరాబాద్ : వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తూ మల్కాజ్‌గిరిలోని మసీదు అస్రా వద్ద శుక్రవారం భారీ సమావేశం జరిగింది. మే 5వవెలువడే తుది తీర్పు, ముఖ్యంగా ముస్లింల లోని లౌకిక శక్తుల ఆందోళన, ఉద్రిక్తతలను తొలగిస్తుందని ఆశిస్తున్నట్లు సమావేశంలో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బహిరంగ సభను ఉద్దేశించి సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ రాజ్యాంగంలోని 13, 14, 15, 21, 300ఎ అధికరణాల ఉల్లంఘనను సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. సాధారణ ముస్లింలకు సహాయం చేస్తామనే ప్రభుత్వం వాదన బూటకమని, ముస్లిం సమాజం అంచనాలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా వేసిన పిటిషనర్లలో ఒకరని, సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వును లౌకిక శక్తులందరూ స్వాగతిస్తున్నారని సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను చేర్చడాన్ని సుప్రీంకోర్టు బాగా ప్రశ్నించిందని, అలాగే వక్ఫ్ పేరుతో చాలా కాలంగా కొనసాగుతున్న ఆస్తులను తొలగించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. అటార్నీ జనరల్‌తుషార్ మెహతా సుప్రీంకోర్టు ఆదేశాలను కఠినమైనవిగా, అతిక్రమణగా అభివర్ణించడం సరికాదని ఆయన అన్నారు. రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించబడినప్పుడు, ప్రాథమిక సూత్రాలను పరిరక్షించడం సుప్రీంకోర్టు బాధ్యత అని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం 2024పై 96 లక్షల సూచనలు , వ్యాఖ్యలను పరిశీలించినప్పటికీ, ఆశ్చర్యకరంగా వారం రోజుల సమయం కోరిందని ఆయన అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం మెరుగైన పరిపాలన గురించి పార్లమెంటు ఉభయ సభల్లో కిరణ్ రిజిజు పదే పదే చేసిన ప్రకటనలు పూర్తిగా తప్పుదోవ పట్టించేవి అని, అవాస్తవాలని సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. సికిందరాబాద్ మసీదు కమిటీ అధ్యక్షుడు ఖయ్యుముద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభకు ఆయన స్వాగతం పలికారు. బదర్ యుద్ధం , భగవంతుని సహాయం గురించి ఆయన ఉదాహరించారు. మౌలానా మునావర్ అలీ మాట్లాడుతూ ఈ నల్ల చట్టం ఉపసంహరించబడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మల్కాజ్‌గిరిలోని అస్రా మసీదు కమిటీ అధ్యక్షుడు అహ్మద్ వందన సమర్పణ చేశారు.

## రాష్ట్రంలో మిగులు భూదాన భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలి

### దేశవ్యాప్తంగా ఏడాదిపాటు భూదాన ఉద్యమ వజ్రోత్సవాలు

### అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మిగులు భూదాన భూములను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూదాన ఉద్యమం 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం అఖిల భారత సర్వోదయ మండలి నిర్వహించిన సమావేశంలో భూదాన భూదాత వెదిరె రామచంద్రారెడ్డి కొడుకు వెదిరె ప్రోమోతిష్ చంద్రరెడ్డి, అఖిల భారత సర్వసేవ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోలుపునురి కృష్ణ గౌడ్‌లతో కలసి వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆధ్యాత్మిక వారసుడు ఆచార్య వినోబా భవే చేపట్టిన స్వరాజ్యం, సర్వోదయ ఉద్యమాలలో భాగంగా 1951 ఏప్రిల్ 18 తేదీన తెలంగాణలోని పోచంపల్లిలో భూదాన ఉద్యమం ప్రారంభించగా, సామాజిక కార్యకర్త, భూస్వామి వెదిరె రామచంద్రారెడ్డి తన 1000 ఎకరాల భూమిని దానం చేశారని గుర్తు చేశారు. కొందరు భూ అక్రమార్కులు వెదిరె రామచంద్ర రెడ్డి కుటుంబసభ్యుల పేర్లు చెప్పి భూదాన భూములు అమ్ముకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు. రాష్ట్రం లో మిగిలి ఉన్న భూదాన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం రక్షించి, తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి భూమిలేని నిరుపేదలకు పంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా విస్తరించిన భూదాన ఉద్యమం 75 ఏళ్ల సందర్భంగా శుక్రవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణంలో ప్రారంభమైన భూదాన ఉద్యమం వజ్రోత్సవాలను ఏడాది పాటు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నామని తెలిపారు. 2025 జులై 17న హైదరాబాద్ లో లక్షమందితో ఈ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అయన ప్రకటించారు. వెదిరె ప్రోమోతిష్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూదాన భూముల లెక్క తేల్చి, అక్రమార్కుల నుండి వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. తోలుపునురి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ వేల ఎకరాల భూదాన భూములు కబ్జాకు గురవుతుంటే తెలంగాణ భూదాన్ అండ్ గ్రామ్దాన్ యాక్ట్ 1965 సెక్షన్ 24 (ఏ) కింద కాంపిటెంట్ అథారిటీ అయిన రెవెన్యూశాఖ ఏమాత్రం పట్టించకోకపోవడం లేదని, వెంటనే స్పందించి ఆ భూములను పరిరక్షించాలని కోరారు.

## అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం: మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకం' అమలులో అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా వేటు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవకతవకలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరగకుండానే, పూర్తయినట్టుగా తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేసిన బిల్ కలెక్టర్ జగదీష్‌పై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. దీంతో జగదీష్‌ను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 18 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసినట్టు తప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, సంబంధిత బిల్ కలెక్టర్‌కు అధికారులు మెమో జారీ చేశారు. తాను పొరపాటున ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేశానని జగదీష్ సంజాయిషి ఇచ్చారు. బిల్ కలెక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి వెల్లడించారు.

## వారసత్వ సంపదను రక్షించుకుందాం: మంత్రి జూపల్లి



ప్రజాపక్షం/హైదరాబాద్: వారసత్వం అనేది జీవి మనుగడకే కాకుండా సమాజ మనగుడకూ మైలురాయిగా నిలుస్తుందని, ఒక సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాలు కలిసి పని చేయాల్సి ఉంటుందని, ఇందులో వారసత్వం అనే అంశం ప్రధాన పాత్ర పోషిస్తుందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సంవత్సరం థీమ్ ద్వారా, ప్రకృతి విపత్తులు, సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక వారసత్వ ప్రదేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి సారించబడిందని, గత 60 సంవత్సరాల్లో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యూమెంట్స్ అండ్ సైట్స్ (ఐసిఒఎంఒఎస్) చేపట్టిన చర్యల ద్వారా సేకరించిన అనుభవాల నుంచి మనం ఏం నేర్చుకోవచ్చో, భవిష్యత్‌లో అపాయాలను ఎలా ఎదుర్కొనాలో పై అంశంపై చర్చకు ఇది ప్రాధాన్యత ఇస్తుందని ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాలక్రమంలో, తెలంగాణ ప్రపంచ వారసత్వ జాబితాలో తన స్థానాన్ని స్థిరంగా పెంచుకుంటూ వస్తుందని, 2021 లో రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించగా, ఈ సంవత్సరం ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో స్థానం దక్కడం తెలంగాణకు గర్వకారణమని అన్నా రు. తెలంగాణ ప్రభుత్వం తన విస్తృత సాంస్కృతిక, ప్రకృతి సంబంధ వారసత్వాన్ని రక్షించేందుకు, పునరుద్ధరించేందుకు, ప్రోత్సహించేందుకు అనేక కీలక చర్యలు తీసుకుంటుందని, ఈ ప్రయత్నాలు మన వారసత్వం భవిష్య తరాలకు స్ఫూర్తిగా, విజ్ఞాన భండారంగా, ఐక్యతకు చిహ్నంగా నిలబడేలా చేస్తాయని వివరించారు. వీటిని సంరక్షించి తరతరాలకు అంతే భద్రంగా అందించాల్సిన సమిష్టి బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

## నకిలీ నోట్లతో రూ.35 లక్షల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాపక్షం/హైదరాబాద్: బంగారు దుకాణం సేల్స్‌మెన్‌కు నకిలీ నోట్లు ఇచ్చి రూ.35 లక్షల విలువైన 400 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లిన దుండగుల ఉందంతం ఒకటి హైదరాబాద్‌లో చోటుచేసుకుంది.అత్తాపూర్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్ (37) హిమాయత్‌నగర్‌లోని వినతి జ్యువెలర్స్ దుకాణంలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం అమిత్ జైన్ అనే వ్యక్తి మొబైల్ నంబర్ 7890198601 ద్వారా వినతి జువెలర్స్ దుకాణానికి చేసి, సూరత్‌లో తాను కూడా నడుపుతున్నట్లు తెలియజేసారు. అయితే తమ దుకాణానికి హోల్‌సేల్ ధరలో బంగారు సరఫరా చేయాలని అమిత్ జైన్ కోరాడు. తమకు కిలో బంగారం కావాలని, అయితే తమ వద్ద 400 గ్రాముల బంగారం కొనుగోలు చేసేందుకు లిక్విడ్ నగదు ఉందని, మిగిలిన 600 గ్రాముల విలువైన బంగారాన్ని ఆర్‌టిసిఎస్ చెల్లించిన తరువాతనే తీసుకుంటామని అమిత్‌జైన్ నమ్మించాడు. ముందుగా తమ మనిషి 400 గ్రాముల బంగారం కొనేందుకు రూ.35 లక్షలు లిక్విడ్ క్యాష్ తీసుకుని వస్తున్నాడని, అతని నుంచి రూ.35 లక్షలు నగదు తీసుకుని 400 గ్రాముల బంగారం ఇవ్వాలని అమిత్‌జైన్ చెప్పాడు. అతడు చెప్పినట్లుగానే రెండు రోజుల్లోనే సూరత్ నుంచి ఓ వ్యక్తి నగదు కలిగిన బ్యాగ్‌లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. అతని వద్దకు వినతి జువెలరీ షాప్ మార్కెటింగ్ మేనేజర్ మహ్మదా హుస్సేన్ 400 గ్రాముల బంగారాన్ని తీసుకెళ్లి ఇచ్చాడు. అతని నుంచి నగదు బ్యాగ్‌ను తీసుకుని హిమాయత్‌నగర్‌లోని వినతి జువెలరీ షాప్‌కు చేరుకుని చూసే సరికి అందులో అన్ని నకిలీ రూ.500 నోట్లు ఉన్నాయి. మోసపోయామని గ్రహించిన వినతి జువెలరీ షాప్ నిర్వాహకులు లోబోదిబోమన్నారు.

**మరో ట్విస్ట్‌తో పట్టుబడ్డ ఇద్దరు నిందితులు...**

నాలుగు రోజుల క్రితం వినతి జువెలరీ షాప్‌కు మయూర్ జైన్ అనే వ్యక్తి మొబైల్ నంబర్ 9574924998 ఉపయోగించి కాల్ చేశాడు. రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్‌లో తమకు మోక్ష్‌గోల్ జ్యువెలర్స్ దుకాణం ఉన్నదని నమ్మించాడు. తముకు పాత బంగారు నగలు కావాలని కోరాడు. గతంలో తాము మోసపోయిన విధంగానే ఇది కూడా ఉందని గ్రహించిన వినతి జువెలరీ షాప్ వారు జిఎస్‌టి పోర్టల్‌ను పరిశీలించగా, మోక్ష్ గోల్ జువెలర్స్ పేరుతో జిఎస్‌టి వివరాలు కనిపించలేదు. మయూర్ జైన్ కూడా ముందుగా తనకు 400 గ్రాముల బంగారు కావాలని అభ్యర్థించాడు. తమ ఇద్దరు మనుషులు రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు వస్తాడని వారి నుంచి రూ.35 లక్షలు డబ్బులు తీసుకుని బంగారాన్ని ఇవ్వాలని మయూర్ జైన్ సూచించాడు. అదే పద్ధతిలో గురువారం రాజస్థాన్ నుంచి ఇద్దరు వ్యక్తులు నగదు బ్యాగ్‌తో నారాయణగూడలోని మైఫిల్ హోటల్ వద్దకు వచ్చారు. నకిలీ డబ్బులతోనే వస్తారని ముందే పసిగట్టిన వినతి జువెలరీ మేనేజర్ మహ్మద్ హుస్సేన్ తాను కూడా నకిలీ బంగారాన్ని ప్యాక్ చేసుకుని అక్కడికి చేరుకున్నాడు. వీరు బ్యాగ్‌లు మార్చుకుంటున్న సమయంలో రాజస్థాన్ నుంచి వచ్చిన ఇద్దరు అగంతకులను స్థానికుల సహాయంతో పట్టుకుని సిసిఎస్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వీరు రాజస్థాన్‌కు చెందిన మంగేలాల్ (21), ఇంద్రజిత్ (30) అని తేలింది. అయితే ఫిబ్రవరిలో ఇదే పద్ధతితో మోసగించిన నిందితుల వివరాలను సైతం మంగేలాల్, ఇంద్రజిత్‌లు పోలీసులకు వెల్లడించారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## భయం పుట్టిస్తున్న శిక్షలు



### గంజాయి, డ్రగ్స్ నిందితుల్లో పెరుగుతున్న గుబులు

### శిక్షలు పడుతున్న జిల్లాల్లో టాప్‌లో మెదక్, సంగారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో వరుస శిక్షల తీర్పులు గంజాయి, డ్రగ్స్ నిందితుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. గంజాయి, డ్రగ్స్ పట్టుబడిన కేసుల్లో వరుసగా నిందితులకు శిక్షలు పడుతున్నాయి. డ్రగ్స్, గంజాయి శిక్షలు పడుతున్న జిల్లాలో తెలంగాణలో మెదక్, సంగారెడ్డి జిల్లాలు టాప్‌లో నిలిశాయి. ఎక్సైజ్ శాఖ అంటేనే .. మద్యం, తయారీ, అమ్మకాలపైనే యంత్రాంగం దృష్టి పెడుతారు అనే అపవాదు ఉంది. కాని ఎక్సైజ్‌శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, ఎక్సైజ్ టీమ్‌లు ఉంటాయనే విషయం చాల మందికి తెలియదు.

మద్యం అమ్మకాలతో పాటు నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, డ్రగ్స్, గంజాయి, ఆల్ఫ్రోజోలం, క్లోరో హైడ్రేడ్, కల్తీ మద్యం తయారీ, అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టి పెట్టి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తారనే విషయం చాలా మంది తెలియదు.

**డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం..**

సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన అదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖలో డైరెక్టర్ పరిధిలో పని చేసే నాలుగు ఎస్టీఎఫ్ టీమ్లతో దాడులను ముమ్మ చేయించడం గంజాయి, డ్రగ్స్‌ను పెద్ద మొత్తంలో పుట్టకోవడం, కేసులు నమోదు చేస్తూ ఉండడంతో ఎక్సైజ్‌శాఖకు పోలీసుల స్థాయిలో గుర్తింపు లభించింది. ఆపరేషన్ ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలకు చెక్ పడింది. 2024లో 1162 ఎన్‌పిడిఎస్ కేసుల నమోదు, 6400 కేజీల గంజాయి 683.81ఎండీఎంఎ డ్రగ్స్‌ను పట్టుకొని ఎక్సైజ్ శాఖ సత్తా చాటారు.

**శిక్షలు పడుతున్న జిల్లాల్లో టాప్‌లో మెదక్, సంగారెడ్డి**

ఎక్సైజ్ శాఖలో తెలంగాణ జిల్లాలో నమోదైన కేసుల్లో ఎక్కువ శిక్షలు పడుతున్న జిల్లాల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లా మొదటి, రెండో స్థానాల్లో నిలిశాయి. సంగారెడ్డిలో 21 కేసుల్లో శిక్షలు పడ్డాయి, మెదక్‌లో 10 కేసుల్లో శిక్షలు పడ్డాయి. ఖమ్మం, కొత్తగూడంలో 9 కేసుల్లో శిక్షలు, హైదరాబాద్ మల్కాజిగిరిలో 6, మొత్తంగా తెలంగాణలో 60 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. మహబూబ్‌నగర్‌లో తొలిసారిగా 5.030 కేజీల హషీష్ అయిల్‌ను ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు సరఫరా చేస్తు ఉండగా పట్టుబడిన ఇద్దరు నిందితులు నర్తం రాయ్, ధర్మేందర్ కుమార్ రాయ్లుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు.

సంగారెడ్డిలో గురువారం అద్దెంకి సంగప్పా అనే వ్యక్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. సంగారెడ్డిలో వరుసగా గత రెండు మూడు నెలల నుంచి 6 కేసుల్లో శిక్షలు పడ్డాయి.

**రాబోయే కాలంలో శిక్షల పరంపర..**

2024లో చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేట్లో భాగంగా 100 గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు, హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్‌తో పట్టుబడిన 950 కేసుల్లో నిందితులకు భారీగా శిక్షలు పడే అవకాశం ఉంటుందని భావిస్తుంది. నిందితులకు శిక్షలు పడడం పెరిగితే క్రైమ్ రేట్ తగ్గుతుందని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తుంది.

**శిక్షలు పడితే క్రైమ్ రేట్ తగ్గుతుంది: విబి కమలాసన్‌రెడ్డి**



కేసుల్లో నిందితులకు శిక్షలు పడినపుడు మళ్లీ క్రైమ్ చేయడానికి భయపడుతారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి తెలిపారు. మిగితావారు కూడ నేరాలు చేయడానికి భయపడుతారు. శిక్షలు పడితే క్రైమ్‌రేట్ తగ్గుతుంది. నేరస్తులు గంజాయి, డ్రగ్స్‌తో పట్టుబడినపుడు సరియైన రీతిలో పంచనామా, చార్జ్‌షీట్ రాసి, పెట్టినపుడు కేసు బలంగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఎక్సైజ్‌శాఖలో నమోదు చేసిన కేసుల్లో శిక్షలు పడుతుండడం శుభ పరిణా మం అని పేర్కొన్నారు.

ప్రజాపక్షం
శనివారం, ఏప్రిల్ 19

# సన్న బువ్వ సవ్వడి

అడుగడుగునా వివాదాలపై రాష్ట్ర ప్రభుత్వ సవారీ మధ్య మొదలైన సన్న బియ్యం పథకం సాఫల్యత తగినంతగా ప్రచారంలోకి రాలేదు. గత నెల 30 వ తేదీన తెలుగువారి నూతన సంవత్సరాది రోజున రేషన్‌కార్డుపై విప్లవాత్మకమైన సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. పౌరసరఫరాల శాఖామాత్యులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్వంత నియోజకవర్గమైన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో భారీ జనసందోహం మధ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పథకం ప్రారంభమైంది. అయితే, ఆ వెంటనే వచ్చిన కంచ గచ్చిబౌలి వివాదం రణగొణ ధ్వనుల మధ్య ఈ ఉత్తమ పథకం సుగుణం మరుగున పడింది. అయినప్పటికీ, లబ్ధిదారుల ఇంట వారి కుటుంబసభ్యుల నడుమ సన్నబువ్వను తింటూ వారి సంబరాన్ని పంచుకోవాలనే ప్రభుత్వ ఆలోచన ప్రభావం చూపుతోంది. శ్రీరామనవమి రోజున తన మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో బూరం శ్రీనివాస్ అనే లబ్ధిదారుని ఇంట ఎలాంటి అట్టహాసం లేకుండా సన్నబువ్వ తిన్నారు. ఆ కుటుంబం రోజు వండుకునే కూరగాయలతోనే భోజనం చేయడం, సొట్లు పడిన చెంబుతో వారంతా చేతులు కడుక్కున్న దృశ్యాలు ప్రజలను అబ్బురపరిచాయి. ఆ తరువాత ఎంఎల్‌ఏలు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు వరుసగా లబ్ధిదారుల ఇంట సన్నబువ్వ తినడంతో పాటు, సిద్ధిపేట జిల్లా అక్బర్‌పేట గ్రామానికి చెందిన కూతురు లక్ష్మి అనే లబ్ధిదారు ఏకంగా తన కుటుంబానికి ఆ నెలకు వచ్చిన 24 కిలోల సన్నబియ్యంతో సంబురంగా 138మందికి భోజనం పెట్టడం వంటివి ఆకర్షించాయి.

ఈ పథకాన్ని మసకబార్చేందుకు ప్రతిపక్షాలు మొదట్లో శతథా ప్రయత్నించాయి. సన్నబియ్యంలో నూకనే ఎక్కువుందని బిఆర్ఎస్, ఆ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని బిజెపి లు చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు ఆదిలోనే తిప్పికొట్టారు. నాణ్యమైన బియ్యం ఇస్తున్నారని స్వయంగా షాపులకు వెళ్ళి చూపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వాటా కూడా ఉన్నదనే మాట నిజమే అయితే తెలంగాణలో లాగా దేశవ్యాప్తంగా, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలలో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదనే కాంగ్రెస్ ప్రశ్నకు బిజెపి వద్ద జవాబు లేకుండా పోయింది. దీంతో క్రమంగా గ్రహణం వీడి సన్నబియ్యం పథకం వెలుగులు నెమ్మదిగా ప్రజల్లో ప్రసరిస్తున్నాయి. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రశంసలందుకుంటోంది.

మొన్నమొన్నటి వరకు రేషన్ కార్డుపై దొడ్డు బియ్యం ఇవ్వడంతో వాటిని తీసుకునేందుకు అనేకమంది పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనిని అనువుగా తీసుకొని కొందరు డీలర్లు వాటికి ఎంతో కొంత ధర కట్టి లబ్ధిదారుడికి డబ్బు చెల్లించి, ఆ బియ్యం ఇంటికి చేరకుండానే ఇడ్లీ, దోశల బండ్లు, హోటళ్ళకు మళ్ళించడం నుంచి మొదలు పెద్ద స్థాయిలో రీసైక్లింగ్ చేసే మాఫియాకు కూడా గేట్లు లేచాయనేది విస్మరించలేని వాస్తవం. ఈ వ్యవహారంలో డీలర్లు, మిల్లర్లు, నాయకులు, అధికారుల మధ్య పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు కూడా వార్తలనేకం వచ్చాయి. లబ్ధిదారుడు బహిరంగ మార్కెట్‌లోనే అధిక ధరతో సన్న బియ్యం కొనే పరిస్థితి ఉండేది. దీంతో నెలకు ఒక సగటు కుటుంబానికి రూ.1000 నుంచి రూ.1200 వరకు బియ్యానికే ఖర్చయ్యేది. ఇప్పుడు రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇస్తుండడంతో ఒక్కసారి మార్పు కనపడుతోంది. గతంలో బియ్యం తీసుకోని మధ్యతరగతి కార్డు దారులు కూడా రేషన్ షాపుల ముందు క్యూ కడుతున్నారు. కుటుంబంలో ఒకరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా ఇస్తుండటం ద్రవ్యోల్బణం చిందులేస్తున్న కాలంలో జేబుపై భారీగానే భారం తగ్గింది. అంతకుముందు రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల రేషన్ కార్డులు 2.80 కోట్ల మంది లబ్ధిదారులు ఉండేవారు. అదనంగా కార్డులు లేని 30 లక్షల మందిని చేర్చి, 3.10 కోట్ల మంది అంటే జనాభాలో 84 శాతానికి సన్న బియ్యం అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అన్న యోజన పథకానికి కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి బియ్యం పథకానికి రూ.10,655 కోట్లు ఖర్చవుతుండగా, సన్నబియ్యం ఇచ్చేందుకు రాష్ట్రం అదనంగా రూ.2,858 కోట్లు ఖర్చు చేస్తున్నది. దీనిని అదనపు భారంగా భావించడం కంటే పెట్టిన ఖర్చుకు ఆర్థిక చక్రంలో రెండింత ప్రయోజనం కనిపిస్తుందని పాలకులు గుర్తెరగాలి. అటు సన్న బియ్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌తో రైతాంగానికి, ఇటు ఉచిత సన్నబియ్యంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి ప్రయోజనం చేకూర్చే ఈ పథకం ఉభయ తారకమే. ఇప్పటికే ఆర్‌టిసి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు, ఆర్‌టిసి సంస్థకు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో కుటుంబ నెలవారీ ఖర్చుల భారం తగ్గడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తికాలం చిత్తశుద్ధితో అమలుచేస్తే వచ్చే ఎన్నికల్లో ఆ ప్రయోజనం కచ్చితంగా దక్కుతుందని గుర్తుంచుకోవాలి.

# 2014 నుంచి కనీస పెన్షన్‌ను రూ.వెయ్యికే పరిమితం చేసిన మోదీ సర్కార్

**గ్యాన్ పాఠక్**

ఇటీవల ప్రచురితమైన రెండు ముఖ్యమైన వార్తలు అనేక మందిని దిగ్భ్రాంతికి గురిచేశాయే తప్ప భారతదేశంలో అధికారంలో ఉన్న పాలకులకు మాత్రం చీమకుట్టినట్లుగా కూడా లేదు. మొదటి వార్త, ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) ద్వారా సామాజిక భద్రత కింద కార్మికులకు కనీస పెన్షన్ 2014 నుంచి నెలకు రూ.1,000 మాత్రమే వస్తుంది. అదే సమయంలో భారత సామాజిక భద్రత వర్తించే వారి సంఖ్య మూడేళ్ళలో రెట్టింపు అయిందని, 2021లో 24.4 శాతం నుంచి 2024లో 48.8 శాతానికి పెరిగిందని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. రెండవ వార్త, మహిళా ఉద్యోగులు 2014 నుంచి రెండింతలు అయ్యారని, అందులో ఎలాంటి చెల్లింపులు లేకుండా ఇంట్లో పని చేసుకునే మహిళలను కూడా కార్మికులుగా లెక్కించారు.

నేటి రోజుల్లో, ఢిల్లీలో 18–59 ఏళ్ల వయసు కలిగిన మహిళలకు ఆర్థిక సహాయంగా నెలకు రూ.2,500 చొప్పున అందించే సామాజి క భద్రతా పథకాలు దేశంలో అనేకం ఉన్నాయి. అంతే కాకుండా 60 – 69 ఏళ్లు కలిగిన వ్యక్తులకు నెలకు రూ.2,000, 70 ఏళ్ళు పైబడిన వారికి నెలకు రూ.2,500 చెల్లించే వృద్ధాప్యపు పెన్షన్ పథకాలు ఉన్నాయి. అలాగే 60–69 ఏళ్ళ మధ్య వయసు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాల ప్రజలకు అదనంగా రూ.500 వృద్ధాప్యపు పెన్షన్ కూడా ఉంది. ఇవన్నీ ఉచితమే. కానీ, పనిచేస్తూ, భవిష్య, కుటుంబ పెన్షన్ నిధికి తమవంతుగా చెల్లించే కార్మికులకు కనీస పెన్షన్ రూ.1,000 మాత్రమే లభించడం నిజంగా అన్యాయమే. ముఖ్యంగా 2014 నుంచి ధరల పెరుగుదలను పరిగణలో తీసుకుంటే ఇది దారుణం. కేవలం రాజకీయ అవసరాలకోసం ఇచ్చే ఆర్థిక సహాయం, అది కూడా ఉచితంగా ఇవ్వడాన్ని పోల్చుకుంటే రెండింతల అన్యాయం. ఢిల్లీ, కేంద్రంలో రెండు చోట్ల అధికారంలో ఉన్న బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్‌ల పరిధిలో కార్మికుల పట్ల సునితత్వం లోపించటానికి పరాకాష్ఠ.

కార్మికుల పట్ల నిర్లక్ష్యమే కాకుండా, ఢిల్లీలోనే కాకుండా రాష్ట్రాల్లో కూడా సామాజిక భద్రతా పథకాలు సరిచేయాలి. ఎందుకంటే ఇవి హాస్యాస్పదమైన అసమానతలను సృష్టించాయి. ఉదాహరణకు, 59 ఏళ్ళ మహిళ ఆర్థిక సహాయంగా రూ.2500 పొందవచ్చు, కానీ ఆమెకు 60ఏళ్ళు నిండితే వృద్ధాప్య పెన్షన్ కింద ఆర్థిక సహాయం రూ.2000కు తగ్గుతుంది. అంటే ఆమెకు 60 ఏళ్ళు వచ్చాక సమస్యలు తగ్గుతాయన్నట్టు ఉంది. వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. 60–69ఏళ్ళ మహిళకు వైద్య, ఇతర సమస్యలు ఎక్కువగా ఉంటాయి. కానీ 60 ఏళ్ళలోపు వయస్సు ఉన్న మహిళలకు ఇచ్చే రూ. 2500 తో పోలిస్తే అంతకుపై బడిన వయసు ఉన్న మహిళలకు కేవలం రూ.2000 మాత్రమే ఆర్థిక సహాయం అందుతుంది. ఇప్పుడు ఇపిఎఫ్ఒ కింద కనీస కుటుంబ పెన్షన్‌గా కేవలం రూ.1000 పొందే మహిళా కార్మికురాలి గురించి ఆలోచించండి. ఇది పూర్తిగా హాస్యాస్పదం.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సామాజిక భద్రతా పరిధిని రెట్టింపు చేసామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, కార్మికులకు కనీస కుటుంబ పెన్షన్‌ను పెంచాలని కేంద్ర కార్మిక సంఘాలు, కార్మిక సంబంధిత పార్లమెంటరీ స్థాయీ సంఘాలు పదే పదే కోరినప్పటికీ, 2014 నుండి కనీస కుటుంబ పెన్షన్‌ను అలాగే కొనసాగిస్తుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిర్వహించిన బడ్జెట్ సంప్రదింపుల సమయంలో అనేక కార్మిక సంఘాలు కనీస కుటుంబ పెన్షన్‌ను పెంచాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. 2014లో కేంద్రం నిర్ణయించిన కనీస పెన్షన్‌ను నెలకు రూ.1000 నుండి కరువు భత్యంతో కలిపి రూ.7,500కు పెంచాలని పెన్షనర్ల ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. 2014 నుండి ప్రతి ఏడాది కనీస పెన్షన్ పెంచాలనే డిమాండ్ వినపడుతోంది. కానీ కేంద్రం ఎటువంటి చర్య తీసుకోలేదు.

కొద్ది రోజుల క్రితం, పార్లమెంటుకు సంబంధించిన స్థాయీ సంఘం 2025–26 సంవత్సరానికి సంబంధించి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై తన నివేదికను సమర్పించింది. అందులో ఇపిఎఫ్ఒ కింద సభ్య పెన్షనర్లకు నెలవారీ కనీస పెన్షన్‌గా ఉన్న రూ.1,000 ను సవరించాల్సిన తక్షణ అవసరం ఉందని పేర్కొంది.



2014లో పెన్షన్ పెంపునకు మోదీ ప్రభుత్వం అనేకసార్లు ఘనత తీసుకున్న విషయం విడ్డూరంగా ఉంటుంది. వాస్తవం ఏమిటంటే ఆ నిర్ణయం కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం తీసుకోగా, దానిని మోదీ ప్రభుత్వం అమలు చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ కనీస పెన్షన్‌ను రూ.1000 కు పెంచాలని నిర్ణయించిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బిజెపి ప్రతిపక్షంలో ఆ మొత్తం ఏ మాత్రం సరిపోదని విమర్శించింది. బిజెపి నాయకుడు ప్రకాశ్ జావదేకర్ రూ.1000పెన్షన్‌ను 'స్వల్పమైనది' అని విమర్శిస్తూ కనీస పెన్షన్‌ను నెలకు రూ.3000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ధరలు, ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగినప్పటికీ, పెన్షన్‌ను పెంచాలని కార్మికులు డిమాండ్ చేసినప్పటికీ, పార్లమెంటరీ కమిటీల సిఫార్సులు చేసినప్పటికీ, కనీస పెన్షన్‌ను రూ.1000 నుండి పెంచడానికి నిరాకరించింది.

ప్రస్తుతం భారతదేశంలో కనీస కార్మికుల పెన్షన్ చెల్లింపునకు అయ్యే వ్యయం రూ. 980 కోట్లు. మరింత ఆర్థిక భారాన్ని భరించలేమని, అందువల్ల కార్మికుల కనీస పెన్షన్‌ను పెంచలేమని ప్రభుత్వం వాదించినట్లు పార్లమెంటరీ స్థాయీ సంఘం తెలిపింది. మోదీ ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఎందుకంటే రాజకీయ కారణాలతో వివిధ సామాజిక వర్గాలకు విస్తరించిన సామాజిక భద్రతా కారణంగా వ్యయం పెరిగిందని మోదీ ప్రభుత్వం వాదిస్తున్నందున.


సంఘటితరంగంలోని కార్మికులకు సముచిత వేతనాలు, పెన్షన్లు ఇవ్వడం ద్వారా గౌరవించాలి. ముఖ్యంగా మోదీ ప్రభుత్వం ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మానదాన్ యోజనను అమలు చేస్తున్నట్లు గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, ఈ పథకం కింద అసంఘటిత రంగం కార్మికులకు కనీస నెలవారీ పెన్షన్ రూ.3000 ఇచ్చేందుకు అనేక షరతులు విధిస్తుంది. వాస్తవానికి, ఇది 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మధ్యంతర కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన రాజకీయ స్టంట్‌గా తేలింది. ఈ పథకం కింద 2025 మార్చి నాటికి నమోదైన వారిసంఖ్య కేవలం 46.12లక్షలు మాత్రమే. 18–59 ఏళ్ళ వయస్సు గల మహిళలకు ఉచితంగా రూ.2500 ఆర్థిక సహాయం, 60– 69 మధ్య వయస్సు గల వారికి రూ.2000 లేదా రూ.2500 వృద్ధాప్య పెన్షన్, 70 ఏళ్ళ కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి రూ. 2500 వృద్ధాప్య పెన్షన్ ఉచితంగా లభిస్తున్నప్పుడు, కార్మికులకు రూ.3000 పెన్షన్ కూడా హాస్యాస్పదంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకుంటున్న కార్మికుల పట్ల గౌరవం ఎక్కడ ఉంది?

ఇప్పుడు మహిళా కార్మిక శక్తి రెట్టింపు అయిందనే వాదనకు వద్దాం. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఇటీవల తన ఫేస్‌బుక్ పేజీలో '2014లో 22 శాతం ఉన్న మహిళా ఉపాధి, 2024 నాటికి 40.3 శాతానికి గణనీయంగా పెరిగింది! ఈ పెరుగుదల భారతదేశ ప్రగతిశీల విధానాలకు నిదర్శనం, ఇది మహిళలను శక్తివంతం చేస్తుంది, ప్రకాశవంతమైన, మరింత సమ్మిళిత భవిష్యత్తుకోసం దేశ కార్మిక శక్తిని బలోపేతం చేస్తుంది' అని పోస్ట్ చేసింది.

అయితే, ఈ విజయం ఎలా సాధించబడిందనే విషయాన్ని మంత్రిత్వ శాఖ దాచిపెట్టింది. వేతనం లేకుండా కుటుంబ పనిలో సహాయం చేస్తున్న లేదా కుటుంబ సభ్యులను చూసుకుంటున్న మహిళలందరినీ ఉద్యోగులుగా లెక్కించింది ప్రభుత్వం. ప్రభుత్వం వాస్తవ చిత్రాన్ని చూపించడం లేదు. భారతదేశంలో వేతనం పొందే పనిలో మహిళల భాగస్వామ్యం కేవలం 25 శాతం మాత్రమే, ఇది 2019లో 21.8శాతం, 2014లో 22.5శాతంగా ఉంది. మహిళల భాగస్వామ్యం 40.3శాతానికి రెట్టింపు అయిందనే వాదన కేవలం గొప్పలు చెప్పుకోవడం తప్ప, నిజానికి అది ఇంటి పనుల్లో వేతనంలేని మహిళలను ఉద్యోగులుగా లెక్కించడం ద్వారా మాత్రమే సాధించబడింది.

సాధారణంగా కార్మికుల పట్ల, ప్రత్యేకంగా మహిళా కార్మికుల పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ సునితత్వం లోపించడానికి కొంత హద్దు ఉండాలి. న్యాయమైన వేతనాలు, పెన్షన్లతో వారి పనిని మనం గౌరవించాలి. కార్మికేతరులు వర్తించే ఇతర సామాజిక భద్రతా పూర్తిగా మరొక వర్గం కిందకు వస్తుంది. కానీ కార్మికేతరుల కంటే కార్మికులు తక్కువ ఎందుకు పొందాలి? ఇది కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుంది.

# అంతర్జాతీయ వ్యవహారాల్లో కర్రపెత్తనం ప్రమాదం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

యుద్ధాలు ఎవరికీ విజయాన్ని చేకూర్చలేవు. అవి అంతిమంగా వినాశనానికే దారితీస్తాయి. రష్యాపై యుద్ధానికి ఉక్రెయిన్‌ను పురిగొల్పిన అమెరికా ఉక్రెయిన్‌కు భారీగా సాయం చేసి ఆర్థికంగా నష్టపోయింది. తాను నష్టపోవడమే కాకుండా ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం లోకి నెట్టింది. వివిధ దేశాలపై భారీగా ప్రతీకార సుంకాలను పెంచుతూ ప్రపంచ మార్కెట్ ఆర్థికంగా దివాళా తీయడానికి కారణమైనది. కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలోనే వివిధ దేశాలు లక్షల కోట్ల రూపాయలు నష్టపోవడం అమెరికా పుణ్యమే. అమెరికా రెసిప్రోకల్ టారిఫ్‌లతో భారత్‌ను కూడా భయపెడుతున్నది. భారత దేశం ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలనే వాంఛిస్తున్నది. అయినప్పటికీ పొరుగుదేశాలు ఈర్ష్యాద్వేషాలతో భారత్ సమగ్రతకు చేటుగా పరిణమించడం శోచనీయం. కొట్లాటల వలన, యుద్ధాలవలన ఎవరికీ ఒనగూడే ప్రయోజనం ఉండదు. ప్రజలే పరాజితులుగా మిగులుతారు. గతంలో జరిగిన రెండు ప్రపంచయుద్ధాల పరిణామాలు ఈ విషయాన్నే నిరూపించాయి. ప్రాచీనకాలంలో యుద్ధాలన్నీ సంప్రదాయమైన ఆయుధాలతో జరిగేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. మరో ప్రపంచయుద్ధం మహాప్రళయానికే దారితీస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి శతాబ్దం దాటిపోయింది. 1914–18 మధ్య జరిగిన మొదటి ప్రపంచయుద్ధంలో సుమారు కోటిమంది వరకూ మరణించారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత యుద్ధాల ను నివారించడానికి 1920లో ఏర్పాటైన నానాజాతి సమితి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైనది, అనతికాలంలోనే అదృశ్యమైనది. ప్రస్తుత ఐక్యరాజ్య సమితి హితవచనాలు వినే పరిస్థితుల్లో ఏ దేశమూ లేదు. పేద దేశాలకే తప్ప అగ్రరాజ్యాలకు ఐ.రా.స కేవలం ఒక అవశేష అవయవం లాంటిదే. ఐ.రా.స తన కార్యకలాపాల కోసం అధికంగా అగ్రరాజ్యాలపై ఆధారపడడమే దీనికి కారణం. ఐ.రా.స నిష్పాక్షికత, విశ్వసనీయత కోల్పోతే మరో 'లీగ్ ఆఫ్ నేషన్స్' మాదిరిగా విఫలం కాక తప్పదు. వివిధ దేశాల నడుమ నెలకొంటున్న సరిహద్దు వివాదాలు యుద్ధాలకు దారితీయకుండా చూడవలసిన బాధ్యత ఐక్యరాజ్య సమితి భుజస్కంధాలపై ఉంది.

మొదటి ప్రపంచ యుద్ధానికి 'ఐరోపా' కేంద్రస్థానంగా మారింది. రష్యా, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్లు ఒక వైపు; జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, ఇటలీలు మరో వైపు మొదటి ప్రపంచ యుద్ధంలో అప్రతిహతంగా పోరాడాయి. ఐరోపాకు సంబంధించిన యుద్ధం తర్వాతి కాలంలో ప్రపంచంలోని పలు దేశాల్లో యుద్ధబీజాలు నాటింది. ఇరుకూటములకు శతృదేశాలు, మిత్రదేశాలంటూ ప్రపంచం రెండుగా విడిపోయింది. కాలక్రమంలో ఆసియాలో కూడా యుద్ధవాతావరణం ఏర్పడింది. చైనా,జపాన్‌ల మధ్య సాగిన యుద్ధం వివిధ ఆసియా దేశాల్లో చిచ్చుపెట్టింది. జర్మనీ యుద్ధకాంక్ష ఐరోపా దేశాల్లో అశాంతిని రగిలించింది. ఒక దేశానికి, మరొక దేశానికి మధ్య నెలకొన్న శతృత్వ వైఖరి వలన ప్రపంచ దేశాలు రెండుగా చీలిపోయాయి. హిట్లర్ ప్రపంచాధిపత్య ఆకాంక్ష మరో ప్రపంచ సంగ్రామానికి బాటవేసింది. దీనిఫలితమే 1939–45 సంవత్సరాల మధ్య జరిగిన రెండవ ప్రపంచ యుద్ధం. రెండవ ప్రపంచ యుద్ధంలో 8 కోట్లమంది ప్రజలకు పైగా మరణించారు. ఈ యుద్ధంలో అప్పటి సోవియట్ యూనియన్ అధిక సంఖ్యలో రెండున్నర కోట్లమంది ప్రజలను కోల్పోయింది. రెండవ ప్రపంచ సంగ్రామం చివరి దశలో జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకి నగరాలు అణు విధ్వంసంతో అతలాకుతలమై పోయాయి. ఈ నాటికీ అక్కడి ప్రజలు నాటి అణు యుద్ధ ప్రభావం నుండి కోలుకోలేదు. విధ్వంసం చేయడం సులభం ...




నిర్మాణమే కష్టం. గత ప్రపంచ యుద్ధాల అనుభవ సారాంశమిదే.

ప్రస్తుత ప్రపంచ మనుగడ వివిధ దేశాల ముఖ్యంగా అగ్రరాజ్యాల విజ్ఞతపైనే ఆధారపడి ఉంది. సామ్రాజ్య విస్తరణకు, యుద్ధకాంక్షకు స్వస్తి చెప్పి, శాంతియుతమైన వాతావరణంలో సమస్యల పరిష్కారానికి నిష్పక్షపాతమైన, అరమరికలు లేని, ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలి. యుద్ధ తంత్రానికి స్వస్తిచెప్పి శాంతిమంత్రం జపించడమే ప్రస్తుత ప్రపంచ సమస్యలకు, యుద్ధ నివారణకు ఏకైక సూత్రం. ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న సంఘర్షణలు అవాంఛనీయం. గాజా పై ఇజ్రాయిల్ దాడులు చేసి రక్తదాహం తీర్చుకోవడం మానవత్వాన్ని ప్రశ్నిస్తున్నది. ఇజ్రాయిల్ 8 వారాల కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత గాజాపై తిరిగి దాడులను కొనసాగిస్తున్నది. హమాస్ మిలిటెంట్లు కూడా హింసాత్మక దాడులకు పాల్పడి సమస్యను జటిలం చేస్తున్నారు. రష్యా ఉక్రెయిన్ల మధ్య సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధం ట్రంప్ రాకతో ముగుస్తుందనుకున్నా, ట్రంప్, జెలెన్ స్కీ ల మధ్య సాగుతున్న కీచులాట వలన శాంతి ఒప్పందంలో సందిగ్ధత ఏర్పడింది. నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు పుతిన్,జెలెన్ స్కీ లు అంగీకరించినా పూర్తి స్థాయిలో ఉక్రెయిన్, రష్యా ల మధ్య శాంతి ఒప్పందం కుదరాలని శాంతి కాముల కోరిక. యుద్ధాన్ని కొనసాగించడమా? ముగింపు పలకడమా? అనే అంశం ప్రస్తుతం అమెరికా చేతుల్లోనే ఉంది. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధ విరమణకు ఒక అర్థవంతమైన పరిష్కారం లభించే అవకాశాన్ని తోసి పుచ్చలేం. ఇప్పటివరకు అమెరికా ఉక్రెయిన్ కు అందించిన సహాయం నిలిపివేసింది. ఈ కారణంగా ఉక్రెయిన్ నిస్సహాయంగా మారింది. సంధి కోసం వెంపర్లాడుతున్నది. అమెరికాకు ఉక్రెయిన్‌లోని రేర్ ఎర్త్ మినరల్స్ అప్పగించడంతోనే యుద్ధం పరిసమాప్తి అవుతుందని పరిశీలకుల భావన. ఉక్రెయిన్ భద్రతకు అమెరికా ఎలాంటి హామీ ఇవ్వదు. పైగా నాటో నుంచి కూడా అమెరికా తప్పుకునే అవకాశాలున్నాయి. నాటోకు ఉక్రెయిన్ దూరంగా ఉండాలనే పుతిన్ డిమాండ్‌ను కూడా తప్పుపట్టలేము. పిట్ట పోరు పిట్టపోరు పిల్లి తీర్చిన చందంగా మాస్కో, కీవ్‌ల మధ్య జగడం అమెరికాకు ఆయాచితవరంగా మారింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రోత్సాహంతోనే ఉక్రెయిన్ రష్యాతో తలపడింది. బైడెన్ కు బద్ధ శతృవైన ట్రంప్, బైడెన్ విధానాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉక్రెయిన్ రష్యా ల మధ్య సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకోవడం సముచితమే అయినప్పటికీ, ఇందులో అమెరికా స్వార్థ మే అధికంగా ఉంది. ఉక్రెయిన్ లో ఇబ్బడి ముబ్బడిగా ఉన్న సహజ సంపదను కొల్లగొట్టడమే ట్రంప్ ఏకైక ధ్యేయం. ఇందుకు జెలెన్స్కీ అంగీకరించడం ఉక్రెయిన్ ప్రజలకు రుచించకపోవచ్చు. యుద్ధానంతరం ఉక్రెయిన్ పునర్నిర్మాణం పేరుతో అమెరికా ఉక్రెయిన్‌లో వాలిపోతుంది. అమెరికా కాంట్రాక్టర్లు, సాంకేతిక నిపుణులు, మైనింగ్ మాంత్రికులంతా ఉక్రెయిన్ ను స్వర్గధామంలా మారుస్తామని ఆ దేశంలోని సమస్త సంపదను అమెరికాకు ధారాదత్తం చేయడం ఖాయం. కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను నిలబెడతామంటూ కొద్దిపాటి ఆర్థిక సహాయం చేసి, కొన్ని ఆకాశ హర్మ్యాలను, రహదారులను నిర్మించి, ఉక్రెయిన్ ను ఉద్ధరిస్తున్నామనే నాటకానికి తెరతీసి, నమ్మించి, అవస రం తీరాక ఉక్రెయిన్‌ను వదలి పలాయనం చిత్తగించే అద్భుతమైన నాటకీయ దృశ్యాన్ని ఉక్రెయిన్ కళ్ళప్పగించి చూడక తప్పదు.

గాజానుంచి పాలస్తీనియన్‌లను ఖాళీ చేయించి సుందర మందిరాలతో అంతర్జాతీయ టూరిస్టు స్పాట్‌లు నిర్మించే ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బాట వేసేందుకే ఇజ్రాయిల్ గాజాపై యుద్ధం కొనసాగిస్తున్నది. కర్ర ఉన్న వాడిదే బర్రె అన్న చందంగా ఆయుధబలం, ఆర్థికబలం గలవారే ప్రపంచాన్ని శాసించే పరిస్థితులు ఏర్పడడం అవాంఛనీయం. కెనడా, గ్రీన్ లాండ్, పనామా కాలువపై అమెరికా ప్రదర్శిస్తున్న వైఖరి మితిమీరిన అహంభావానికి, సామ్రాజ్యవాదానికి పరాకాష్ఠ. ఇకనైనా ఇలాంటి ధోరణులు మారాలి. ఐక్యరాజ్య సమితి విఫలమైన దృష్ట్యా, యుద్ధాలను నిరోధించడానికి బలహీన దేశాలకు అండగా నిలబడడానికి బలమైన, తటస్థమైన అంతర్జాతీయ సంస్థ ను నెలకొల్పాలి.

# శాంతి చర్చలను ఆహ్వానిద్దాం..!

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి ప్రతినిధి అభయ్ పేరిట తాము 'కాల్పుల విరమణకు, శాంతి చర్చలకు సిద్ధమనే' ప్రకటనను స్వాగతించనివారు ఉండరు. అభివృద్ధి కాముకులు, ప్రజాస్వామ్యవాదులు ఎవరైనా ఈ ప్రకటనను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు. మావోయిస్టులతో సానుకూలంగా, గౌరవప్రదమైన చర్చలు జరిపి, ప్రశాంత వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత ఇక కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రకటించి, అందుకు దీర్ఘకాలిక సాయుధ పోరాటమే ఏకైక మార్గమని ప్రకటించిన మావోయిస్టులు, కారణాలు ఏమైనా కావచ్చు, కాల్పులు విరమించి ప్రభుత్వాలతో చర్చలకు సిద్ధం కావడం అసాధారణ విషయమే. రెండు మూడు రోజులకొసారి ఇరవై, ముప్పై మంది మావోయిస్టులు పోలీస్ ఎన్ కౌంటర్లలో చనిపోయినట్లు వార్తలు ఈ మధ్యకాలంలో సర్వసాధారణమై పోయింది. దానికి ప్రతిగా మందుపాతరలు పెట్టి పోలీసులను, ఇన్ఫర్మేషన్ ఇచ్చారనే పేరిట గిరిజనులను, దళితులను మావోయిస్టులు చంపడం కూడా చూస్తూనే ఉన్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్చి 2026 నాటికి మావోయిస్టులందరినీ ఏరిపారేస్తానని తరచూ ప్రకటనలు చేస్తూనే ఉన్నాడు. రాబోయే సంవత్సరకాలంలో మరెన్ని భయానక పరిణామాలు చూడాల్సి వస్తుందోనని ఆందోళన పడుతున్న సమయాన శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టుల ప్రకటన అందరికీ ఊరట కలిగించింది. ఇప్పుడు ప్రభుత్వ స్పందన కొరకు అందరూ ఎదురుచూస్తున్నారు. ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది కానీ ఇది ఏదో ఒక రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు కాబట్టి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని విశాల దృక్పథంతో వ్యవహరించి శాంతి చర్చలను సఫలీకృతం చేయాల్సిన అవసరముంది.

దశాబ్దాలుగా జరుగుతున్న ఈ నక్సలైట్ల ఉద్యమ ఫలితంగా వేలాదిగా నక్సలైట్లు చనిపోయారు. వందలాది మందిగా పోలీసులు చనిపోయారు. ఈ ఉద్యమంలో అత్యధికంగా నష్టపోతున్నది అడవి బిడ్డలైన గిరిజనులే. నక్సలైట్లకు సహకరిస్తున్నారని పోలీసులు చంపుతుంటే, పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారని నక్సలైట్లు గిరిజనులను చంపడం ఆనవాయితీగా మారింది. అత్యంత పేదరికాన్ని అనుభవిస్తూ, పనులు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు నిత్యం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంలో దినదిన గండంగా బతకాల్సి వస్తుంది. అడవులకు వెళ్ళి, అడవి సంపద సేకరించుకొని తమ జీవితాలు వెళ్ళదీసుకునే స్థితి లేకుండా పోతుంది. ఎప్పుడెక్కడ కౌంటర్లు, ఎన్ కౌంటర్లు జరుగుతాయో, ఎక్కడ మందుపాతరలున్నాయోనని భయంభయంగా జీవిస్తున్న పరిస్థితి. అసలే విద్యా, వైద్య వసతి లేదు. రహదారులు లేవు. ఆ మౌలిక వసతుల కల్పన కొరకు అడిగినా నిర్బంధాలతో అణచివేసే పరిస్థితే ఉంటుంది. ఈ పరిస్థితుల నుండి బయటపడాలని సగటు గిరిజనులు కోరుకుంటున్నారు. ఆ ప్రాంతాలలో అభివృద్ధి కుంటుపడుతున్న ది. మరోపక్క అర్బన్ నక్సలైట్లు అనే పేరిట పౌరహక్కుల సంఘాల నాయకులను, అభ్యుదయ వాదులను, మేధావులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయి. శాంతి చర్చలు సాఫీగా జరిగి మావోయిస్టులు కాల్పుల విరమణ చేసి, అజ్ఞాతాన్ని



వదిలి, అడవులకు బదులు అశేష ప్రజా సమూహాలను తమ కేంద్రాలుగా చేసుకోవాలని పౌర సమాజం కోరుకుంటుంది.

కేంద్ర హోంమంత్రి గారి ప్రకటనలు మావోయిస్టుల మరియు మావోయిస్టులకు మద్దతిస్తున్న గిరిజనులంతా ప్రభుత్వాలు నిర్మూలించాల్సిన శతృవులన్నట్లుగా వుంటున్నవి. మావోయిస్టులను అణచటం కొరకు వేలాది భద్రతా దళాలను సంవత్సరాల తరబడి దండకారణ్యంలో వుంచాల్సి రావ డం, మావోయిస్టుల ఎన్ కౌంటర్ల పేరిట అమాయక గిరిజనులను చంపడం ప్రభుత్వం ప్రతిష్టను దిగజార్చేవి తప్ప పెంచేవి కావు. మావోయిస్టులు శాంతి చర్చలకు రావడాన్ని అందిపుచ్చుకొని, చిత్తశుద్ధితో ఆహ్వానించి సక్రమంగా పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మావోయిస్టులు కాల్పుల విరమణ చేసి, ప్రభుత్వంతో చర్చలు చేసి, ఎన్నికలరంగంలోకి కూడా రాగలిగితే ప్రజాతంత్ర ఉద్యమానికెంతో ఊపునిస్తుంది. సాయుధ పోరాటమైనా, ఎన్నికలైనా లక్ష్య సాధనకు ఎత్తుగడలే. నేపాల్, లాటిన్ అమెరికా, శ్రీలంక తదితర దేశాలలో ఎంతో పెద్ద ఎత్తున చేసిన సాయుధ పోరాటాలను విరమించి, ప్రభుత్వాలతో చర్చలు జరిపి ఎన్నికల్లో పాల్గొని విజయాలు సైతం సాధించిన తాజా ఉదాహరణలు మన ముందే ఉన్నాయి.

మావోయిస్టు కేంద్ర నాయకుడు అభయ్ ఇచ్చిన కాల్పుల విరమణ ప్రకటనపై తెలంగాణలోని జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వాన వున్న 'శాంతి సంఘం'(పీస్ కమిటి) అభినందనీయమైన కృషి చేస్తుంది. కానీ ఇది సరిపోదు. మావోయిస్టుల సమస్య కేవలం తెలంగాణకో, ఛత్తీస్ ఘడ్ సంబంధించినది కాదు. ఈ దేశానికంతా సంబంధించినది. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరగాలి. ఇందుకు తగిన విధం గా కార్యాచరణ వుండాలి.

శాంతి సంఘం సమావేశాల్లో కానీ, సోషల్ మీడియాలో గానీ, ప్రధాన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో గానీ అనేక రకాల చర్చలు జరుగుతున్నవి. మావోయిస్టులు గత్యంతరం లేక కాళ్ళబేరానికి వస్తున్నారని కొందరు, బూర్జువా ప్రభుత్వంతో చర్చలేమిటని మరి కొందరు, దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారమని, కాల్పుల విరమణేంటని ఇంకొందరు రాస్తున్నారు. మరో పక్క వందలాది మంది జవాన్లను చంపి, తాత్కాలిక విరమణతో మళ్ళీ తిరిగి పుంజుకోవడానికే మావోయిస్టుల ఎత్తుగడని, మావోయిస్టుల సమస్యను అంతం చేయడానికి ఇదే సమయమని ఆలోచించేవారి సంఖ్య కూడా తక్కువ లేదు. వీరందరూ చర్చ లు జరగొద్దని కోరుకునేవారే.

చర్చలు జరగాలని కోరుకుంటూనే చర్చలకు ఆటంకమయ్యే వాదనలు కొందరు చేస్తుంటారు. మావోయిస్టులు బేషరతుగా చర్చలకు రారు. వారు సాయుధ పోరాటాన్ని విరమించరు. విరమించినా అది తాత్కాలికమే. మావోయిస్టుల కండిషన్లన్నీ ఒప్పుకుంటూనే చర్చలు అనే వాదనలను చేస్తున్నారు. ఇలాంటి వాదనలు కూడా చర్చలు జరుగకున్నా ఫరవాలేదనే అవగాహన నుంచి వచ్చేవే. ఇలాంటి సంవాదాలు సమస్యను జటిలం చేస్తాయే తప్ప శాంతి చర్చలు ఫలితాలివ్వడానికి తోడ్పడేవి కావు.ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రతినిధులు సమావేశం కావాలి. దానికి కావాల్సిన ముందస్తు ఎక్సర్‌సైజ్ జరగాలి. హడావుడిగా చర్చలు జరిగి, ఫెయిల్ అయితే చాలా నష్టం. జస్టిస్ చంద్రకుమార్ గారి చొరవతో ఏర్పడి న శాంతి సంఘం ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందని ఆశిద్దాం.

జి.రాములు, గౌరవ అధ్యక్షులు
తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం
9490098006



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## బిజెపి కొత్త అధ్యక్షుడిపై మల్లగుల్లాలు

**న్యూఢిల్లీ:** బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నికపై ఆ పార్టీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అనేకసార్లు సమావేశమై చర్చించారు. ఏప్రిల్ 22, 23 తేదీల్లో ప్రధాని మోదీ సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బిజెపి అధ్యక్షుడి ఎన్నికతో పాటు కేంద్ర కేబినెట్ విస్తరణ కూడా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బిజెపి అధ్యక్ష రేసులో కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎక్కువగా మనోహర్ లాల్ ఖట్టర్‌కు అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రధాని మోదీతో ఖట్టర్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉండవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ విస్తరణ చేస్తారని ప్రచారం జరుగుతోంది. కేబినెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వొచ్చని సమాచారం. ఎన్‌సీపీ, శివసేనతో పాటు బీహార్‌లోని ఇతర మిత్ర పక్షాలకు చోటుదక్కే అవకాశం కనిపిస్తోంది.



## కర్నాటకలో రోహిత్ వేముల చట్టం చేయాలి

### ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాహుల్‌గాంధీ లేఖ

**న్యూఢిల్లీ :** విద్యా వ్యవస్థలో ఎవరూ కుల వివక్షను ఎదుర్కోకుండా ఉండేందుకు రోహిత్ వేముల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. తన జీవితకాలంలో బిఆర్ అంబేద్కర్ ఎదుర్కొన్న వివక్షను రాహుల్‌గాంధీ తన లేఖలో గుర్తుచేశారు. నేటికి కూడా మన విద్యా వ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఒబిసి వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కుల వివక్ష గురించి ఈ లేఖలో రాసుకొచ్చారు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు. 2016 జనవరి 17న హెచ్‌సియు విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని దళిత సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమించాయి. విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రోహిత్ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు.

## నేడు జెఇఇ మెయిన్స్ ఫలితాలు


**న్యూఢిల్లీ :** జెఇఇ (మెయిన్) సెషన్– 2 పరీక్షల తుది కీ 2025 మళ్లీ విడు దలైంది. తొలుత గురువారమే జెఇఇ (మెయిన్) రెండో సెషన్ పేపర్–1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలి(ఎన్‌టిఎ)విడుదల చేసి నప్పటికీ.. కొద్దిగంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో తెలప కపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విష యం తెలిసిందే. తాజాగా శుక్ర వారం మధ్యాహ్నం మరోసారి తుది కీని విడుదల చేసిన ఎన్‌టిఎ.. ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలను (ఐడిలు: 347577562, 347577939) విరమిం చుకున్నట్లు పేర్కొంది. మరోవైపు, జెఇఇ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం ఏప్రిల్ 17 నాటికి ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్న ప్పటికీ.. నిర్ణీత గడువులోగా ఫలితాలు ఇవ్వడంలోనూ ఎన్‌టిఎ విఫలమైం దంటూ విమర్శలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్‌టిఎ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించింది. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్‌టిఎ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

## బంగ్లాదేశ్ వ్యాఖ్యలను ఖండించిన భారత్



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక సంఘటనలపై బంగ్లాదేశీ అధికారులు చేసిన వ్యాఖ్యలను భారత్ శుక్రవారం తోసిపుచ్చింది. ‘మాకు సూచనలు’ చేసే బదులు బంగ్లాదేశ్‌లోని మైనారిటీల హక్కుల పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించాలని ఢాకాను భారత్ కోరింది. ‘పశ్చిమ బెంగాల్‌లో ఘటనలకు సంబంధించి బంగ్లాదేశ్ పక్షం చేసిన వ్యాఖ్యలను మేము తిరస్కరిస్తున్నాం’ అని విదేశాంత మంత్రిత్వశాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ప్రకటించారు. ‘బంగ్లాదేశ్‌లో మైనారిటీల పై ప్రస్తుతం సాగుతున్న వేధింపులపై భారత్ ఆందోళనలతో సారూప్యం తెచ్చేందుకు ఇది తెలివిమీరిన యత్నం. బంగ్లాదేశ్‌లో అటువంటి చర్యల క్రిమినల్ బాధ్యులు యథేచ్ఛగా సంచరిస్తున్నారు’ అని జైశ్వాల్ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పరిణామాలపై బంగ్లాదేశీ అధికారులు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియా ప్రశ్నలకు జైశ్వాల్ ఆ విధంగా స్పందించారు. ‘అవాంఛిత వ్యాఖ్యలు చేయడానికి, హితోక్తులకు దిగడానికి బదులు బంగ్లాదేశ్ తమ సొంత మైనారిటీల హక్కుల పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించడం శ్రేయస్కరం’ అని ఆయన అన్నారు. ‘మైనారిటీ ముస్లిం జనాభాను పూర్తిగా రక్షించేందుకు అన్ని చర్యలూ’ తీసుకోవలసిందిగా న్యూఢిల్లీకి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ మీడియా కార్యదర్శి షఫీఖుల్ ఆలమ్ గురువారం విజ్ఞప్తి చేశారు. ‘ముస్లింలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగిస్తూ జరుగుతున్న దాడులను మేము ఖండిస్తున్నాం’ అని ఆలమ్ అన్నారు. ‘మైనారిటీ ముస్లిం జనాభా పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకోవలసిందిగా భారత, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం’ అని ఆలమ్ తెలిపారు.

## 50 శాతం భారతీయ విద్యార్థుల వీసాలు రద్దా ?



**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ధ్వజం**

**వీసాలు రద్దయిన 327మంది అంతర్జాతీయ విద్యార్థులలో సగం శాతం భారతీయులని ‘ఎఐఎల్ఎ’ వెల్లడి**

**న్యూఢిల్లీ :** అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన 327 అంతర్జాతీయ విద్యార్థుల వీసాలలో 50 శాతం మేరకు భారతీయ విద్యార్థులవే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి, కమ్యునికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేష్ అన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికా విదేశాంగ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జైరామ్ రమే ష్ గురువారం ఈ విషయాన్ని సామాజిక మాధ్య మం ‘ఎక్స్’లో ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసి యేషన్ (ఎఐఎల్ఎ) గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటన ద్వారా ఈ విషయం తెలిసిందని, ‘ఇది భారతదేశంలో మాకు ఆందోళన కలిగించే విషయం’ అని జైరామ్ రమేష్ అన్నారు.‘రద్దు చేసిన 327 అంతర్జాతీయ విద్యార్థుల వీసాలలో 50శాతం మేరకు భారతీయ విద్యార్థులే ఉన్నారు. వీసాల రద్దుకు కారణాలు యాదృచ్ఛికంగా, స్పష్టంగా ఉన్నాయి. ఆందోళన, భయం పెరిగి పోతోంది’ అని రమేష్ అన్నారు. ‘ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి వెంటనే పరిగణనలోనికి తీసుకుని అమెరికా విదేశాంగ శా ఖ మంత్రి వద్ద ఈ విషయాన్ని లేవనెత్తి పరిష్క రిస్తారా? లేదా?’ అని జైరామ్ రమేష్ జైశంకర్‌కు ట్యాగ్ చేశారు.‘డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ (డిఒఎస్), ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ (ఐసి ఇ) అంతర్జాతీయ విద్యార్థులనే లక్ష్యంగా చేసు కుని దూకుడు పెంచుతోంది’ అని అమెరికా ఇమ్మి గ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ విడుదల చేసిన తన ప్రకటనలో పేర్కొంది. ‘ఎఐఎల్ఎ నివేదిక ప్రకారం...వీసా రద్దు అయిన అంతర్జాతీయ విద్యార్థులలో భారతీయ విద్యార్థులు 50 శాతం మేరకు ఉండగా, 14శాతం చైనాకు చెందిన వారు ఉండగా మిగతా శాతం ఇతర దేశాలైన సౌత్ కొరియా సహా నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు’’ అని ప్రకటన తెలిపింది.

## భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు


**న్యూఢిల్లీ:** భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని అన్నారు. ‘భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి’ అని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడించారు. ‘ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి’ అని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో నమోదు కావడం భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించినట్లు అయింది.

## ఉగ్రదాడుల సూత్రధారి హర్‌ప్రీత్ అరెస్టు

చండీఘడ్: పంజాబ్‌లో ఉగ్ర కార్యకలాపాలకు ప్రధాన సూత్రధారి హర్‌ప్రీత్ (హ్యాపీ పాసియా)ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌ఓ) అధికారులు శుక్రవారం అమెరికాలో శాక్రమెంట్‌లో అరెస్టు చేశారు. రెండు అంతర్జాతీయ ఉగ్రవాదుల గ్రూపులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని, అమెరికాకు అక్రమ పద్ధతిలో వెళ్లారని ఎఫ్‌బీఐ ఎక్స్ పోస్టులో పేర్కొంది. అతను పట్టుబడకుండా ఉండేందుకు బర్నర్ ఫోన్లు ఉపయోగించారని ఎఫ్‌బీఐ పోస్టులో పేర్కొంది. హర్‌ప్రీత్ ఉగ్రచర్యలపై విచారణ చేస్తామని తెలిపింది.

## పార్టీలను చీల్చడం తమిళనాడులో కుదరదు

**ఢిల్లీ పాలనకు రాష్ట్రం తలొగ్గదు : స్టాలిన్**



**తిరువల్లూర్ :** తమిళనాడులో 2026లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర సిఎం ఎంకె స్టాలిన్ స్పందించారు. ఢిల్లీ పరిపాలనకు లొంగని ప్రత్యేకత తమిళనాడుకు ఉందని.. భాషా వివాదం నేపథ్యంలో ఇప్పటికే ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇస్తామని.. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని అమిత్ షా హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ (పార్లమెంటరీ ఎన్నికల్లో)తో సీట్లను తగ్గించమని చెప్పగలరా అని నిలదీశారు. ఇటీవల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను కించపరిచేలా మాట్లాడారని.. అమిత్‌షా సైతం అదే విధమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం, రాష్ట్రా లు ఏర్పాటయ్యాయని.. ఎవరూ ఎవరికి సబార్డినేట్ కాదని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేర్కొన్నారని పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అన్నాడిఎంకెతో కలిసి పోటీ చేయనుంది. 2026లో తమిళనాట అధికారంలోకి వస్తామని బిజెపి అగ్రనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్ మొదలైన విషయాలపై తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం.. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై విస్తృతంగా పోరాటం చేస్తోంది. దీని కోసం ఇటీవల ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను పరిరక్షించడంతోపాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచడమే ఈ కమిటీ లక్ష్యమని స్టాలిన్ వివరించారు.

## జైనులు లక్ష్యంగా బిజెపి దాడులు: అఖిలేశ్



**లక్నో:** ముంబైలో జైన్ దేవాలయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం కూల్చివేయడాన్ని సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఖండించారు. దేశవ్యాప్తంగా ఉన్న జైన్ సమాజాన్ని బీజేపీ ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ‘నేటి కాలంలో దేశంలో మైనారిటీగా ఉండడం శాపంగా మారుతోంది. బీజేపీ ప్రభుత్వాలు మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడంతో ప్రస్తుతం జైన సమాజం అభద్రత, అనిశ్చితిలో ఉంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తోంది’ అని అఖిలేశ్ యాదవ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల జైన సమాజంపై పెరుగుతున్న దాడులను ఆయన ప్రస్తావించారు. మధ్యప్రదేశ్‌సింగోలి జైన సన్యాసులపై బీజేపీ నేతలు దాడి చేసిన ఘటనను అఖిలేశ్ ఉటంకించారు. ముంబైలో జైన్ దేవాలయం, వారి పవిత్ర గ్రంథాలు, విగ్రహాలు, మతపరమైన పుస్తకాలను బీజేపీ నేతలు అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్ శ్రీ గిర్నార్, శ్రీ సమ్మేద్ శికర్‌జీ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుందని, ఉత్తరప్రదేశ్ బాగ్‌పత్‌లో జైన విగ్రహ ప్రతిష్ఠను బీజేపీ నేతలు అడ్డుకున్నారని ఆయన గుర్తుచేశారు. 2022లో మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో 65 ఏళ్ల భవర్‌లాల్ జైన్ హత్యకు గురయ్యారని అఖిలేశ్ తెలిపారు. జైన సమాజం పీడీఏ (పిచ్డా దళిత అల్పసంఖ్యాక్) కూటమిలో భాగం. ఈ సమాజంపై బీజేపీ దాడులు చేయడం అన్యాయం. జైన సమాజాన్ని నాశనం చేయాలని బీజేపీ భావిస్తోంది. జైనులపై జరిగే దాడులను తాము వ్యతిరేకిస్తున్నామని, జైనులకు తాము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## శాటిలైట్ టోల్ విధానంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

**న్యూఢిల్లీ:** ఉపగ్రహ ఆధారిత టోల్ విధానం అమలుపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. మే 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. ప్రస్తుత ఫాస్టాగ్ ఆధారిత టోల్ విధా నం స్థానే శాటిలైట్ టోల్ విధానాన్ని మే 1 నుంచి అమలు చేయబోతున్నారంటూ కొన్ని మీడియా సంస్థలు వార్తలు ప్రచురించాయి. దీనిపై కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఫీజు వసూలుకు టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆపే అవసరం లేకుండా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్ని షన్ విధానాన్ని తొలుత ఎంపిక చేసిన టోల్‌ప్లాజాల వద్ద అమరుస్తారు. ఇందులో ఏఎన్‌పీఆర్‌తో పాటు ఫాస్టాగ్ కలగలిపి సేవలందిస్తారు. ఏఎన్‌పీఆర్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్లను గుర్తిస్తే... వాహనాలు ఆగకుండానే ఫాస్టాగ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా టోల్ వసూలు చేస్తారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఇనోటీసులు జారీ చేస్తారు. ఫాస్టాగ్ రద్దు, పెనాల్టీలు విధిస్తారు. ఎప్పటి నుంచి అమలు చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ శాఖ తెలిపింది.

## మస్క్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ సిఇఒ ఎలాన్ మస్క్‌తో టెలిఫోన్ సంభాషణ జరిపారు. టెక్నాలజీ, సృజన రంగాల్లో భారత్, అమెరికా మధ్య సహకారం పటిష్ఠతలో పరస్పర ఆసక్తిని ఉభయులూ పునరుద్ఘాటించారు. భారతీయ విద్యుత్ వాహన విపణిలో ప్రవేశానికి టెస్లా అవకాశాలను అన్వేషిస్తున్నట్లు భావిస్తున్న సమయంలో ఉభయుల మధ్య టెలిఫోన్ సంభాషణ చోటు చేసుకున్నది. ఈ సంవత్సరం మొదట్లో వాషింగ్టన్ డిసిలో తమ గత సమావేశం నేపథ్యంలో ఉభయులూ విస్తృత శ్రేణి అంశాలపై చర్చించారు. తాము వివిధ అంశాలపై చర్చించినట్లు మస్క్‌తో సంభాషణ అనంతరం ప్రధాని మోడీ ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలియజేశారు. ‘ఎలాన్ మస్క్‌తో మాట్లాడాను. ఈ ఏడాది మొదట్లో వాషింగ్టన్ డిసిలో మా భేటీలో ప్రస్తావించిన విషయాలు సహా వివిధ అంశాల గురించి చర్చించాను. టెక్నాలజీ, సృజన రంగాల్లో సహకారానికి గల అపార అవకాశాలను మేము చర్చించాం’ అని ఆయన తెలిపారు. ‘ఆ రంగాల్లో యుఎస్‌తో మా భాగస్వామ్యాలను ముందుకు తీసుకుపోవడానికి భారత్ నిబద్ధమై ఉంది’ అని మోడీ తెలియజేశారు. ప్రధాని మోడీ గత ఫిబ్రవరిలో తన రెండు రోజుల యుఎస్ పర్యటనలో ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆయన తన ముగ్గురు పిల్లలు ఎక్స్, స్ట్రైడర్, అజూరెలతో కలసి మోడీని కలుసుకున్నారు. ఆ సమావేశంలో ప్రధాని మోడీకి మస్క్ ఒక స్టార్‌షిప్ షట్కోణ ఉష్ణకవచ రేకును కానుకగా ఇచ్చారు. రానున్న మాసాల్లో ముంబయి సమీపంలో ఒక రేవుకు కొన్ని వేల కార్లను నౌకారవాణా చేయడం ద్వారా భారతీయ విపణిలోకి ప్రవేశించేందుకు టెస్లా సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం. బ్లూమ్‌బెర్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది మూడవ త్రైమాసికంలో ముంబయి, ఢిల్లీ, బెంగళూరులలో తమ అమ్మకాలు ప్రారంభించాలని టెస్లా యోచిస్తోంది.

## 33 మంది నక్సలైట్లు లొంగుబాటు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శుక్రవారం కనీసం 33 మంది నక్సలైట్లు భద్రతా దళా ల ముందు లొంగిపోయారని పోలీసులు తెలిపా రు. వారిలో 17 మంది రూ. 49 లక్షల రివార్డును కలిగి ఉన్నారు, తొమ్మిది మంది మహిళలు సహా 22 మంది పోలీసు, సిఆర్‌పిఎఫ్ సీనియర్ అధికారుల ముందు లొంగిపోగా, తరువాత ఇద్దరు మహిళలు సహా 11 మంది పోలీసు అధికారుల ముందు లొంగిపోయారని వారు తెలిపారు. ‘బో లు‘, ‘అమానవీయ’ మావోయిస్టు భావజాలం, స్థా నిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో లొంగిపోయిన కార్యకర్తలు నిరాశ చెందారని సుక్మా పోలీ సు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ అన్నారు. మాడ్ (ఛత్తీస్‌గఢ్), నువాపాడ (ఒడిశా)లోని మా వోయిస్టుల విభాగాలలో లొంగిపోయిన 22 మం ది నక్సలైట్లు చురుకుగా ఉన్నారని ఆయన అన్నా రు. మావోయిస్టుల మాడ్ డివిజన్ కింద పిఎల్‌జిఎ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) కంపెనీ నంబర్ 1లో డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా (33), అదే స్క్వాడ్ సభ్యురాలు అతని భార్య ముచాకి జోగి (28) ఉన్నారని చవాన్ చెప్పారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ఉంది. మిగిలిన వారిలో కికిద్ దేవే (30), మనోజ్ అలియాస్ దుధి బుధ్రా (28) ఉన్నారు. ఇద్దరూ మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు, వీరికి ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రివార్డు ఉందని ఆయన చెప్పారు. లొంగిపోయిన ఏడుగురు కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రివార్డు, మరొక నక్సలైట్‌కు రూ. 50,000 రివార్డు ప్రకటించారని అధికారి తెలిపా రు. జిల్లా పోలీసులు, జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్, దాని ఎలైట్ యూనిట్ కోబ్రా వారి లొంగుబాటులో కీలక పాత్ర పోషించాయని ఆయన అన్నారు. దీనితో, బడేసట్టి న క్సలైట్ రహి త గ్రామ పంచాయతీగా మారిందని ఆయన అన్నారు. వారిలో నలుగురికి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రివార్డు, ఒకరికి రూ. 50,000 రివార్డు ప్రకటించారని చవాన్ చెప్పారు. కొత్త ఛత్తీస్‌గఢ్ నక్సల్ సరెండర్/బాధితుడు ఉపశమనం, పునరావాస విధానం–2025 కింద, రాష్ట్ర ప్రభు త్వం ’ఎల్వాడ పంచాయతీ యోజన’ను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా గ్రామ పంచాయతీలు తమ ప్రాంతంలో చురుకుగా ఉన్న నక్సలైట్లు లొంగిపోవడానికి వీలు కల్పించే రూ. 1 కోటి విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేసి, తమను తాము మావోయిస్టు రహితంగా ప్రకటించుకునే తీర్మానాన్ని ఆమోదించే నిబంధన ఉందని అధికారి తెలిపారు.

## ఎన్‌కౌంటర్ స్థలం నుండి నగదు,పేలుడు పదార్థాలు స్వాధీనం

**నారాయణపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ స్థలం నుండి భద్రతా దళాలు రూ.6 లక్షల నగదు, 11 ల్యాప్‌టాప్‌లు, నక్సలైట్లకు చెందిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయని పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల ప్రకారం, ఏప్రిల్ 15న కోహ్కామెట పోలీస్ స్టేషన్ పరిధిలోని కసోడ్, కుమురాడి గ్రామాల మధ్య ఉన్న అటవీ కొండపై కాల్పులు జరిగాయి, ఇక్కడ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) 41వ బెటాలియన్ సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరింది. అభుజ్‌మాడ్ ప్రాంతంలోని అటవీ జలపాతాలలో సీనియర్ మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా భద్రతా దళాలు పదమ్‌కోట్ శిబిరం నుండి ఆపరేషన్ ప్రారంభించాయని వారు తెలిపారు. దాదాపు మూడు గంటల పాటు కాల్పులు జరిగాయని, ఆ తర్వాత నక్సలైట్లు తమ వస్తువులను వదిలి అక్కడి నుంచి పారిపోయారని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌కౌంటర్ స్థలం నుండి భద్రతా దళాలు రూ. 6 లక్షల నగదు, 11 ల్యాప్‌టాప్‌లు, 50 కిలోల గన్‌పౌడర్, 30 కిలోల ఇతర పేలుడు పదార్థాలు, 20 లీటర్ల పెట్రోల్, 20 లీటర్ల డీజిల్, రెండు కుక్కర్ బాంబులు, 130 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్) కార్ట్రిడ్జ్‌లు, 12బోర్ రైఫిల్స్‌తో కూడిన 25 కార్ట్రిడ్జ్‌లు, 303 రైఫిల్స్‌తో కూడిన 18 కార్ట్రిడ్జ్‌లు, రెండు కార్డెక్స్ వైర్ కట్టలు, ఒక మావోయిస్టు యూనిఫామ్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు, మందులు, టిఫిన్ బాక్స్‌లు, మావోయిస్టు సాహిత్యం, బూట్లు, రోజువారీ ఉపయోగం కోసం ఉపయోగించే ఇతర వస్తువులు కూడా దొరికాయని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో లభించిన రక్తపు మరకలు అనేక మంది నక్సలైట్లు కాల్పుల్లో మరణించారని లేదా గాయపడ్డారని సూచిస్తున్నాయని, అయితే వారి సహచరులు వారిని అడవిలోకి తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు. భద్రతా దళాల ఈ చర్య నక్సలైట్లకు భారీ ఆర్థిక, వ్యూహాత్మక నష్టాన్ని కలిగించడమే కాకుండా, అభుజ్‌మాడ్‌లోని ఏ ప్రాంతంలోనూ వారు సురక్షితంగా లేరనే స్పష్టమైన సందేశాన్ని కూడా పంపిందని ప్రకటనలో తెలిపారు.


**సర్టిఫికేట్ పోయినది**

నేను, **నాగిళ్ళ రామ్ కుమార్ తండ్రి యాదయ్య**, నివాసం: చండూర్ మున్సిపాలిటీ, నల్లగొండ జిల్లా. నా యొక్క సదరం సర్టిఫికేట్ (ఐడి: 2329380130112253) తేది: 10-01-2025న అంగడిపేట నుండి చండూర్ వరకు ప్రయాణిస్తుండగా పోయింది. నా సదరం సర్టిఫికెట్ ఎవరికైన దొరికితే పై చిరునామాలో తెలియజేయగలరు. నా సెల్ నెం. **8142436304**

**IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD**

**MACMA NO.63/2022**

**Between :**

**Oruganti Radha Krishna,** .....**Applicant**

**And**

1.**K.Nageswara Rao**, S/o K.Venkatewarlu, Aged Major, Owner of the Car bearing No. AP-09-BJ-0004, R/o H.No: 10-2-24, LIGH Quarters, Mamillagudem, Khammam Town & District.

2. National Insurance Company Limited, Represented by its Branch Manager, Branch Office, trunk Road, Khammam Town ..... **Respondents**

**NOTICE**

To

**R1. K.Nageswara Rao**, S/o K.Venkatewarlu, Aged Major, Owner of the Car bearing No. **AP-09-BJ-0004**, R/o H.No: 10-2-24, LIGH Quarters, Mamillagudem, Khammam Town & District.

Please take the notice that you to apper before the Hon'ble High Court of Telangana, Hyderabad on **25-04.2025 at 10.30 A.M** failing which The Hon'ble Court may decide the case as exparty. The Hon'ble Court permited the counsel for the applicant to takeout personal notice to you. therefore you may apper in person or through a counsel on the date of hearing before the Hon'ble High Court. Hence This Notice.

**// By order of the Court//**

**Place: Hyderabad**

**Date: 18.04.2025**

**Kadari prabhakar rao**
Advocate,
Hyderabad,cell.+919848360233

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 808 of 2024**

Between:

**DEVINATH CHITS PRIVATE LIMITED., Parkal- Branch** **...Disputant**

**AND**

**BALAJISINGH TAKOOR & Others** **...Opponents**

1. Sri. Balaji Singh Takoor, S/o, Rampal Singh, Age: 40 Yrs, R/o: H.No: 3-10-144/3, Reddy Colony. Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery cf money. Several times notices were issued to you, But you have failed to receive the same The above dispute is posted on. **06-06-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో జోక్యానికి ఆస్కారం లేదు: హైకోర్టు

**హైదరాబాద్ :** ప్రమోషన్స్, ట్రాన్స్‌ఫర్స్ ద్వారా చేసే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఎస్జీటీలకు ప్రమోషన్స్ ద్వారా ఎంత నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలనేది గవర్నమెంట్ పాలసీ అని, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో సెకండరీ గ్రేడ్ (ఎస్జీటీ) టీచర్లకు ప్రమోషన్స్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లకు సంబంధించి సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌ను అమలు చేయడం లేదంటూ కిరణ్ కుమార్ ఇతరులు వేసిన పిటిషన్లపై ఉత్తర్వులు జారీకి నిరాకరించింది. పిటిషన్లపై విచారణను మూసేస్తున్నట్లు జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఇప్పుడు స్కూలు అసిస్టెంట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా 33.33 శాతం, ఎస్జీటీలకు పదోన్నతులు, బదిలీల ద్వారా 66.66 శాతం భర్తీ చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాబట్టి ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోబోమని వెల్లడించింది.

## కాంగ్రెస్ కార్యకర్తలకు సైతం వాటా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెరాల్డ్ పత్రికలో 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులుగా ఉన్నారని, ఆ ఆస్తుల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు సైతం వాటా ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ నేతలంతా ధర్నా చేయాల్సింది ఈడి ఆఫీస్ ముందు కాదని, ఆ ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేసిన సోనియాగాంధీ నివాసం ఎదుట అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి, కార్యదర్శులు ఎస్.ప్రకాశ్ రెడ్డి, ఉమారాణి, అధికార ప్రతినిధులు విఠల్, రాణి రుద్రమాదేవి, ఎంఎల్‌సి అభ్యర్థి గౌతమ్ రావు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్‌లతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను కాజేసేందుకు యంగ్ ఇండియా ట్రస్ట్ పేరుతో డూప్లికేట్ గాంధీ కుటుంబం కుట్ర చేసిందని విమర్శించారు. పత్రిక ఆస్తులను వ్యక్తిగత ఆస్తులుగా మార్చుకునేందుకు చేసిన కుట్ర కోణంపై 2012లో కేసు వేశారన్నారు. దీనిపై 2013లో కోర్టు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. సిబిఐ విచారణకు ఆదేశించిందన్నారు. అరెస్ట్ కాకుండా బెయిల్‌పై ఉన్న నిందితులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు అన్నారు. ఆ కేసుతో మోదీ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌లో నిర్వహించబోతున్న బహిరంగ సభకు రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్థిక సహకారం అందిస్తోందని ఆరోపించారు. సభలు, సమావేశాలు, ఆందోళనల పేరుతో అల్లర్లకు కుట్ర చేస్తున్నారన్నారు. ఇదే జరిగితే హైదరాబాద్‌లో బెంగాల్ తరహా పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని బండి సంజయ్ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభపై కెసిఆర్ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరుగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, మహిళా నాయకులతో బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు ఎర్రవెల్లి లోని తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సిలు కల్వకుంట్ల కవిత, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎంఎల్ఎలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఒడితెల సతీష్ కుమార్, చంద్రావతి, ఆశన్న గారి జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు, సుమిత్రా తనోబా, రజినీ సాయిచంద్, నవీనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ ఏర్పాట్లు, జనసమీకరణ తదితర అంశాలపై కెసిఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతం లో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలపైన కెసిఆర్ పలు సూచనలు చేశారు.


## సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఖైదీ మృతి

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి సెంట్రల్ జైల్లో శిక్షఅనుభవిస్తున్న ఒక ఖైదీ గుండెపోటుతో మరణించాడు. జైలుసూపరింటెండెంట్ సంతోష్ రాయ్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన వి వెంకటేశ్వర్లు(39) ఓ గంజాయి కేసులో నిందితుడిగా ఈ నెల 3న సెంట్రల్ జైల్లో రిమాండ్‌కు వచ్చాడు. అయితే ఈన ఎల 17 బుధవారం రాత్రి అతనికిఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. వెంటనే అక్కడ ఉన్న వైద్య సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స చేశారు. కొద్దిగా కోలుకున్నాడు అనే లోపు మళ్లీ అర్ధరాత్రి ఒక్కసారిగా కింద పడిపోయాడు. అతడిని పరీక్షించిన సెంట్రల్ జైలు వైద్యులు సిబ్బంది వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం 530గంటల ప్రాంతంలో తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టు మార్టం రిపోర్ట్ అనంతరం ఖైదీ మృతికి గుండెపోటు కారణమా, ఇంకా ఏదైనా కారణమా అనే విషయం స్పష్టమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

## పెద్దపల్లిలో అంతరాష్ట్ర ఎటిఎం దొంగలు అరెస్ట్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సులభంగా డబ్బులు సంపాదించాలని ఆరుగురు సభ్యులతో ఒక టీంగా ఏర్పడి రాజస్థాన్ నుండి మధ్యప్రదేశ్ మహారాష్ట్ర రాష్ట్రాలలో తిరుగుతూ పెట్రో కంపెనీకి చెందిన ఎటిఎంలను గుర్తించి వాటి ద్వారా దొంగతనాలు చేస్తు, తెలంగాణకి చేరుకొని ఎటిఎం దొంగతనం చేసిన రాజస్థాన్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం రోజున అరెస్ట్ చేయడం జరిగినదని పెద్దపల్లి డిసిపి పి.కరుణాకర్ తెలిపారు. పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులైన ఇద్దరు అన్నదమ్ములు సిద్ధిక్ ఖాన్, ఆరిఫ్ ఖాన్ రాజస్థాన్ రాష్ట్రం చెందినవారని ఈనెల 15 న కూనారం రోడ్లో గల ఏటీఎం ముందు భాగం విప్పి కస్టమర్లకు చెందిన డబ్బులు రాకుండా చేసి, అనంతరం ఆడబ్బులను దోచుకొని ఏంతెలియనట్టు ఉండేవారని, దీనిపై బ్యాంకు కస్టమర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణరావు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితుల శుక్రవారం రోజున పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వస్తుండగా సాయంత్రం 4 గంటలకు పోలీస్ వారు బ్యాగ్‌లు చెక్ చేస్తున్నారని, పోలిస్ వారిని చూసి పారిపోతుండగా నిందితులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. నేరస్తుల మీద రాజస్తాన్ లో ఐదు కేసులు నమోదు అయి ఉన్నాయని, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పెద్దపల్లి సిఐ కె.ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐ జె.లక్ష్మణ్ రావు, మల్లేశం మరియు సిబ్బంది ఎస్.రాజు, రఘు, హెచ్‌సి.రమేష్, కె.ప్రభాకర్, కె.సతీష్, మరి యు ఎం.అనిల్ కుమార్‌లను పెద్దపల్లి డిసిపి, పి.కరుణాకర్ అభినందినచినారు.

## ఎన్‌డిఎఫ్‌సి ఎండిగా ప్రకాశ్ మగ్దుమ్ బాధ్యతలు



**న్యూఢిల్లీ :** నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌డిఎఫ్‌సి) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌కు చెందిన సీనియర్ అధికారి ప్రకాశ్ మగ్దుమ్ బాధ్యతలు చేపట్టారు. 1999 ఐఐఎస్ బ్యాచ్‌కు చెందిన మగ్దుమ్ ప్రస్తుతం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)లో అదనపు డైరెక్టర్ జనరల్‌గా పని చేస్తున్నారు. ఎన్‌ఎఫ్‌డీసీలో మగ్దుమ్ కొత్త పాత్రను ఐదు సంవత్సరాల కాలానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది.

# ధన్‌ఖర్‌పై ముప్పేటదాడి

తీర్పు వ్యతిరేకమైతే విమర్శలా
ఇందిరాగాంధీ ఎన్నిక రద్దు గుర్తులేదా: సిబల్
ఉప రాష్ట్రపతి తీరు అనైతికం: మనోజ్ ఝా, తిరుచి శివ



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా వస్తే పొగుడుతారు... లేకపోతే విమర్శిస్తారా అంటూ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తీరును ప్రతిపక్ష పార్టీల ఎంపీలు దుయ్యబట్టారు. తమిళనాడు గవర్నర్ పెండింగ్ పెట్టిన బిల్లుల ఆమోదానికి న్యాయపరంగా మార్గం సుగమం చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయడం, దీనిపై ధన్కర్ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అత్యున్నత పదవుల్లో ఉన్న వారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశంలో మునుపెన్నడూ జరగలేదని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని నాడు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సిబల్ గుర్తు చేశారు. నాటి తీర్పు ఆమోదయోగ్యమే అయితే తాజా తీర్పు ఎందుకు కాదని ధన్కర్‌ను ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 142వ అధికరణ ద్వారా సుప్రీం కోర్టుకు ప్రత్యేక అధికారాలు వర్తిస్తాయని, ఆ అధికరణ ప్రజాస్వామ్య వ్యవస్థలపై అణు క్షిపణిలా వినియోగమవుతోందని ధన్కర్ ఆరోపించడాన్ని ఆక్షేపించారు. ధన్కర్ వ్యాఖ్యలు అనైతికమని ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కే ఝా, డీఎంకే ఎంపీ తిరుచీ శివ ఖండించారు. ఎగ్జిక్యూటివ్ (పరిపాలన), లెజిస్లేచర్ (చట్టసభ), జ్యుడిషియరీ (న్యాయవ్యవస్థ)తో పాటు మీడియా... ప్రజల విషయంలో సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కపిల్ సిబల్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధన్కర్ వైఖరి తనను బాధించిందని, ఆశ్చర్యపరిచిందని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులు అనుకూలంగా ఉంటే ప్రశంసలు కురిపించడం... లేకపోతే న్యాయ వ్యవస్థపై దుమ్మెత్తిపోయడం ప్రభుత్వ అధికారులలో కొందరికి పరిపాటైందన్నారు. న్యాయ వ్యవస్థలపై దాడి చేయడం, తీసిపారేయడం సరి కాదని... న్యాయ వ్యవస్థను, రాజ్యాంగాన్ని విశ్వసించాలని, న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి ఉండటం ప్రజాస్వామ్యంలో ప్రాథమికమని సిబల్ నొక్కిచెప్పారు. లేని పక్షంలో అన్ని హక్కులకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రజలంతా విశ్వసించేది న్యాయ వ్యవస్థ ఒక్కటేనన్నారు. అయోధ్య కేసు లేక అధికరణ 370 రద్దు సమయంలో మోదీ ప్రభుత్వ చర్యలను కొందరు విమర్శించినప్పుడు... సుప్రీంకోర్టు తీర్పులు అనుకూలంగా రావడంతో వాటిని మెచ్చుకున్న వారు ఇప్పుడు బిల్లుల ఆమోదానికి గడువు నిర్దేశిస్తూ గవర్నర్లు, రాష్ట్రపతికి సూచనలు చేసిన సర్వోన్నత న్యాయస్థానాన్ని విమర్శిస్తున్నారని సిబల్ అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 142ను 'అణు క్షిపణి'గా ధన్కర్ వ్యాఖ్యానించడాన్ని ఆక్షేపించారు. సుప్రీంకోర్టుకు అలా అధికారాలు ఇచ్చింది రాజ్యాంగం... ప్రభుత్వం కాదని అన్నారు. 'రాష్ట్రపతి పదవి... అత్యున్నత హోదా అయినప్పటికీ, మంత్రివర్గం సలహాల మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలి. సొంతంగా నిర్ణయాలు తీసుకొనే అధికారం ఉండదు. జగదీప్ ధన్కర్‌కు ఈ విషయం తెలియదా!' అని కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ స్పీకర్, ర్యాసభ చైర్మన్ పదవుల్లో ఉన్న వారు పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, ఏ ఒక్క పార్టీకి అధికార ప్రతినిధిగా ఉండరాదన్నారు. 1975లో ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు వచ్చిందని, ఆ తీర్పు ఇచ్చినది జస్టిస్ కష్ణ అయ్యర్ నేతృత్వ ఏకసభ్య ధర్మాసనం అని సిబల్ అన్నారు. ఆ తీర్పుతో ఇందిరా గాంధీ సీటు కోల్పోయారని గుర్తు చేశారు. 1975లో ఎమర్జెన్సీ, 1984లో సిక్కుల వ్యతిరేక అల్లర్లు గురించి మాట్లాడే ఉప రాష్ట్రపతి... మోదీ సీఎంగా ఉండగా జరిగిన 2002 గుజరాత్ అల్లర్ల గురించి ఎందుకు మాట్లాడలేదని ధన్కర్‌ను నిలదీశారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు వ్యవహారంలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు కాలేదు? అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ మతతత్వ వ్యాఖ్యలు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని కపిల్ సిబల్ ప్రశ్నించారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

కాళోజీ యూనివర్సిటీ విసి నందకుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోగులకు, రోగాలకు అడ్డుగా నిలబడి, వారి ప్రాణాలను రక్షించాబోయే వృత్తి నర్సింగ్ సిబ్బందిదే అని కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి అన్నారు. 'దీప్తి గ్రూప్ అఫ్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్ గ్రాడ్యుయేషన్ డే'లో భాగంగా (2019–20, 2020–21 విద్యా సంవత్సరానికి చెందిన) 120 మంది నర్సింగ్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థినులకు డాక్టర్ నందకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే, కాలేజీ బెస్ట్ స్టూడెంట్స్ ఆఫ్ ది ఇయర్, టాపర్ ఆఫ్ ద కాలేజ్ లాంటి అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. దీప్తి గ్రూప్ అఫ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు రోబోయే రోజుల్లో ప్రపంచం వ్యాప్తంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. కాళో జి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, తెలంగాణ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ బి.విద్యావతి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నర్సింగ్ సిబ్బందికి అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. నర్సింగ్ సిబ్బందికి దేశ, విదేశాలలో సేవలను అందించేందుకు ప్రభు త్వం తరపున అవకాశలు కల్పిస్తామన్నారు. టిజిఐ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గద్దం మల్లేశం మాట్లాడుతూ నర్సింగ్ సేవ అనేది ఉద్యోగం కాదని, ఇదొక ధర్మం లాంటిదని అన్నారు. తెలంగాణ నార్సింగ్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షులు జి.వెంకట్‌నారాయణ మాట్లాడుతూ రాబో యే రోజుల్లో వైద్య విద్యార్థుల ప్రభుత్వం భవిష్యత్తులో అనేక ఉద్యోగ అవకాశాలను కల్పించబోతుందన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కె ఎస్ రత్నం,దీప్తి కాలేజ్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్ కొండేటి మల్లయ్య, తెలంగాణ ఇనిస్టిట్యూషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.చిన్నారెడ్డి, ప్రతినిధులు డాక్టర్ ప్రమోద్ ,కొండేటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండి, డైరెక్టర్ డాక్టర్ దీప్తి కొండేటి, కొండేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు, పర్యాటక అభివృద్ధి పనులకు టెండర్లు

మధిర నియోజక వర్గ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మధిర నియోజక వర్గానికి ఇందిరా కో ఆపరేటివ్ డెయిరీ ప్రతిష్టాత్మక పథకమని ఈ పథకం ద్వారా మంజూరైన గేదెల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మధిర నియోజక వర్గ అధికారులతో అభివృద్ధి పనులకు సంబంధించి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఇందిరా కో ఆపరేటివ్ డెయిరీ ప్రాజెక్టులో గేదెల కొనుగోలు అనేది కీలకమైన అంశమని అదనపుకలెక్టర్ స్థాయి అధికారితో పాటు డిఆర్‌డిఏ పిడి పర్యవేక్షణలో కొనుగోలు జరగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశించారు. ఎటువంటి పొరపాట్లు జరిగిన సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గేదెలు ఎక్కడ, ఏవి కొనుగోలు చేయాలనేది లబ్దిదారుల ఇష్టానికి వదిలేయాలని, 20వేల మంది లబ్దిదారులు 40వేల గేదెలతో డెయిరీ ప్రారంభిస్తున్న నేపథ్యంలో గేదెల పోషణపైన అధికారులు సమీక్ష నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామా ల్లో సమావేశాలు నిర్వహించేటప్పుడు అందరిని ఆహ్వానించాలని సంరక్షణ, పాల సేకరణ, మార్కెటింగ్ తదితర అంశాలన్నింటిపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే ఇతర డెయిరీలను పరిశీలించేందుకు లబ్దిదారులకు అవకాశం కల్పించాలన్నా రు. సలహాదారులను నియమించడంతో పాటు డెయిరీ కమిటీ సభ్యులు వారానికి ఒకసారి విధిగా సమావేశమై తగు చర్యలు చేపట్టాలని భట్టి సూచించారు. మధిర, జమలాపురం చెరువులను టూ రిజం ప్రాజెక్టులుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో వెంటనే టెండ ర్లు పిలిచి పనులు ప్రారంభించాలని నీటిపారుదల, పర్యాటక శాఖాధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న కాటేజీలు, బోట్స్, మినీ హాల్స్‌కు సంబంధించిన నమూనాలను విక్రమార్క పరిశీలించారు. బయ్యారం, మాటూరు, కలకోట, చిరుమర్రి, ముత్తారం, చింతకాని చెరువులు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రగతిని సమీక్షించారు. డిఆర్‌డివో సన్యాసయ్య, అధికారి సరిత, నీటిపారుదల శా ఖాధికారులు రమేష్‌బాబు,రామకృష్ణ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీల నిరసన






ప్రదర్శనలు, మానవహారాలు, ర్యాలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** లౌకిక రాజ్యాంగం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025కు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు ఆందోళన నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని రక్షించండి దేశాన్ని పరిరక్షించండి అనే నినాదాలతో ప్లేకార్డులు ప్రదర్శిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రదర్శన జరిగింది. వైరా, మధిర, కూసుమంచి, నేలకొండపల్లి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు అంశాలకు సంబంధించి సుప్రీం కోర్టు యధాతథ స్థితిని కొనసాగించాలని తీర్పునిచ్చిందని ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డులో స్థానం కల్పించడంపై హైకోర్టు వ్యాఖ్యాలను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని మతపెద్దలు కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టిన నేపథ్యంలో వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ముస్లిం సోదరుల మానవహారం నిరసన కార్యక్రమానికి సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలతో పాటు వివిధ కుల సంఘాలు మద్దతునిచ్చాయి. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, అవాజ్ జిల్లా కార్యదర్శి గౌస్, ముక్తి అమీర్‌జా, రసూల్, అబ్దుల్ రషీద్, ముక్తి జలాలుద్దీన్, మౌలానా మహ్మద్, అహ్మద్ ఖాస్మి, సాధిక్, రహూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇఎపి సెట్-2025 షెడ్యూల్ విడుదల

ఈనెల 29,30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు
మే 2 నుంచి 4వ తేదీ వరకు ఇంజినీరింగ్ అర్హత పరీక్ష
వివరాలను వెల్లడించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

TGEAPCET

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ ప్రవేశాలకుగాను నిర్వహించనున్న తెలంగాణ ఈఏపిసెట్ పరీక్షలకు విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈఎపి సెట్ పరీక్ష షెడ్యూల్‌ను శుక్రవారం జెఎన్‌టియు అధికారులు విడుదల చేశారు. ఈ నెల 29 నుంచి మే 4 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు. ఈఏపీసెట్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవే శ పరీక్ష, మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ రోజు రెండు విడుతల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షకు 86,101 మంది, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నేటి నుంచి ఫార్మా, అగ్రికల్చర్ విద్యార్థులు, ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఈ నెల 22 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చాని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి హైదరాబాద్ జోన్ 3లో అధికంగా 50,149 మంది, నిజామాబాద్ జోన్‌లో అత్యల్పంగా 1,650 మంది పరీక్ష రాసేందుకు నమోదు చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

## దుబాయ్ కోర్టు ఆర్డర్‌పై 'సుప్రీం' విమర్శ

అది 'దౌర్జన్యం', 'మానవ హక్కుల ఉల్లంఘన' అని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** వివాహ వివాదంలో మైనర్ పిల్లల ప్రయాణాన్ని పరిమితం చేస్తూ దుబాయ్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు విమర్శించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఘనా పౌరుడు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో నివసిస్తున్న ఒక చిన్నారి తండ్రి దాఖలు చేసిన హేబియస్ కార్పస్ పిటిషన్‌పై నోటీసులు జారీచేసింది. సందర్శన హక్కుల పరిమిత అంశంపై ఆయన ఒక పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్‌కు ఇతర అనుబంధ ఉపశమనాలతో పాటు సందర్శన హక్కులను మంజూరు చేసే పరిమిత ప్రయోజనం కోసం నోటీస్ జారీచేయాలని 2025, ఏప్రిల్ 18న, తిరిగి ఇవ్వవచ్చని ఏప్రిల్ 17 ధర్మాసనం ఆదేశించింది. విచారణ సందర్భంగా వివాహ వివాదంలో ప్రయాణాన్ని కోర్టు నిషేధించడాన్ని ధర్మాసనం గమనించింది. ఇది దాదాపు గృహనిర్బంధంతో సమానం అవుతుందని వ్యాఖ్యానించింది. దుబాయ్ కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ బెంగళూరులో నివసిస్తున్న తన విడిపోయిన భార్య మా కొడుకుని దుబాయ్ నుంచి ఇండియాకు తీసుకెళ్లిపోయిందని, అది అక్రమ నిర్బంధమని తండ్రి ఆరోపించారు.పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిఖిల్ గోయల్‌ను ఉద్దేశించి న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ 'ఆమె (భార్య)ను దాదాపు నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. మీరు కోర్టు నుంచి ఒక దారుణమైన ఉత్తర్వును పొందారు. ఇది పూర్తిగా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నది. వివాద వివాదంలో కోర్టు ప్రయాణ నిషేదాన్ని ఎలా విధిస్తుంది. మానవ హక్కులను నమ్మే ఏ కోర్టు కూడా అలాంటి ఉత్తర్వులను జారీ చేయడానికి ఇష్టపడదు. ఇది ఎవరినైనా దోషులుగా నిర్ధారించకుండా గృహ నిర్బంధంలో ఉంచినట్లే అవుతుంది' అని పేర్కొన్నారు. ఆ ఇరువురూ (భార్యాభర్త) దుబాయిలో పెండ్లి చేసుకుని అక్కడే స్థిరపడ్డారని గోయల్ చెప్పారు.

## ప్రలోభాలకు లొంగే ఓటర్లు జంతువులై పుడతారు: బిజెపి ఎమ్మెల్యే

**భోపాల్:** బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యే వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలకు లొంగే ఓటర్లు మరో జన్మలో జంతువులుగా పుడతారని, దేవుడితో తాను ప్రత్యక్షంగా మాట్లాడతానని చెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆ బీజేపీ ఎమ్మెల్యేపై విమర్శలు వెల్లువెత్తాయి. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 16న మోవ్ అసెంబ్లీ నియోజకవర్గం హసల్‌పూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఉషా ఠాకూర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల ద్వారా ప్రతి లబ్ధిదారుడి ఖాతాల్లోకి వేల రూపాయలు వస్తున్నాయని తెలిపారు. అయినా కూడా ఓటు అమ్ముకుంటే అది మనుషులకే సిగ్గుచేటని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలను ఉషా ఠాకూర్ కోరారు. ఓటు వేసేటప్పుడు చిత్తశుద్ధిని కోల్పోవద్దని చెప్పారు. 'డబ్బు, చీరలు, గాజులు, మద్యం తీసుకుని ఓటు వేసే వారు వచ్చే జన్మలో కచ్చితంగా ఒంటెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు అవుతారు. ఇది మీ డైరీలో రాసుకోండి. దేవుడితో నాకు ప్రత్యక్ష సంభాషణ ఉంది. నన్ను నమ్మండి' అని అన్నారు. దేశం, మతం, సంస్కృతికి సేవ చేసే బీజేపీకి మాత్రమే ఓటు వేయాలని కోరారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి.

## మేము హిందువులం... హిందీ కాదు

ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే
హిందీ తప్పనిసరిపై విద్యార్థి విభాగం నిరసన

**థానే (మహారాష్ట్ర) :** మరాఠీ, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల్లో విద్యార్థులకు మూడవ భాషగా హిందీని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నవీ ముంబైలో మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు చెందిన విద్యార్థి విభాగానికి చెందిన కార్యకర్తలు శుక్రవారం నిరసన చేపట్టారు. వందలాది మంది నిరసనకారులు వాషిలో ఒక ప్రాంతం వద్ద ప్రభుత్వ తీర్మాన ప్రతులను తగులబెట్టడంతో పాటు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఒక గొప్ప భాషా సంస్కృతితో కూడిన ఈ ప్రాంతంలో ఒక భాషను బలవంతంగా రద్దుతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర పాలనా యంత్రాంగానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)2020 క్రింద నూతన పాఠ్యాంశాల అమలులో భాగంగా 1 నుంచి 5 తరగతులకు త్రిభాషా సూత్రాన్ని తీసుకువచ్చారు. పాఠశాల విద్య కోసం ఎన్ఈపీ 2020 సిఫార్సుల ప్రకారం నూతన పాఠ్యాంశాల కార్యాచరణ రూపకల్పన ప్రణాళికను దశలవారీగా అమలు చేస్తామని రాష్ట్ర పాఠశాల విద్యా విభాగం ప్రకటించింది. మహారాష్ట్ర నవనిర్మాణ విద్యార్థి పరిషత్ (ఎంఎన్‌వీఎస్) కార్యకర్తలు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ఒక తప్పనిసరి పాఠ్యాంశంగా హిందీని పేర్కొనలేదని తెలిపారు. హిందీని తప్పనిసరి చేయడం సమంజసం కాదని అన్నారు.

## గాలివాన బీభత్సం.. ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్లు..



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** భారీ వర్షం, తీవ్రంగా వీచిన గాలులతో వికారాబాద్ జిల్లాలో శుక్రవారం రోడ్లపై చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నవాబ్‌పేట్ మండలం మామదాన్ పల్లి, వికారాబాద్ మండలం కొత్తగాడి సమీపంలో చెట్లు విరిగి ప్రధాన రహదారిపై పడ్డాయి. సమాచారం అందుకున్న నవాబుపేట ఎస్ఐ అరుణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని భారీ వృక్షాలను వాహనదారుల, గ్రామస్తుల, జేసీబీ సహాయంతో తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన ఎస్సై కే.అరుణ్ కుమార్ ని వాహన దారులు గ్రామస్తులు అభినందించారు.

## అధికారులు మొద్దు నిద్ర వీడాలి



**ప్రజాపక్షం/ వికారాబాద్‌ప్రతినిధి :** వర్షం, ఈదురుగాలికి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడి సమీపంలో ట్రాక్టర్ పై వెళ్తున్న శేఖర్‌రెడ్డి, వాజిద్‌లపై రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న భారీ చెట్టు విరిగి పడి ఒకరికి వెన్ను పూసకు, మరొకరికి తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా విషయం తెలుసుకున్నా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధికారులు మొద్దు నిద్ర వీడాలని, గతంలో కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెట్లు విరిగిపడి మరణం సంభవించిన సంఘటనలు ఉన్నాయి. వ్రేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని సూచించారు. ఈ విషయంపై శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.



## బాక్స్ డ్రైవ్ పనులు సకాలంలో పూర్తి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి డివిజన్‌లోని భ్రమరాంబికా నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న బాక్స్ డ్రైవ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కోరా రు. శుక్రవారం ఈ పనులను రంగరాజన్, నర్సింహ, కృష్ణగౌడ్, లీలావతి, పుల్లారావులతో పరిశీలించిన ఆయన వర్షాకా లం కంటె ముందుగా బాక్స్‌డ్రైవ్ పనులు పూర్తి చేయాలని, దీనివల్ల మల్కాజిగిరి ప్రాంతంలో 80 శాతం మేరకు వర్ష ముంపును నివారించవచ్చన్నారు. ఈ పనులకోసం అదనంగా రూ.70లక్షలు అవసరం ఉంటుందని, వెంటనే మంజూరు చేయాలంటూ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దోమ మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులను రాజు చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు, ఉచిత విద్యుత్ అందిస్తు రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించి నష్ట పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వమద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘువేందర్‌రెడ్డి, శాంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వాయర్ నిర్మాణానికి రూ.14 కోట్ల 95 లక్షలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గౌతంనగర్ డివిజన్‌లోని మహేంద్రనగర్ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణానికి రూ.14 కోట్ల 95లక్షలు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన తర్వాత, డివిజన్‌లోని 33 కలనీలకు నీటి సరఫరా మెరుగవుతుందన్నారు.అనేక సంవత్సరాల నుండి ఈ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపుతున్నా స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో చేసిన కృషి వల్లనే త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని కార్పొరేటర్ తెలిపుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్ కణాజిగూడలో వెలసిన మరకత శ్రీ లక్ష్మి గణపతి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటితో ముగిశాయని ఆలయ కార్య నిర్వాహకులు మోత్కూరి సత్యనారాయణ శాస్త్రి వెల్లడించారు. చివరి రోజు స్వామివారికి సుప్రభాత సేవ విశేష అభిషేకం, జప తర్పణ హోమాలు భక్తులచే మహాలింగార్చన కొనసాగించారు. సాయంత్రం శాంతి కళ్యాణంతో పరిపూర్ణం అవుతుంది. బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న భక్తులకు మరకత గణపతి లాకెట్ ఉచితంగా పంపిణీ చేశారు. మరకత శ్రీ లక్ష్మి గణపతి స్వామి వారి దర్శనం సకల పాప వినాశన మహా మంగళప్రదం అని వాఖ్యానించారు. అనంతరం భక్తులు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం నాడు పలు కాలనీలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని సబ్ స్టేషన్ ఎఇ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ సబ్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ 11కెవి, శ్రీనివాస కాలనీ 11కెవి, జర్నలిస్ట్ కాలనీ 11కెవి, భవ్యాస్ ఆనందం 11కెవి ఫీడర్ లైన్‌ల మరమ్మతు కారణంగా బాలాజీ వెస్ట్ కాలనీ, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, బాలాజీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3, శ్రీనివాస కాలనీ, అఖిలా అబోడ్, బాలాజి మెడోస్, బండారి లే అవుట్ తదితర కాలనీలలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, అదేవిధంగా కెటిఆర్ కాలనీ 11కెవి ఫీడర్ లైన్ మరమ్మతు కారణంగా కెటిఆర్ కాలనీ, కెఎన్ఆర్ కాలనీలలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్‌ని నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు




### కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం విషయమై జిల్లాలో మండల స్థాయిలో ఈ నెల 19 నుండి 26 వరకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. రైతులు, రైతు సంఘాలు, ఎన్జీఓలు, ప్రజా ప్రతినిధులను ఈ సదస్సుల్లో భాగస్వాములవుతారని, ఈ నెల 19న తొలి రోజున మూడుచింతలపల్లి కేశవరం గ్రామంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాలులో నిర్వహించే సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. భూభారతి చట్టం ద్వారా భూవివాదాల పరిష్కారం సరళీతరం అవనుందన్నారు. ఈ నూతన చట్టంలోని నిబంధనలపై సమగ్రంగా ఎలాంటి అనుమానాలున్నా వాటిపై నివృత్తి చేసుకోవటంతో పాటు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించటం ఈ సదస్సుల లక్ష్యమన్నారు.

# రైతు నెత్తిన మరింతగా ఆర్థిక భారం

* పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెంచిన కంపెనీలు
* ఆందోళనలో అన్నదాత, తగ్గుతున్న పంట దిగుబడి



**ప్రజాపక్షం/ వికారాబాద్‌ప్రతినిధి :** పత్తి రైతుపై ధరల పిడుగు పడింది. రానున్న వర్షాకాలం ప్రారంభానికి ముందే విత్తన కంపెనీలు అమాంతం ధరలు పెంచేశాయి. దీంతో ఇప్పటికే అతివృష్టి, అనావృష్టితో నష్టాలు చవిచూస్తున్న రైతులపై ఆర్థిక భారం మరింత పడనుంది. దీంతో పత్తి సాగువైపు ఈసారి రైతులు మొగ్గు చుపుతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది, ఒకవైపు పెరుగుతున్న ధరలు, మరోవైపు నకిలీ విత్తనాల బెడద కంటికి కునుకు లేకుండా చేస్తోంది. పత్తి పంట వేసిన నాటినుండి చేతికొచ్చే వరకు రైతులకు ఆందోళన తప్పడం లేదు. సరైన సమయంలో ఎక్కువగా వాడటం తదితర కారణాలతో పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. చేతికొచ్చిన పంట తీసే సమయంలో కూలీలు దొరక్క నేల రాలి దిగుబడి తక్కువగా వస్తోంది అని రైతులు తెలిపారు. ఏటా పత్తి పంటకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. విత్తనాలు, పురుగుమందులు, వేలల్లో వెచ్చించాల్సి వస్తుంది. దీనికి తోడు కూలీ ల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఎకరానికి 15వేల నుండి 20వేల వరకు కలుపు కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తన కంపెనీలు ఏటా ధరలు పెంచుతుండడంతో మరింత భారం పడుతుంది. బిటి పత్తి విత్తనాల ధర ఆరేళ్లుగా పెరుగుతూ వస్తోంది. 2019లో ప్యాకెట్ ధర రూ. 710 ఉండగా ప్రస్తుతం 901కి చేరింది. పత్తి పంట సాగు చేసేందుకు ఎకరాని రూ.40నుండి 50వేల ఖర్చు వస్తోంది. దక్కిదున్నడం నాటి నుండి భూమిని చదును చేయడం, విత్తనాలు వేయడం, కలుపు, మందుల పిచికారీ, కూలీఖర్చు ఉంటాయి. ఇందులో ఎకరానికి రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుంది అని రైతులు చెబుతున్నారు. గతేడాది బిటి 2విత్తనం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.867 ఉండగా ఈ ఏడాది రూ.901కి పెరిగింది. ఆయా కంపెనీలు అన్ని రకాల విత్తనాల ధరలు పెంచేశాయి. అంతకంతకు పెరుగుతున్న పెట్టుబడులతో రైతులు అందోళనకు గురవుతున్నారు.



## మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వానికి వివక్ష ఏలా?

### సిపిఐ నాయకుడు శ్రీనివాస్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వానికి ఎందుకు వివక్ష ఉందని సిపిఐ బాచుపల్లి కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట్‌లోని వార్డు కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీల పాలకవర్గం ముగిసిన అనంతరం మున్సిపల్ కార్మికులకు జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారని, ప్రతి నెల ఏడవ తేదీన కార్మికులకు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సక్రమంగా జీతాలను చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, యాదయ్య, కృష్ణ, రాజు, జీతయ్య పాల్గొన్నారు.

## బహదూర్‌పల్లిలో తాగుబోతుల హల్‌చల్

### అడ్డుకున్న సెక్యూరిటీ గార్డును చితకబాది, పిడి గుద్దులు గుద్ది కాళ్లతో తన్ని పరార్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బహదూరపల్లి అయోధ్య విల్లాల్లో తెల్లవారుజామున 4 నుండి 5 గంటల ప్రాంతంలో తాగుబోతులు హల్చల్ చేశారు. తాగిన మైకంలో విచక్షణను కోల్పోయి కార్ల అద్దాలు ధ్వంసం చేయడమే కాకుండా అడ్డువచ్చిన మహిళలు, స్థానికులపై అసభ్య పదాజాలంతో దూషించారంటూ స్థానికులు ఆరోపుస్తున్నారు. అడ్డుకున్న సెక్యూరిటీ గార్డుపై పిడిగుద్దులుగుద్ది కాళ్లతో ఇష్టానుసారంగా తన్ని దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గాయపడ్డ సెక్యూరిటీ గార్డును స్థానికులు చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. తెల్లవారు జామున మహిళలను ఇష్టానుసారంగా దూషించడంతో పాటు, సెక్యూరిటీ గార్డును విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచిన సంఘటనలో నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తెల్లవారుజామున సంఘటన జరగడంతో ఉదయం నిందితుల బంధువులు కాలనీకి వచ్చి స్థానికులతో మాట్లాడి కాంప్రమైజ్ చేస్తున్నట్లు సమాచా రం. నింధితులు సూరారం కాలనీకి చెందిన మన్నే బాలేష్,వారాల నర్సింహ వారసులు అజ య్, నితిన్, లాలూ, తిరుమలేష్ గా ఉన్నట్లు గుర్తించిన స్థానికులు దుండిగల్ సిఐ పి.సతీష్ ను వివరణ కోరగా దాడి జరిగింది. వాస్తవమే అన్నారు. సిసి ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామన్నారు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## రాజకీయ నేతలకు కార్యాలయాలు తప్పనిసరి

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** రాజకీయ నాయకులకు తప్పనిసరి గా ఒక కార్యాలయం ఉండాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని రెడ్డీస్ ఏవెన్యూ కాలనీలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ రాజకీయ నాయకులకు తప్పనిసరిగా పార్టీ కార్యాలయం లేదా స్వతహాగా ఓ కార్యాలయం ఉండాలని, ప్రజలకు పలాన కార్యాలయం వద్ద నాయకుడు ఉంటాడు అనే విషయం తెలుసుకోవడానికి అవసరమని అన్నారు. ప్రజల సమస్యలు, కష్టాలను తెలుసుకుని ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగుల మాధవరెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, ఇంద్రజిత్ రెడ్డి, పద్మారెడ్డి, రమేశ్, నాగిరెడ్డి, శ్రీకాంత్, శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవసభ వాల్ పోస్టర్ విడుదల



**ప్రజాపక్షం/కొడంగల్:** ఈ నెల 27వ తేదిన వరంగల్‌లోని ఎల్కతుర్తిలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కొడంగల్ మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని సీనియర్ న్యాయవాది మధుసూదన్‌రెడ్డి నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 2001లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసేందుకు పార్టీని స్థాపించి అనేక పోరాటాలు ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించిన తరుణంలో దేశానికి ఆదర్శంగా నిలిపిన మహానుభావుడు కెసిఆర్ అన్నారు. ఒకప్పుడు రైతు ప్రభుత్వాలకు కిస్తూలు కట్టేవాడని కాని కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వాలే రైతులకు భరోసా పథకాల ద్వారా కిస్తూలు చెల్లిస్తుందన్నారు.

కెసిఆర్ పథకాలను కేంద్రప్రభుత్వాలే కాపీ కోడుతున్నాయని వాఖ్యానించారు. పార్టీ స్థాపించి 25 వసంవతా లు పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా రజతోత్సవ సభకు కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రం నుంచి 3వేల మందికి తగ్గకుండ కెసిఆర్ అభిమానులు, పార్టీ శ్రేణులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, శేరినారాయణరెడ్డి, ఎరన్‌పల్లి శ్రీనివాస్, దుద్యాల కవిత, నర్మద కిష్టప్ప, సురేష్, రమేష్‌బాబు, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ భీములు, నరేష్‌గౌడ్, బాకారం అరుణ్, చాంద్ పాషాలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

**అల్వాల్‌లో:** ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలకు వివరించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్ అన్నారు.

25 సంవత్సరాల భారతీయ రాష్ట్ర సమితి రజత్రోత్సవ సభ ఈనెల 27న వరంగల్ లో నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతి గులాబీ సైనికుడు దండు గా బయలుదేరి సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్‌లు పిలుపునిచ్చారు.

## ఘనంగా 'గుడ్ ఫ్రైడే' వేడుకలు



**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా వ్యప్తంగాఉదయం 10గంటల నుండి 3గంటలకు వరకు చర్చ్‌ల్లో గుడ్ ప్రైడే వేడకలను ఘనంగా నిర్వహించారు. గుడ్ ప్రైడే అనగా యేసుక్రీస్తు శిలువపైన మాట్లాడిన ఏడు మాటలు శుభ శక్రవారం ప్రపంచంలోని క్రైస్తవ విశ్వాసులందరూ ధ్యానించడం పరపాటి, అంతే కాదు ఏసుపలికిన ఈ పలుకులు ఈలోకంలో మానవుడు లోక కాల్యణం కోసం ఎలా జీవించాలో గొప్పపాఠాలు మానవ జాతికి ఎప్పటికి అదర్శంగా, ఆచరణీయంగా నిలుస్తాయి. ఈ సందర్భంగా చర్చ్‌లో పాస్టర్లు ఏసు పలికిన మాటలను వివరించారు. యేసుక్రీస్తు మరణం ఈ లోకానికి నిత్యజీవం అనే ఆశీర్వాదం తీసుకువచ్చింది అని అన్నారు. మరణానికి బందీగా మారిన మానవుడు భయంలేకుండా నిర్భయంగా జీవించే ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు. మానవుని పిరికి ఆత్మను తీసివేసి ధైర్యంగా జీవించే దైవాత్మను అనుగ్రహించింది. క్రీస్తు మరణం ద్వారా నిత్యజీవ మార్గం సుగమమైంది అందుకే ఇది శుభ శుక్రవారం అంటారు.

**ఘట్‌కేసర్‌లో :** గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రిస్టియన్ సోదరులు చర్చిలో ఉపవాస ప్రార్థనలు చేశారు. ప్రభువు మరణాన్ని పురస్కరించుకొని సిల్వ ధ్యానాలు క్రిస్టియన్ సోదరులు చేశారు.

### కాచిగూడలోని రైల్ మ్యూజియంలో..

## ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా కాచిగూడ రైలు మ్యూజియంలో శుక్రవారం రైల్వే అధికారులు ఘనంగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు, రైలు ప్రయాణికులు, ఔత్సాహికులకు మ్యూజియంలోకి ఉచిత ప్రవేశం కల్పించినట్లు ద.మ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీన ప్రతి ఏట ప్రపంచ వారసత్వ దినోత్సవం జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఇది మన సాంస్కృతిక, సహజ సంపదను కాపాడుకోవడంలో భాగంగా జరుపుకుంటారన్నారు. 'ప్రపంచ వారసత్వ దినోత్సవం' సందర్భంగా కాచిగూడలోని రైలు మ్యూజియం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, రైలు ప్రయాణీకులు, రైలు ఔత్సాహికులకుతో నిండిపోయింది. రైల్ మ్యూజియం గతంలో పనిచేస్తున్న రైల్వే పరికరాలు, నమూనాలు, లివర్ల పని వ్యవస్థ, సిగ్నల్ వ్యవస్థలు మొదలైన వాటి పాత నమూనాలను ప్రదర్శనకు పెట్టారు. 1960 నుండి ఇప్పటివరకు దశాబ్దాల వారీగా ఉపయోగించిన ఫ్యాన్లు ప్రదర్శనలో ప్రదర్శించబడ్డాయి, ఇది సందర్శకులలో మరింత ఆసక్తిని కలిగించింది. 1916లో నిజాంలు కాచిగూడ స్టేషన్ ప్రారంభోత్సవం యొక్క ఫోటోను సైతం ప్రదర్శనలో పెట్టారు. కాచిగూడ రైల్వే స్టేషన్ భవనం 1916లో నిర్మించబడింది మరియు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) ద్వారా ప్లాటినం అవార్డుతో ప్రదానం చేయబడింది. ఈ రైల్ మ్యూజి యం నిజాంకాలం నాటి రైల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన పాతకాలపు ఛాయాచిత్రాలు, ప్రదర్శనలో ఉంచారు. స్వాతంత్ర్యానికి ముందు యుగం నుండి వివిధ రైల్వేల లోగోలు మ్యూజియంలో ప్రదర్శించబడ్డాయి. ప్రదర్శనలలో సిగ్నలింగ్ పరికరాలు, వివిధ లోకోమోటివ్లు మరియు కోచ్‌ల నమూనాలు, టిక్కెట్లు, పని నమూనాలు మొదలైనవి ఉన్నాయి. రైల్వేల చరిత్ర, వృద్ధికి సంబంధించిన ఆడియో విజువల్స్ మరియు రైల్వేలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇతర లఘు చిత్రాలను ప్రదర్శించడానికి ఒక ప్రత్యేక సీటింగ్ ప్రాంతం అందుబాటులో ఉంది.

### నేటి నుండి జి-మ్యాట్‌పై

## టి-సాట్‌లో ప్రత్యేక పాఠ్యాంశాలు

### సిఇఒ వేణు గోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ మేనేజ్మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జిమ్యాట్) 2025 సాధించేందుకు వీలుగా అభ్యర్థులకు టిసాట్ ఈ నెల 19వ తేదీ నుండి ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రసారం చేయనుందని సిఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ బేస్డ్ మల్టీపుల్ ఛాయిస్ పద్ధతిలో జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షకు విదేశీ విద్య, బిజినెస్, మార్కెటింగ్ విభాగాల్లో అవకాశాలు కోరుకునే వారికి టిసాట్ చేసే ప్రసారాలు అభ్యర్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు దోహదపడుతాయని ఆయన వెల్లడించారు. మే నెలలో నిర్వహించే పరీక్షలకు సంబంధించి ఈ నెల 19వ తేది శనివారం నుండి ప్రారంభమయ్యే ప్రసారాలు 30రోజుల పాటు ఒక్కో ప్రొగ్రామ్ చొప్పున మే 18వ తేదీ వరకు ప్రతి రోజూ అరగంటపాటు ఉదయం ఎనిమిది నుండి ఎనిమిదిన్నర గంటల వరకు నిపుణ, సాయంత్రం ఆరుగంటల నుండి ఆరున్నర గంటల వరకు విద్య ఛానల్‌లో పాఠ్యాంశాలు ప్రసారం కానున్నాయని సిఇఒ వివరించారు. క్వాంటిటేటివ్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, డాటా ఇన్ సైట్స్ సిలబస్, ఆల్జిబ్రాఅర్థమెటిక్, రీడింగ్ కాంప్రహెన్షన్‌క్రిటికల్ రీజనింగ్, డాటా సఫిషియన్సీ, మల్టీ సోర్స్ రీజనింగ్ తదితర అంశాల ఆధారంగా ప్రశ్నావళి సిద్ధంచేసి ప్రసారం చేస్తున్నట్లు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రధానంగా బిజినెస్ స్కూళ్ల లో విద్యనభ్యసించి యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాల్లో ఉద్యోగం పొందాలనుకునే వారు ఈ ప్రసారాలను వినియోగించుకోవాలని సూచించారు.

**'వరల్డ్ ఎర్త్ డే' స్పెషల్ లైవ్ :** ఈ నెల 22వ తేదీన 'వరల్డ్ ఎర్త్ డే' పురస్కరించుకుని టిసాట్ నెట్వర్క్ ఉదయం 11 గంటలకు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనుందని వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రౌండ్ వాటర్ డిపార్ట్ మెంట్, సామాజిక వేత్తలు ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో పాల్గొని 'వరల్డ్ ఎర్త్ డే' ప్రాధాన్యతను వివరిస్తుందని వెల్లడించారు.

## సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తే గుర్తింపు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి ఆకాడమీ చైర్మెన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ అన్నారు. గురువారం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటిలోని ఎన్‌టిఆర్ అడిటోరియంలో షాద్‌నగర్‌కు చెందిన సామాజిక వేత్త, బహుముఖ ప్రజ్ఞశాలి డాక్టర్ కొమ్ము వెంకన్నబాబుకు గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకుల రమేష్ మాట్లాడుతూ డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు లయన్స్ క్లబ్, నేషనల్ హ్యూమన్ రైట్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కన్స్యూమర్ ఫోరం ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని, అందుకే వారి సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## నిబంధనలు పక్కదారి పట్టించిన ప్రధానోపాధ్యాయుడిపై ఫిర్యాదు




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రభుత్వ నిబంధనలు పక్కదారి పట్టించిన ప్రధానోపాధ్యాయుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్‌నాయక్ తెలిపారు. జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకట్‌రెడ్డి జన్మదిన తేది సర్టిఫికేట్ సృష్టించి ప్రమోషన్ కోసం యత్నించిన విషయంపై జిల్లేడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి సంబంధింత ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

## రాజ్యాంగంపై అవగాహన పెంచడమే లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చినట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి తన నివాసం వద్ద మైలార్దేవురుపల్లి డివిజన్ నేతలతో శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలోని తన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జై బాపూ జై భీమ్ జై సమ్మిదాన్ సమావేశాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్, గండిపేట మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## హామీలు మరిచిన ప్రభుత్వాలు : సిపిఐ



**ప్రజాపక్షం/కొందుర్గు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య ఆరోపించారు. శుక్రవారం జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని వనంపల్లి, చౌదరిగూడ గ్రామాల్లో సిపిఐ గ్రామ శాఖ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడి ప్రభుత్వం మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా గ్యాస్ సిలిండర్ ధర 50 రూపాయలు పెంచి, సామాన్యుడి నడ్డి విరిచారన్నారు. గ్రామాల్లోని కూలీలకు ఉపాధి కల్పించే ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకానికి నిధుల కోత విధించడంతో, కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజల కిచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ చౌదరిగూడ గ్రామ నూతన కార్యదర్శిగా ఎండి షబ్బీర్, సహాయ కార్యదర్శిగా కె చిన్నయ్య, వనంపల్లి గ్రామ కార్యదర్శిగా కావలి నర్సమ్మ, సహాయ కార్యదర్శిగా కె యాదమ్మలను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యక్రమాల్లో జిల్లేడ్‌చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్, బికేఎంయు జిల్లా కోశాధికారి ఎం కృష్ణ, ఎం వీరేశం, జి పాపయ్య, జంగమ్మ, అనంత రాములమ్మ, చంద్రయ్య, కిష్టయ్య, లక్ష్మ మ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలి : జితేందర్



**ప్రజాపక్షం/గండిపేట:** పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపి సిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన ఆ పార్టీ మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు మెరుగు జితేందర్ కోరారు. శుక్రవారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్, టిపి సిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ను కలిసి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసి తిరు వారికి వివరించారు. రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కస్తూరి నరేందర్ ఆధ్వర్యంలో ఇన్నాళ్లు నిబద్ధతతో పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నాయకులకు సముచిత స్థానం కల్పించాలని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ ను కోరినట్లు జితేందర్ పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా నాయకులదే అని ఆయన అన్నారు పార్టీ కష్టకాలంలో సందర్భంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పై ఎన్ని ఒత్తిళ్లు, కేసులు పెట్టిన ప్రభుత్వానికి తలవగ్గలేదని, కాంగ్రెస్ పార్టీ ఏ పిలిపించిన విజయవంతం చేశామని అని తెలిపారు.పార్టీ నాయకులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని జితేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో మణి కొండ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్,మైనార్టీ అధ్యక్షుడు హాజీ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకులపై కార్పొరేటర్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిల గురించి కాంగ్రెస్ నాయకులు చేసిన అసభ్యకరమైన అవమానకరమైన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ పోలీస్టేషన్‌లో సిఐ సైదిరెడ్డికి కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్‌లపై పిర్యాధు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ప్రజాక్షేత్రంలో ప్రజల మెప్పుతో గెలిచిన ప్రజా నాయకులను గౌరవించకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ అజెండా కోసం, అసమర్థతను వైఫల్యానని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్ చేస్తున్న కార్యక్రమాలకు, అసభ్యకరమైన మాటలపై తగిన చర్యలు తీసుకోని ఇక పై ఇలాంటివి జరుగకుండా చూడాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

### హెచ్‌ఎండిఏ పరిధిలో

# 'బిల్డ్ నౌ' సేవలు ప్రారంభం

పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దాన కిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల్లో విప్లవాత్మకమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెల్సిందే. ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్(ఏఐ) ఆధారిత సాంకేతికతో మెరుపు వేగంతో డ్రాయింగ్ స్క్రూటిన్ని 'బిల్డ్ నౌ' ద్వారా నూతంగా భవన నిర్మాణ అనుమతుల మంజూరు విధానాన్ని పురపాలక శాఖ అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానాన్ని ముందుగా జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ, అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిహెచ్‌ఎంసిలో అమలు చేస్తుంది. ఇక నుంచి హెచ్‌ఎండిఏలో అమలు చేయనుంది. నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ, విస్తరించిన గ్రామాలతో సహా హెచ్‌ఎండిఏ పరిధిలోని పౌరులు బిల్డ్ నౌ ప్లాట్‌ఫామ్‌ను వేగవంతమైన భవన నిర్మాణ అనుమతి ప్రక్రియ కోసం ఉపయోగించుకునేందుకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అందుబాటులో ఉన్న సేవల్లో తక్షణ రిజిస్ట్రేషన్, తక్షణ ఆమోదం, సింగిల్ విండో క్లియరెన్స్, భవనం, లేఔట్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసి) కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 20న జిహెచ్‌ఎంసిలో ప్రారంభించిన విషయం తెల్సిందే. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఇప్పటికే జిహెచ్‌ఎంసికి 500 పైగా దరఖాస్తులు అందాయి. బిల్డ్ నౌ ప్లాట్‌ఫామ్‌లో దరఖాస్తు ప్రక్రియ పురోగతిలో అద్భుతమైన సామర్థ్యం ఉందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ తెలిపారు. గతంలో రోజులు పట్టే డ్రాయింగ్ స్క్రూటిని ప్రక్రియను ఇప్పుడు కేవలం నిమిషాల్లో పూర్తిచేస్తుందన్నారు. సగటు పరిశీలన సమయం కేవలం 30 సెకన్లకు తగ్గించామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించిన సంక్లిష్టమైన డ్రాయింగ్‌లు కూడా సులభతరంగా స్క్రూటిన్ని పూర్తి చేస్తుందన్నారు. ఒకప్పుడు అలాంటి దరఖాస్తు ఒక్కొక్కటి 26 అంతస్తులతో 6 రెసిడెన్షియల్ బ్లాక్లు + 5 అంతస్తులతో 1 అమెనిటీ బ్లాక్, 2 ఎల్ చదరపు మీటర్ల కంటే ఎక్కువ బిల్ట్ అప్ ఏరియా చాలా సమయం పట్టేందన్నారు. బిల్డ్ నౌ ద్వారా సెకన్లలోనే పరిశీలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. డ్రాయింగ్ స్క్రూటిన్ని ప్రక్రియ సమయం తగ్గింపుతో రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ఊరట కల్పిస్తుందన్నారు. వచ్చే వారం నుండి డిటిసిపి పరిధిలో బిల్డ్ నౌ సేవలు విస్తరిస్తామని దాన కిషోర్ వెల్లడించారు. సమర్థవంతమైన, పౌర కేంద్రీకృత సేవల కోసం సాంకేతికతను ఉపయోగించుకోవాలనే ప్రభుత్వ నిబద్ధతను మరింత పటిష్టం చేస్తుందన్నారు. బిల్డ్ నౌ సేవల వేగంగా విస్తరించడం, టెక్‌ఆధారిత పాలన పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. తెలంగాణను స్మార్ట్, పారదర్శక సమర్థవంతమైన పరిపాలనలో అగ్రగామిగా చేస్తుందని దాన కిషోర్ అన్నారు.

### ఉస్మానియా ఆస్పత్రిలో

# వైద్యసేవలు భేష్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

వైద్యులు, సిబ్బందికి అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తలచుకుంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయగలరని ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు రుజువు చేశారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. 'నేను రానుబిడ్డో సర్కారు దవాఖానాకు' అన్న నానుడిని తిరగ రాశారని ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలల్లో విశ్వాసాన్ని పెంచారన్నారు. ఇటీవల షిరిడీకి వెళ్తున్న క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఎపికి చెందిన 22 ఏళ్ల యువకుడిని చేర్చుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులు నిరాకరించాయి. దీంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించడంతో ఆ యువడుడు కోలుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి చికిత్స అందించిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రంగా అజ్మీరా, డాక్టర్ విక్రమ్ బృందాన్ని అభినంధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవ చేస్తున్న ప్రతి ఒక్క వైద్యుడు, సిబ్బందికి ఉస్మానియా వైద్యులు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

## జూపార్క్‌లో నూతన ఫుడ్ కోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నెహ్రూ జూపార్క్‌లో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఫుడ్‌కోర్టును అటవీశాఖ అందుబాటులోకి తెచ్చింది. హైదారాబాద్ పర్యాటక ప్రాంతాల్లో తలమానికంగా ఉన్న జూపార్క్‌లో రైనోపేరుతో ఫుడ్ కోర్టు ప్రారంభమైంది. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్‌ఎం డోబ్రియల్ కొత్త క్యాంటీన్ సేవలను ప్రారంభించారు. జంతు ప్రదర్శన శాలకు వచ్చే సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా అన్నిరకాల సేవలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలోనే పేరెన్నికగల జూపార్క్‌ల్లో హైదరాబాద్ మొదటిస్థానంలో ఉందని, ఇక్కడికి వచ్చే విజిటర్స్‌కు అహ్లాదకరమైన అనుభవం ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలను కల్పించటమే లక్ష్యంగా అటవీశాఖ పనిచేస్తోందని పిసిసిఎఫ్ వెల్లడించారు. జూపార్క్ మధ్యలో పచ్చని ప్రకృతి మధ్య, రైనో, ఆస్ట్రిచ్, విదేశీ పక్షుల ఎన్‌క్లోజర్ల మధ్య భోజనశాల అందుబాటులోకి వచ్చింది. నాణ్యమైన ఆహారపదార్థాలతో పాటు, మెరుగైన సీటింగ్, ట్రీ గజెబో, పిల్లలకు ప్లే ఏరియా, పరిశుభ్రమైన టాయిలెట్ల సేవలు సందర్శకులకు అందనున్నాయి. జూసందర్శనకు వచ్చిన విజిటర్స్‌తో మాట్లాడిన అధికారులు సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో చీఫ్‌వైల్‌లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు, జూపార్క్‌డైరెక్టర్ సునీల్ హిరేమత్, క్యూరేటర్ వసంత పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం

మే 20న జాతీయ సార్వత్రిక సమ్మె

వైద్య ఆరోగ్య సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మే 20వ తేదీన చేపట్టనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో పూర్తిస్థాయిలో పాల్గొని, విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఎం.నరసింహ (ఎఐటియుసి) భూపాల్ (సిఐటియు) జి.రాజశేఖర్ (ఐఎన్‌టియుసి) డాక్టర్ జి.శాంతి కుమార్ (బిఆర్‌టియు) పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ వైద్య, ఆరోగ్య కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చట్టం రూపొందించాలని, కాంట్రాక్ట్ . అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైమరీ హెల్త్ సెంటర్ల సంఖ్యను పెంచాలని, వైద్య రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులను పెంచాలని చెప్పారు. కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా కార్మికులు తమ ప్రాణాలను పనంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలను అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారి సేవలను ప్రభుత్వం విస్మరించిందని, ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, ప్రైవేటు వైద్యాన్ని పెంచి, ప్రజా సొమ్మును ప్రైవేటు వ్యాపారులకు దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వైద్యరంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక స్కీములను ప్రవేశపెడుతున్నప్పటికీ ఆ స్కీముల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి మే 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్,వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం లక్ష్మీ బాయి, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పసియుద్దిన్, ఆర్ వెంకట్ నాయక్ కిరణ్మయి భూలక్ష్మి గిరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యంతో బిసి హక్కులు సాధన

బిసిల మహాధర్నాలో వక్తలు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలలో రాజ్యాధికార చైతన్యం వచ్చిందని, దానిని కాపాడుకొంటూనే న్యాయమైన హక్కుల సాధనకు పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తక్షణమే కేంద్రప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద బిసిల మహాధర్నా నిర్వహించారు. దీనికి మాజీ ఎంపి వి.హనుమంతరావు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపి ఆర్.కృష్ణయ్య, ఎంఎల్‌సి మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, కాంగ్రెస్ నేతలు డాక్టర్ వినయ్ కుమార్, ఒబిసి ఇంటలెక్చువల్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ హాజరై, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ బిసి కులగణన ఇప్పుడు జరగకపోతే మరెప్పుడు జరగదన్నారు. కులాల వారీగా వాటా దక్కాలని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేసి, బిసిలలో చైతన్యం తెచ్చారన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్త బిసిలకు రాహుల్‌గాంధీపై నమ్మకం ఉన్నదని, కానీ, సిఎం రేవంత్ రెడ్డిపై నమ్మకం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులలో సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ బిసిలకు అన్యాయం చేసిందన్నారు. బిసిల ఉద్యమం బలంగా మారిందన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి బిసిలు ఏకతాటిపైకొస్తే 42శాతం రిజర్వేషన్ల అమలవుతాయని పేర్కొన్నారు. మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర బిసి బిల్లును కేంద్రం ఆమోదించి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంఘం నేతలు పుటం పురుషోత్తం రావు, రాంమోదీ, మహిళా నేత జయంతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వారసత్వ సంరక్షణ మనబాధ్యత




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వారసత్వ సంరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, అది సమాజంలో ప్రతిఒక్కరి బాధ్యతని పలువురు వక్తలు సూచించారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం 2025 పురస్కరించుకని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో, పురావస్తు శాఖ, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, జెబిఆర్‌ఎసి, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్, తదితర పౌర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చార్మినార్ వద్ద హైదరాబాద్ హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఎం.వేదకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసిఎంఎఎస్ దక్షిణ భారత ప్రతినిధి ప్రొఫెసర్ జిఎస్‌వి సూర్యనారాయణ మూర్తి, ప్రాచీన భారత చరిత్ర, పురావస్తు శాఖ, ఉస్మానియా యూనివర్సిటీ డా.జి.జయశ్రీ, ఎఎస్‌ఐ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్ కోటయ్య వింజమూరి, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్, డా.ఈ.సాయికృష్ణ, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ కార్యనిర్వాహకులు, శ్రీసాయిరామ్, సుధాకర్, పర్యాటక శాఖ డిటిఓ ఎస్. ప్రభాకర్, హెరిటేజ్ వాక్ ఇన్చార్జ్, డి.శ్రీనివాస్, స్థపతిడి. శ్యాంసుందర్ రావు, తెలంగాణ గిరిజన మ్యూజియం క్యురేటర్, డా.ద్యావనపల్లి సత్యనారాయణ, బౌద్ధ తత్వ ఫౌండేషన్ అధ్యక్షులు పి. వీరమల్లు, సిటీ కాలేజ్, జెబిఆర్ఎసి, ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్, ఎస్‌ఆర్‌డిపి, వాసవి స్కూల్, వైష్ణవి ఆర్కిటెక్చర్ కాలేజ్ విద్యార్థులు, పౌర సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ వాక్ చార్మినార్ మీదుగా చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా వేదకుమా మాట్లాడుతూ హైదరాబాద్ యొక్క చారిత్రక ఘనతను ప్రజలకు తెలియజేయడంతోపాటు వారసత్వ పరిరక్షణ, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. ప్రొఫెసర్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ చార్మినార్ యొక్క చారిత్రక, శిల్పకళా విశేషాలను విద్యార్థులకు వివరించారు.

# శాశ్వత భవన నిర్మాణాలకు చర్యలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/నందిగామ:** శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో నూతన ఎంపిడిఓ భవన నిర్మాణ స్లాబ్ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు పదేళ్ళు రాష్ట్రాన్ని పాలించి పరిపాలన వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. కొత్త మండలాలు, నూతన పంచాయతీలను ప్రకటించారు..కానీ భవనాలు లేక అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక అవస్థలు ఎదుర్కొన్నారని వివరించారు. పరిపాలన సౌలభ్యం కోసం చేశామని గొప్పలు చెప్పారే తప్పా సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేయడంతోపాటు అధికారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే మండల స్థాయి నుండి గ్రామ పంచాయతీ స్థాయి వరకు పెండింగ్‌లో ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు నిధులను సైతం విడుదల చేసి పనులు పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. గత పాలకుల మాదిరిగా కాకుండా పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహులు, మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, కుమార స్వామి గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నేతలు రాంరెడ్డి, శంకరయ్య, చించేటి కృష్ణ గౌడ్, బొమ్మగళ్ళ నర్సింలు, ఎర్రగారి రమేష్, రామస్వామి గౌడ్, జంగయ్య గౌడ్, గంగిశెట్టి శ్రీశైలం, జాంగారి రాములు, తడకల జంగయ్య, కాంట్రాక్టర్ బిక్షపతితోపాటు అధికారులు ఉన్నారు.

## లబ్ధిదారుల ఖాతాలోకి చేరిన మొదటి విడత నగదు

సిఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**ఫరూఖ్‌నగర్:** ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారుల బ్యాంక్ ఖాతాకు మొదటి విడత నగదు ఒక లక్ష రూపాయాలు చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు మొదటి విడత నగదు ఒక లక్ష బ్యాంక్ ఖాతాలో చేరాయి. దాంతో అప్పారెడ్డిగూడ గ్రామ లబ్దిదారులు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## తెనాలి 'డబుల్‌హార్స్'కు అవార్డ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెనాలి డబుల్ హార్స్ గ్రూప్‌కు మరో గౌరవం దక్కింది. యూఆర్ఎస్ మీడియా, ఆసియా వన్ మ్యాగజైన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 25వ ఆసియన్ బిజినెస్, సోషల్ ఫోరమ్ కార్యక్రమంలో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్‌కు 'ఇండియాస్ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ బ్రాండ్స్ లీడర్స్ 202425' అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యాం ప్రసాద్ స్వీకరించారు. ఈ గౌరవం తెనాలి డబుల్ హార్స్ కుటుంబానికి మాత్రమే కాక, మాతో కలిసిన ప్రతి వినియోగదారుడు, డిస్ట్రిబ్యూటర్, భాగస్వామి నమ్మకానికి అద్దంపడుతోందని మోహన్ శ్యాం ప్రసాద్ అన్నారు. ఈ గుర్తింపు మా ప్రయాణంలోని ఓ మైలురాయి అని పేర్కొన్నారు.

ఫోకస్

# సైన్స్

## అసోంలో కొత్తజాతి కప్ప






అసోంలోని గౌహతి సమీపంలో ఉన్న గర్భంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇటీవల శాస్త్రవేత్తలు లెప్టో్బ్రాచియం ఆర్యటియం అనే కొత్త జాతి కప్పను గుర్తించారు. ఈ కొత్త జాతికి అసోంకు చెందిన ఓ కళాశాల గౌరవార్థం ఆ పేరు పెట్టారు. అరుదైన ప్రత్యేకమైన వన్యప్రాణులకు హాట్‌స్పాట్‌గా ఈశాన్య భారతదేశంలోని గొప్ప జీవవైవిధ్యాన్ని కలిగిన ఈ ప్రాంతం కీలకంగా మారింది. ఈ కొత్త ఆవిష్కరణ కేవలం శాస్త్రీయ మైలురాయి మాత్రమే కాకుండా, పరిశోధన, పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అత్యవసర అవసరాన్ని చాలా బలంగా గుర్తు చేస్తుంది. సహజ ఆవాసాల్లోనూ పట్టణీకరణ విస్తరిస్తున్నందున ప్టోబ్రాచియం ఆర్యటియం వంటి జాతులకు ప్రమాదంలో ఎక్కువగా ఉన్నాయి. అటువంటి ప్రాంతాలను రక్షించడం అరుదైన జాతుల మనుగడకు మాత్రమే కాకుండా గ్రామీణ, పట్టణ ప్రకృతి దృశ్యాలలో పర్యావరణ సమతుల్యతను కొనసాగించడం చాలా ముఖ్యమైనది. అస్సాంలోని గర్భంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో కనుగొన్న కొత్త కప్ప జాతి లెప్టో్బ్రాకియం ఆర్యటియం ఆవిష్కరణ ఒక వివరణాత్మక, కఠినమైన శాస్త్రీయ పరిశోధన ఫలితమేనని చెప్పవచ్చు. కొత్త కప్ప జాతిని కొనున్న డాక్టర్ల బృందంలో డాక్టర్ జయాదిత్య పుర్కాయస్థ, డాక్టర్ దీపాంకర్ దత్తా, డాక్టర్ జయంత గొగోయ్, డాక్టర్ సైబల్ సేన్గుప్తాతో సహా పలువురు పరిశోధకుల ఉన్నారు. వారి పరిశోధనలు ఏప్రిల్ 14,2025న ప్రతిష్టాత్మక పీర్‌రివ్యూడ్ జర్నల్ జూటాక్సాలో ప్రచురించబడ్డాయి. ఈ పనికి ప్రపంచ విశ్వసనీయతనును పొందాయి. ఈ జాతికి గువాహటిలోని ఆర్య విద్యాపీఠ్ కళాశాల గౌరవార్థం లెప్టో్బ్రాచియం ఆర్యటియం అని పేరు పెట్టారు. ఈ ఆవిష్కరణ పరిశోధకుల వృత్తిలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచించడమే కాకుండా దాగి ఉన్న జీవవైవిధ్యాన్ని వెలికి తీయడంలో శాస్త్రీయ పరిశోధన ముఖ్యమైన పాత్రను కూడా ప్రదర్శిస్తుంది. ఇది ఈశాన్య భారతదేశంలో పర్యావరణ అధ్యయనాలకు బలమైన పునాది వేస్తుంది. పెద్దగా తెలియని జాతులు కనుమరుగయ్యే ముందు వాటిని రక్షించడానికి పరిరక్షణ శాస్త్రంలో పెట్టుబడు ప్రాముఖ్యతను బలోపేతం చేస్తుంది.

### పరిశోధన ప్రక్రియ, ప్రత్యేక లక్షణాలు

2004లో శాస్త్రవేత్తలు అసోంలోని కప్ప జనాభాను అధ్యయనం చేయడం ప్రారంభించినప్పుడు, వారు మొదట దీనిని బంగ్లాదేశ్, ఆగ్నేయాసియాలో సాధారణమైన లెప్టో్బ్రాకియం స్మిత్ అనే జాతిగా తప్పుడు భావించారు. ఆ సమయంలో పరిమిత సమాచారం కారణంగా కచ్చితంగా గుర్తించేందుకు సాధ్యం కాలేదు. అయితే, తరువాత మయన్మార్లోని లెప్టో్బ్రాచియం రాఖినెన్స్, బంగ్లాదేస్‌లోని లెప్టో్బ్రాచియం సిల్హెటికం వంటి సంబంధిత జాతుల ఆవిష్కరణలు ముఖ్యమైన తులనాత్మక గణాంకాలను అందించాయి. మార్ఫోమెట్రిక్, జెనోమిక్, బయోఅకౌస్టిక్ విశ్లేషణల ద్వారా ఇది విభిన్నంగా ఉందని బృందం నిర్ణయించిన తరువాత అసోం కప్ప జనాభాకు లెప్టో్బ్రాచియం ఆర్యటియం అని పేరు పెట్టారు. ఈ జాతి ఇతర కప్పలతో పోలిస్తే శక్తివంతమైన నారింజ, నలుపు కళ్ళు, జాలకపు మెడ నమూనా, మృదువుగా, లయబద్ధంగా రాత్రిపూట అరవడం ద్వారా ప్రత్యేకంగా గుర్తింబడింది. అరుదైన పక్షులు, సీతాకోకచిలుకలు, ఏనుగులు , పచ్చని ఆకులతో కూడిన జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన గర్భంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో కొత్త జాతి కప్పను కనుగొన్నారు. గౌహతిలో నీరు, తావరణ వ్యవస్థలను నియంత్రించడానికి ఇది చాలా అవసరం. అయితే ఆవాసాల క్షీణత, పట్టణీకరణ కారణంగా ఈ జీవ అభయారణ్యం ప్రమాదంలో ఉందని డాక్టర్ పుర్కాయస్థ హెచ్చరిస్తున్నారు. పట్టణ జీవ వైవిధ్యంపై మరింత పరిశోధనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నగర పర్యావరణ వ్యవస్థలు రక్షిత ప్రదేశాలలో కనిపించే వాటిలాగే సంక్లిష్టంగా ఉండగా, సమగ్ర పరిరక్షణ పద్ధతులకు పట్టణ పరిసరాలలో జాతుల పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం అవసరం. లెప్టో్బ్రాచియం ఆర్యటియం ఆవిష్కరణ అసోం సహజ వారసత్వ వేడుక మాత్రమే కాదు. ప్రమాదం ఉందని కూడా గుర్తు చేస్తుంది.


**21 సంవత్సరాల అధ్యయనం తరువాత గుర్తింపు**
**అసోం కళాశాల గౌరవార్థం లెప్టో్బ్రాచియం ఆర్యటియంగా నామకరణం**

## సౌర వ్యవస్థకు మించిన జీవనానికి బలమైన ఆధారాలు



భూమికి 124 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఒక పెద్ద గ్రహం మన సౌర వ్యవస్థకు మించి గ్రహాంతర జీవితం అభివృద్ధి చెందుతుందని ఇంకా బలమైన సాక్ష్యాలను అందించిందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కె2–18బి అనే గ్రహం జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ పరిశీలనలు రెండు సమ్మేళనాల రసాయన వేలిముద్రలను బహిర్గతం చేస్తాయి. రసాయనాలు, డైమీథైల్ స్ఫడ్ (డిఎంఎస్), డైమీథైల్ డైస్ఫడ్ (డిఎండిస్)లను గుర్తించడం అనేది గ్రహాంతర జీవ కార్యకలాపాలకు రుజువు కాదు. కానీ విశ్వంలో మనం చాలా దగ్గరగా ఉన్నామా అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వగలదు. సౌర వ్యవస్థకు మించిన జీవసంబంధ కార్యకలాపాలకు ఇది ఇప్పటి వరకు ఉన్న బలమైన సాక్ష్యం అని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్ అన్నారు. 'ఇప్పటి నుండి దశాబ్దాల తరువాత, మనం ఈ సమయంలో వెనక్కి తిరిగి చూడవచ్చు. సజీవ విశ్వం అందుబాటులోకి వచ్చినప్పుడు గుర్తించవచ్చు. ఇది కొన బిందువు కావచ్చు. ఇక్కడ అకస్మాత్తుగా మనం విశ్వంలో ఒంటరిగా ఉన్నామా అనే ప్రాథమిక ప్రశ్నకు మనం సమాధానం ఇవ్వగల సామర్థ్యం కలిగి ఉంటాము' అని అన్నారు. లియో నక్షత్ర సముదాయంలో ఉన్న కె2–18బి, భూమి కంటే తొమ్మిది రెట్లు పెద్దది. దాని నక్షత్రం నివాసయోగ్యమైన జోన్‌లో 2.6 రెట్లు పెద్దది. కక్ష్యలు, సూర్యుని సగం కంటే తక్కువ పరిమాణంలో చల్లని ఎరుపు మరగుజ్జుగా ఉన్నాయి. 2019లో హబుల్ అంతరిక్ష టెలిస్కోప్ దాని వాతావరణంలో నీటి ఆవిరిని గుర్తించినప్పుడు శాస్త్రవేత్తలు దీనిని సౌర వ్యవస్థకు మించిన 'అత్యంత నివాసయోగ్యమైన ప్రపంచంగా ప్రకటించారు. 2023లో మధుసూదన్ బృందం తదుపరి పరిశీలనలలో నీటి సంకేతం మీథేన్ అని తేల్చింది.

## జన్యుపరంగా భయంకరమైన తోడేళ్లు రూపకల్పన



అమెరికాలో తెలియని సురక్షితమైన ప్రదేశంలో ట్రోటింగ్, నిద్రపోవడం, అరవడం వంటి అంతరించిపోయిన భయంకరమైన తోడేళ్ళను పోలి ఉండే మూడు జన్యుపరమైన తోడేళ్లను ఓ కంపెనీ రూపొందించింది. అంతరించిపోతున్న జాతులను తిరిగి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ ప్రకటించింది. మూడు నుండి ఆరు నెలల వయస్సు ఉన్న తోడేలు పిల్లలు పొడవాటి తెల్లటి జుట్టు, కండరాల దవడలను కలిగి ఉంటాయి. ఇప్పటికే 80 పౌండ్ల బరువు ఉండగా, పరిపక్వత సమయంలో 140 పౌండ్లకు చేరుకుంటాని, కొలొస్సల్ బయోసైన్సెస్ పరిశోధకులు నివేదించారు. 10,000 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉండి అంతరించిపోయిన భయంకరమైన తోడేళ్ళు, నేడు వారి దగ్గరి ఉన్న బూడిద రంగు తోడేళ్ళ కంటే చాలా పెద్దవి. భారీ శిలాజాల నుండి పురాతన డిఎన్ఏను పరిశీలించడం ద్వారా భయంకరమైన తోడేళ్ళు కలిగి ఉన్న నిర్దిష్ట లక్షణాల గురించి శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. ఒహియోలో వెలికితీసిన 13,000 సంవత్సరాల పురాతన భయంకరమైన తోడేళ్ల పంటిని, ఇడాహోలో కనుగొన్న 72,000 సంవత్సరాల పురాతన పుర్రె భాగాన్ని అధ్యయనం చేశారు. శాస్త్రవేత్తలు సజీవంగా ఉన్న బూడిద రంగు తోడేలు నుండి రక్త కణాలను తీసుకొని, వాటిని 20 వేర్వేరు ప్రదేశాలలో జన్యుపరంగా సవరించడానికి క్రిస్పర్‌నును ఉపయోగించారని కొలొస్సల్ ప్రధాన శాస్త్రవేత్త బెత్ షాపిరో చెప్పారు. వారు ఆ జన్యు పదార్థాన్ని పెంపుడు కుక్క నుండి గుడ్డు కణానికి బదిలీ చేశారు. పిండాలను సర్రోగేట్స్, పెంపుడు కుక్కలకు కూడా బదిలీ చేశారు. 62 రోజుల తరువాత జన్యుపరంగా ఇంజనీరింగ్ చేయబడిన కుక్కపిల్లలు జన్మించాయి. అంతరించిపోయిన ఉన్నిగల మముత్లు, డోడోలు మరియు ఇతరులను పోలి ఉండే జంతువులను సృష్టించడానికి జీవ జాతుల నుండి కణాలను జన్యుపరంగా మార్చడానికి కోలోసల్ గతంలో ఇలాంటి ప్రాజెక్టులను ప్రకటించింది. ఆగ్నేయ అమెరికాలో అంతరించిపోతున్న ఎర్ర తోడేళ్ళ జనాభాలోని అడవి తోడేళ్ళ నుండి తీసుకోబడిన రక్తాన్ని ఉపయోగించి నాలుగు ఎర్ర తోడేళ్ళను క్లోన్ చేసినట్లు కూడా కొలొస్సల్ నివేదించింది.



## మొట్టమొదటిసారిగా కెమెరాలో భారీ స్క్విడ్ బందీ

**వందేళ్ల క్రితమే గుర్తింపు**

వందేళ్ల క్రితమే గుర్తించి దానికి పేరు పెట్టిన తరువాత మొట్టమొదటిసారిగా శాస్త్రవేత్తలు సహజ వాతావరణంలో భారీ స్క్విడ్‌ను చిత్రీకరించారు. ఈ మేరకు ష్మిత్ ఓసియన్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. ఇది జీవితకాలంలో ఒకసారి వచ్చే పరిస్థితి అని, ఈ రకమైన ఆవిష్కరణలు చాలా తరచుగా రావు అని ఎసెక్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మిచెల్ చెప్పారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని దక్షిణ శాండ్విచ్ దీవులలోని నీటిలో కొత్త సముద్ర జీవి కోసం వెతుకుతున్న 35 రోజుల యాత్రలో మార్చి 9న భారీ స్క్విడ్‌ను చిత్రీకరించారు. 1,100 అడుగుల లోతులో దాదాపు ఒక అడుగు పొడవు, సీత్రూ రూపాన్ని కలిగి ఉన్న బాల్య భారీ స్క్విడ్‌ను రిమోట్ ద్వారా ఆపరేట్ చేసే వాహనం ద్వారా తీసిన చిత్రీకరించారు. ఈ భారీ స్క్విడ్ దాని సహజ వాతావరణంలో సజీవంగా గుర్తించడం ఇదే మొదటిసారి. అయితే అంతకుముందు మత్స్యకారులు దానిని పట్టుకుని ఉపరితలంపైకి తీసుకువచ్చిన సందర్భాలూ ఉన్నాయి. 'దీనిని మొదటిసారి ప్రత్యక్షంగా చూసినప్పుడు, ఇది చాలా అందంగా ఉందని, ఈ అద్భుతమైన చిన్న



స్క్విడ్‌చూసి మంత్రముగ్దులమయ్యామని చెప్పారు. మెసోనిచోటీథిస్ హామిల్టోని అని కూడా పిలువబడే సాంప్రదాయ భారీ స్క్విడ్ 23 అడుగుల పొడవు పెరుగుతుందని, 1,100 పౌండ్ల బరువు ఉంటుందని అంచనా వేశారు.

## నిర్మాణరంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్ కాకతీయ యూనివర్సిటీ లేబర్ అడ్డాలో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారిన ఆయన ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల కృషి ఎంతో విలువైనదన్నారు. దేశాల, రాష్ట్రాల అభివృద్ధిలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. ఈనెల 21,22 తేదీలలో శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్లో జరుగుతున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు రోజు పాటు జరిగే ఈ మహాసభలలో మొదటి రోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ, ప్రతినిధుల మహాసభ మొదలవుతుందని చెప్పారు. ఆ మహాసభలలో 500 మంది ప్రతినిధులు పాల్గొని భవిష్యత్తు కార్యక్రమాలను నిర్ణయించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలతో కార్మిక ఉద్యమ బలోపేతం అవుతుందని, ఈ మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. మహా సభల పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట బిక్షపతి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గుంటి రాజేందర్, పొనుగంటి రాము, అమృతయ్య, కృష్ణ కుమార్, చేరాలు, సారయ్య పాల్గొన్నారు.

## అర్హులైన వారికే లేబర్ కార్డులు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాలలో గృహ నిర్మాణ వ్యవస్థ దెబ్బ తిన్నదని వీటిపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నారని తెలంగాణ బిల్డింగ్, కన్సల్టింగు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.కిరణ్, గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్, జిల్లాప్రధాన కార్యదర్శి రామిళ్ళ రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 21,22 రెండు రోజుల పాటు రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే 4 వ రాష్ట్ర మహాసభల పోస్టర్లలను శుక్రవారం జగిత్యాలలో ఎఐటియుసి పిలుపు మేరకు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్, మహేష్‌లు మాట్లాడుతూ బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో స్థానిక లేబర్లకు ఉపాధి దెబ్బ తిన్నదని పేర్కొన్నారు. స్థానిక కార్మికులకు ప్రభుత్వ నిర్మాణ రంగంలో పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జగిత్యాలలో అర్హులైన కార్మికులకే లేబర్ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని కిరణ్, మహేష్ అధికారులను కోరారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. వారికి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జగిత్యాల టౌన్ కార్యదర్శి శివ ప్రసాద్, కోశాధికారి మల్లేశం, నాయకులు రంజిత్. ప్రశాంతు. ప్రతాప్ సింగ్. పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాలతోనే సిపిఐ బలోపేతం

పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సిపిఐలో పలువురి చేరిక

ఎర్ర కండువాలు కప్పి ఆహ్వానించిన పల్లా, నెల్లికంటి



**ప్రజాపక్షం/మునుగోడు :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రజా పోరాటాలకు ఆకర్షితులై మండలంలోని కిష్టాపురం, చీకటిమామిడి, రావిగూడెం గ్రామాలకు చెందిన సుమారు 50 మంది యువకులు, ప్రజలు శుక్రవారం సిపిఐలో చేరారు. వారికి సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతమవుతుందన్నారు. పార్టీ చేస్తున్న ఉద్యమాలకు పలువురు ఆకర్షితులై సిపిఐలో చేరుతున్నారన్నారు. కార్మికుల, కర్షకుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న చరిత్ర సిపిఐకు ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. పేదలకు ఇండ్లు, ఇంటి స్థలాలు, పెన్షన్లు మొదలైన సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేంతవరకు పోరాడుతామని ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అణగారినవర్గాల అభివృద్ధి లక్ష్యంగా, కష్ట జీవుల సమస్యల పరిష్కారానికి అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించిన పార్టీ సిపిఐ అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు తాగు నీరు అందించేంతవరకు కృషి పోరాటాలు చేస్తామని అన్నారు. పార్టీ చేస్తున్న పోరాటాలు, ఉద్యమాలకు అండగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ్మా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీనివాసు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బి.లాలు తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో చీకటి మామిడి గ్రామానికి చెందిన ఏరుకొండ నాగేష్, చింతల వెంకటయ్య, తాటికొండ సైదులు, కిష్టాపురం గ్రామానికి చెందిన బింగి శంకరయ్య, కోనేటి ముత్తయ్య, చంద్రయ్య, రాయి గూడెం గ్రామానికి చెందిన సంపంగి కోటి, సంపంగి చిరంజీవి, గని, నరసింహ, వెంకటేష్, స్వామి యాదయ్య తదితరులు ఉన్నారు.

## ఉపాధిహామీ పథకంలో పనిదినాల సంఖ్య పెంచాలి

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను 150 రోజులకు పెంచాలని, వేతనాలను రోజు కూలీ రూ. 400లు పెంచాలని, గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సులను తక్షణమే అమలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ విపత్తు కరువు ఉపశమన నిబంధన కింద, అడవి ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల కుటుంబాలకు ఉపాధిహామీ పథకం కింద 200రోజులు పనులు కలిగించాలని చేసిన సిఫార్సుల అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. కూలీని రూ.400 అందించాలని సిఫారస్ చేయడం అన్యాయమని కనీసం రూ. 700లు ఇవ్వాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే పార్లమెంటరీ కమిటీ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆధార్ వివరాలలో చిన్న అక్షర లోపాల సాకు తో కోట్లాది కూలీల జాబు కార్డుల తొలగించడం సరైనది కాదని అర్హత కలిగిన కూలీలందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పనికలిపించాలని కమిటీ సిఫార్సు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పేదల వ్యతిరేక విధానాన్ని విడనాడి ఉపాధి హామీ పథకానికి తగిన విధంగా నిధులు పెంచి పనులు కలిగించాలని, వేతనాలు జాప్యం లేకుండా వారానికి ఒకసారి చెల్లించాలని, పట్టణ ప్రాంతాలకు ఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు మోడల్ పరీక్షలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మాదిరి పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని, విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని చదవాలని ఎస్ఆర్ విద్యాసంస్థల నిజామాబాద్ జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం అన్నారు. శుక్రవారం కంఠేశ్వర్‌లోని ఎస్ఆర్ విద్యాసంస్థల ఎంఎస్ఆర్ క్యాంపస్‌లో ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మోడల్ ఎఫ్‌సెట్ నీట్ పరీక్ష పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలంటే విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, అటువంటి ఆత్మ స్థైర్యాన్ని మాదిరి పరీక్షలు రాయడంతోనే వస్తుందన్నారు. ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా ఆరు సెంటర్లలో విద్యార్థులకు మోడల్ ఎఫ్‌సెట్ నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మోడల్ ఎంసెట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ నాయకులు కుషాల్, వంశీ, కార్తీక్, శిరీష, నరేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక సంఘాల ఐక్య గర్జన.. మే 20న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం

సన్నాహక సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. శుక్రవారం మార్క్స్ భవన్‌లో జరిగిన ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, టియుసిఐ, టిఎన్‌టియుసి సంఘాల జెఎసి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్, టియుసిఐ జాడి దేవరాజు, టిఎన్‌టియుసి మణిరామ్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ ఈ నెల 27న మార్క్స్ భవన్‌లో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తుగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికులు అనేక పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. కేవలం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని వారు జోస్యం చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని ఆయన ఆరోపించారు. మోదీ గత పదేళ్ల కాలంలో దేశంలో పలు ప్రభుత్వ రంగం మూతబడి కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, ఖలీందర్ అలీ ఖాన్, సిఐటియు రాజేశ్వరి, ఐఎఫ్‌టియు నాయకులు మేకల రాములు, చిన్నయ్య, రాజేశం, సురేందర్, గణేష్, టియుసిఐ దేవరాజు, టిఎన్‌టియుసి నాయకులు సుధాకర్, రాజయ్య, సుభాన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



ప్రజాపక్షం / పెబ్బేరు: పెబ్బేరు మండల పరిధిలోని రంగాపూర్ బైపాస్ సమీపాన రాత్రి 10 గంటల సమయంలో పెబ్బేరు గ్రామానికి చెందిన ఎల్లా స్వామి (35) తన పొలానికి వెళ్లి నీళ్లు పెట్టి ఇంటికి తన టీవీఎస్ ఎక్సల్ బైక్ టీఎస్ 32 ఏ 5214పై వస్తుండగా ఎన్‌హెచ్ 44 మీద శ్రీ కృష్ణ హోటల్ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి కారు టీఎస్ 08హెచ్‌డబ్ల్యూ 9692 డ్రైవర్ అతి వేగంగా ఆజాగ్రత్తగా వచ్చి ఎల్లస్వామి బైక్‌ని ఢీకొంది. సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ యుగంధర్ రెడ్డి వివరించారు.

## సంజనకు అభినందన



ప్రజాపక్షం/జడ్చర్ల: ఇటీవల తోటి కళాకారులతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన సంజనను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, జడ్చర్ల మున్సిపల్ కౌన్సిలర్ కాటేమోని శంకర్(దేవా) అభినందించారు. మహబూబ్‌నగర్ రైతు బజార్ లో కూరగాయాల వ్యాపారం చేసే మాడేమోని చందు భాగ్యలక్ష్మి ల ఏకైక కుమార్తె ఈ బాలిక ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని చైతన్య సెంట్రల్ స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శుక్రవారం నేరుగా వారి నివాసానికి వెళ్లి సంజనను శాలువాతో సత్కరించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చదువులోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల మురళి పాలాది రామ్మోహన్ నరసింహ యాదవ్, గోపాల్ యాదవ్ బిఆర్ఎస్‌వి నాయకులు నవీన చంద్రా రెడ్డి, కాటేమోని బాలు ముదిరాజ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 27న చలో వరంగల్ రజతోత్సవ సభ

ప్రజాపక్షం/మక్తల్: పల్లె, పల్లెలో కదం తొక్కుతున్న ప్రజలు మక్తల్ నియోజకవర్గం కేటీఆర్ యువసేన సోషల్ మీడియా కన్వీనర్ నరసింహనాయుడు మక్తల్ నియోజకవర్గం ప్రతినిధి 18 ఎక్స్‌ప్రెస్ న్యూస్ వరంగల్ వేదికగా సిద్ధమవుతున్న తరణంలో రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంతో వరంగల్ కు కదిలి రావాలని, గ్రామ గ్రామాన ప్రతి పల్లెలో కదిలి రావాలి అనే నినాదంతో ప్రతి ఉర్లో నూతన చైతన్యం వెల్లి విరుస్తోంది. ప్రతి వాడలో, ప్రతి గల్లీలోను, గ్రామాన, పట్టణంలో ఉద్యమస్ఫూర్తితో వరంగల్ వేదికను జయప్రదం చేయవలసిందిగా మక్తల్ నియోజకవర్గం కేటీఆర్ యువసేన సోషల్ మీడియా కన్వీనర్ నరసింహనాయుడు నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు.

## ముంపు గ్రామాల సమస్యలు పట్టవా?



ప్రజాపక్షం/మక్తల్: హైదరాబాద్ జలసౌధలో ఆర్ అండ్ ఆర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి మాట్లాడారు. కృష్ణానదిపై ఎన్ని లిఫ్టులు గత కొన్ని సంవత్సరాలుగా పని చేయడం లేదు. కొన్నింటిని అయితే బాగుచేయించుకోగలిగాం. కానీ ఇంకా కొన్ని లిఫ్టులు చిన్న చిన్న సమస్యలతో వాడుకోలేకపోయాం. వాటిని పరిష్కరించి, కొన్ని వేల ఎకరాలకు సాగు నీటిని అందించాలని కోరారు.

## రక్తదాతలకు అభినందన



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మీ సేవలు అమోఘం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఫైర్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రక్తదాత లకు ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, డిఎఫ్ఓ పి.కృష్ణ ఎస్ఎఫ్ఓ మల్లిఖార్జున్, రాజేందర్ యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సంజీవరెడ్డి, తులసి రాంనాయక్ పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: గ్రామీణ రహదారులకు మహర్దశ ప్రారంభమైందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్టీ ఎస్టీఎఫ్ నిధులు 2.24 కోట్ల రూపాయల తో పిడబ్ల్యూడి రోడ్ నుండి దొర్రి తాండా వరకు బిటి రోడ్డు నిర్మాణపు పనులకు ఆయన ముఖ్య అతిథిగా శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి తాండాకు బిటి రోడ్డు ఏర్పాటు చేస్తామన్నా రు.మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, టంకర కృష్ణయ్య యాదవ్, లక్ష్మణ్ నాయక్, లింగం నాయక్, ధర్మా నాయక్,కె.లక్ష్మణ్,గంగిరెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, నవనీత, శ్రీశైలం, మేగ్యా నాయక్, రఘు దాసరి, కేశవులు, కలీం, కె,లోకేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలపరిధిలోని తర్నికల్‌తండా గ్రామపంచాయతీకి చెందిన ఆంబోతుగుండ్యానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.బిఆర్ఎస్‌పార్టీ గ్రామకమిటి అధ్యక్షుడు గుండ్యానాయక్‌ద్వారా ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్, తెలంగాణ మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు ఉప్పలవెంకటేష్ మృతుడి దహన సంస్కారాలనిమిత్తం తక్షణ ఆర్థికసాయాన్ని అందజేశారు. తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోనిగణేష్, మండల మాజీ కోఆప్షన్‌సభ్యులు రుక్మొద్దిన్, బిఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు గుండ్యానాయక్, దేవయ్య, కృష్ణ, భాస్కర్, చిన్యానాయక్, పాండు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో తెలంగాణభవన నిర్మాణకార్మికసంఘం నూతన కమిటిని ఎన్నుకున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, ఎఐటియూసి ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, భవననిర్మాణ కార్మికసంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ పల్లాదేవేందర్‌రెడ్డి సమక్షంలో తెలంగాణబిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌వర్కర్స్‌యూనియన్‌కమిటిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శివశంకర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లాప్రధాన కార్యదర్శిగా దాంగట్లవెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా దొక్క లక్ష్మయ్య, దేశముని లింగం, సహాయక కార్యదర్శిలుగా సిద్దేష్ విజయ్, కల్వకోల్‌కృష్ణ, జిల్లావర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గడ్డంబాలస్వామి, జిల్లా కోశాధికారిగా బీసంమైబు, జిల్లా కౌన్సిల్‌సభ్యులుగా బంగారయ్య, బాలస్వామి, నూనె కుర్మయ్య, శ్రీరాములు, గడ్డంశ్రీను, చెన్నయ్య, శ్రీను, బండిలక్ష్మయ్య, కుర్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల అభ్యున్నతికి భరోసా కల్పిస్తున్న కెజిబివిలు..

# వ్యక్తిత్వ వికాసానికి బాటలు





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అమ్మాయిల ఉన్నతవిద్యకు కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాలు(కేజిబివిలు) చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈవిద్యాలయాలు బాలికలకు నాణ్యమైన ఉచితవిద్యను అందిస్తూ , బాలికల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయి. పేదరికంలేదా ఇతర కారణాలవల్ల చదువు మానేసిన బాలికలకు కేజిబివిలు ఉన్నతవిద్యకు సురక్షితమైన రహదారులుగా మారుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు నేటినుంచి ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 6నుండి 9వతరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలు గురువారంతో ముగియడంతో శుక్రవారంనుండి ఈనెల 23వతేది బుధవారం ఈవిద్యా సంవత్సరం చివరిరోజువరకు వారంరోజులపాటు బాలికలకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా జిల్లాసమగ్రశిక్షా అభియాన్ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అన్ని కేజిబివిలో శుక్రవారం నుండి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 20 కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాల్లో 6వతరగతి నుండి 9వతరగతివరకు మొత్తం 4వేలమంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. చదువుతోపాటు సాంస్కృతిక, యోగసాధన, వ్యక్తిగత నైపుణ్యాలవంటి కార్యక్రమాలనుసైతం నిర్వహిస్తున్నారు. ఆరురోజులపాటు ప్రత్యేక కార్యక్రమాన్ని విద్యార్థినిలకు నిర్వహించేలా జిల్లాసమగ్రశిక్షా అభియాన్ అధికారులు ఉపాధ్యాయినిలకు దిశానిర్దేశం చేశారు.

### బాలికల సమగ్ర అభ్యున్నతే లక్ష్యం



విద్యాభివృద్ధి అధికారిణి శోభారాణి

జిల్లాలోని కేజిబివిల బా లికల సమయం వృథాకాకుండా, రోజు నిర్వహించే కార్యక్రమాలువారి అభ్యున్నతికి బాటలు వేసేలా ఉన్నాయి. స్వతహాగా వారు స్ఫూర్తిపొందేలా , మిగిలిన విద్యార్థినిలస్ఫూర్తిగాథలతో వారు ముందుకు నడిచేలా కార్యక్రమాలు ఉంటున్నాయి. ఇవి ప్రవేశాల పెంపుతోపాటు , సమాజంలో బాలికలకు ప్రత్యేకగుర్తింపు తెచ్చేలా కూడా ఉపయోగ పడనున్నాయి.

### అమ్మాయిల ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా :



డిఇఒ ఎ.రమేష్‌కుమార్

కేజిబివిలో బాలికలను చదువులపైఆసక్తిని పెంచడంతోపాటు, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా ఆత్మవిశ్వాసంతో ఉండేందుకు బాలికలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయి. పాఠశాలస్థాయిలోనే ప్రతి అంశాన్ని తెలుసుకోవడం ద్వారా బాలికలు జీవితంలో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొవడం నేర్చుకోవాలనే తపన ఆసక్తి పెంపొందుతుంది.

## ప్రజా పాలన కాదిది... అరాచకపు పాలన



ప్రజాపక్షం / వీపనగండ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్నిది ప్రజా పాలన కాదని ఆరాచకపు పాలన అని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజోత్సవ మహసభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరుతూ మండల కేంద్రమైన వీపనగండ్లలో నాయకులు , కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీరం మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే ఇరవై ఐదేండ్ల గులాబీ పండుగను విజయవంతం చేసేందుకు గ్రామ, గ్రామాన పార్టీ నాయకులు కార్యకర్తలు తరలి రావాలన్నారు. జూరాల చివర కట్టుకు సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నారని రైతులు మొరపెట్టుకుంటున్న పాలకులు మాత్రం పట్టించుకోవటం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పంట పొలాలకు, పుష్కలంగా నీరు అందేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను ఇప్పుడు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నారన్నారు. ప్రజా పాలనలో ప్రజల సమస్యలు గాలికి వదిలేసి ప్రజా సమస్యలపైన పోరాటం చేస్తున్న వారిపైన అక్రమ కేసులు నమోదు చేస్తున్నారరని విమర్శించారు. ప్రజా పాలన అంటూ కాంగ్రెస్ నాయకులు తామంతట తామే గొప్పలు చెప్పుకుంటున్నారని, ప్రజా పాలన అంటే ప్రజలు ప్రభుత్వాన్ని మెచ్చుకునే విధంగా ఉండాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలు, రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అభిలాస్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ కమలేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ , రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు ముంతా మల్లయ్య యాదవ్ , నాయకులు సర్దార్ , ముంత శివయాదవ్ , సురేందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామేశ్వర్ రావు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో బిసిలు ఉన్నా.. ఎందుకు ఓడగొడుతున్నారు

ప్రజాపక్షం/వెల్దండ : కల్వకుర్తి నియోజకవర్గంలో బడుగు బలహీనవర్గాల ప్రజలు, ఓటర్లు అత్యధికంగా ఉన్నబిసి అభ్యర్థులు ఎందుకు ఓటమిపాలవుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీతీన్మార్‌మల్లన్న అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో శుక్రవారం జరిగిన బిసిసభకు బయలుదేరిన ఆయన వెల్దండబస్సుస్టేజివద్దగల హోటల్‌వద్ద కొద్దిసేపుఆగిప్రజలతో మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గంకంటే బిసిలు అత్యధికంగా ఉన్నబిసినేతలు జైపాల్‌యాదవ్, ఆచారిలను గత ఏడాదిన్నరక్రితం జరిగిన ఎన్నికల్లో ఎందుకు ఓటమిపాలయ్యారని ప్రశ్నించారు. కేసిఆర్ పాలనబాగుందా, కాంగ్రెస్‌పాలన బాగుందా అని అడగ్గా కెసిఆర్ పాలననే బాగుందని పలువురు సమాధానం ఇచ్చారు. ప్రతిసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిసినేత ఆచారిని ఎందుకు ఓడగొడుతున్నారని , ఓటమికిగల కారణాలు ఏమిటని అడిగి ఆరాతీశారు. బిసిలున్న ఎమ్మెల్యేగా నారాయణరెడ్డి గెలవడం ఏమిటని అక్కడివారిని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఓటు ఎవరికి వేశారని అడిగి తెలుసుకున్నారు. బిసిలంతా అతీతంగా ఏకతాటిపైకిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోని వర్క్‌వర్కాంటిన్‌మెమోరియల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు క్రీస్తుమరణాన్ని స్మరించుకుంటూ 40రోజులుగా ఉపవాసదీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటలవరకు క్రీస్తు మరణాన్ని గుర్తుచేసుకుంటూ చర్చిలో ప్రత్యేక ప్రార్థనచేశారు. ఈసందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్‌బేబిరాజు మానవాళికోసం యేసుప్రభుచేసిన కృషిత్యాగాలను క్రైస్తవసోదరి సోదరులకు వివరించారు. క్రీస్తు శిలువ లోపలికిన ఏడుమాటలు క్రైస్తవమార్గంలో నడుస్తున్నవారికి ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను నేర్పిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సత్య మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులపట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మనిషి చనిపోయేంతవరకు ఏసుప్రభు బోదనలను స్మరించుకుంటూ సమాజానికి ప్రజలకు ఎలా ఉపయోగకరంగా ఉండాలో తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ జోహర్న, వైస్‌చైర్మన్‌స్టీవెన్‌సన్, సెక్రటరీ రామస్వామి, జాయింట్‌సెక్రటరీ జగదీష్, ఇజ్రాయిల్, సురేష్‌బాబు, ఇంజమూరి రాజు,ప్రేమ్,విజయ్‌కుమార్, బొల్లెరాజు, యూత్ చైర్మన్ నేరటిరవి, సెక్రటరీ ఆనంద్, యూత్‌వైస్‌చైర్మన్ జ్యోతిప్రసాద్, ఆనంద్‌కుమార్, ఎంబివార్కంటిన్ మెమోరియల్‌చర్చి సభ్యులు పాల్గొన్నారు.

### నేడు కల్వకుర్తిలో ‘రన్ ఫర్ జీసస్’ కార్యక్రమం

పట్టణంలో శనివారం ప్రొటెస్టెంట్ సంఘాలని సమైక్యంగా కలిసి క్రీస్తుశిలువవేయడం , క్రీస్తు పునరుత్తానంవంటి అంశాల ప్రాధాన్యతను తెలియజేప్పేందుకు నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 8గంటలకు ఎంబిచర్చి నుంచినిర్వహిస్తున్నట్లు రన్‌ఫర్‌జీసస్ కోఆర్డినేటర్స్ తెలిపారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈరన్‌ను జెండాఊపి ప్రారంభిస్తారని తెలిపారు.

## ధారాసింగ్‌కు అంబేద్కర్ ఎక్సలెంట్ అవార్డు



ప్రజాపక్షం /వీపనగండ్ల : శ్రీశైలం ముంపు నిర్వాసితుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న యోధుడు రాజకీయ యువ నాయకుడు ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని బైక్యం గ్రామానికి చెందిన ధారాసింగ్‌కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎక్సలెంట్ అవార్డును మెగా సీటీ నవకల వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా ధారా సింగ్ కు అవార్డును ప్రధానం చేశారు. శ్రీశైలం, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తూ , అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలోని మంత్రులను అధికారులను కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. అంతేకాక 67 గ్రామాల ముంపు నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించి, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాటంచేస్తూ సమస్యను హై కోర్టు వరకు తీసుకువెళ్లారు. నిర్వాసితుల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాటం చేస్తున్న ధారా సింగ్ కు డా. బిఆర్ అంబేద్కర్ ఎక్సలెంట్ అవార్డురావడం పట్ల ఉమ్మడి వీపనగండ్ల చిన్నంబాయి మండలంలోని పలువురు రాజకీయ నాయకులు, ముంపు గ్రామాల నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు.

## కొనసాగుతున్న మట్టి తవ్వకాలు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్-ప్రతినిధి : ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయకబృందాల ఉన్నతాధికారులతో శుక్రవారం ఎస్ఎల్‌బిసి ప్రత్యేకాధికారి శివశంకర్‌లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొరంగప్రమాదప్రదేశంలో డి2 ప్రాంతంలో పెద్దపెద్ద బండరాళ్లను తొలగిస్తూ, మట్టితవ్వకాలు కొనసాగిస్తూ కన్వేయర్‌బెల్టుద్వారా మట్టిని టన్నెల్ బయటకుతరలించే ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుందని తెలిపారు. టిబిఎంస్టీల్ భాగాలను అల్ట్రాథర్మల్ కట్టర్లతో కత్తిరిస్తూ, స్టీల్‌భాగాలను లోకో ట్రైన్‌ద్వారా బయటికి తరలిస్తున్నట్లు, డివాటరింగ్‌ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. సహాయక బృందాల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సహాయక సిబ్బంది సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారని వారికి అవసరమైన సహాయక సామాగ్రిని, వసతులను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో సహాయక బృందాల ఉన్నతాధికారులు, జేపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచలోహ శివలింగానికి పూజలు



ప్రజాపక్షం / కొత్తకోట: కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానం దగ్గర ఊతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని బీజేపీ స్టేట్ కౌన్సిల్ నంబర్ సీనియర్ న్యాయవాధి మున్నూరు రవిందర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో అశిస్సులతో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు

### జిల్లా ఎస్‌పి డి.జానకి
### విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
### లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొద్దు



ప్రజపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలి, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక రైతు కూడా నష్టపోవద్దు అని ఎస్పీ డి.జానకీ ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలి అన్నారు. రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారం అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉన్నది, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాము. పిడి యాక్ట్ తప్పదు. షీట్స్ నమోదు చేస్తాం అని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా సరిహద్దుల ప్రాంతంల నుండి నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నది, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ అన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలి అని ఆదేశించారు. రైతుల అత్యంత అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేసినారు నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు. అని కోరినారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల నుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరినారు. నకిలీ విత్తనాలు గురించి, అనుమానిత బ్రోకర్లు డీలర్ల గురించి పోలీస్ వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి అని కోరారు.

## 42% బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత వచ్చాకే నోటిఫికేషన్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి: 42 శాతం బీసీరిజర్వేషన్లు బిల్లుకు సంబంధించి చట్టబద్ధత వచ్చిన తర్వాతనే ఉద్యోగాలకు నోటిషికేషన్లు ఇచ్చి భర్తీ చేయాలని, అప్పుడే బసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌సాగర్‌డిమాండ్ చేశారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తయింది కాబట్టి ఇక ఉద్యోగ నోటిఫికేషన్ తెర లేపడం జరిగిందని ఈ నెలాఖరులోగా అన్ని రకాల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతాయని ప్రభుత్వ వర్గాలు తెలియజేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయడం జరిగింది. కానీ ఇటీవల బీసీ వర్గాలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్ సంగతి ఏంటి? కేంద్ర ప్రభుత్వం నుంచి గాని రాష్ట్రపతి నుండి గాని ఇంతవరకు ఎలాంటి సానుకూలత రాలేదని మాట్లాడుతూ ఎందుకు బీసీల పట్ల, బీసీ నిరుద్యోగుల పట్ల ఇంత వివక్షత ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రపలి ఉత్తర్వులు ఆలస్యమవుతున్నాయని జి.ఓ. ఎంఎస్ నెం. 33 తేదీ 30.09.2022 తెచ్చిన విషయం తెలిసిందే అని దీని ద్వారా ఎస్టీ రిజర్వేషన్ ను 6% నుండి 10% కు పెంచారు. దీంతో అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక రిజర్వేషన్లు 50% నుండి 54% చేరాయి. గతంలో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 50% కోటాకు మించి ఉందని కొందరు కోర్టులను ఆశ్రయించారు కూడా. కానీ అది ఇంతవరకు ఏమి తేలలేదు. 42 % కు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని బీసీ సంఘాలు నిరుద్యోగులు కోరుతున్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ట్రాక్టర్ కింద పడి రైతు మృతి

**ప్రజాపక్షం/గుండాల:** ట్రాక్టర్ కింద పడి రైతు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన గంగాపురం రామకృష్ణ(38) వరి ధాన్యాన్ని ఐకెపి సెంటర్లో పోసి ట్రాక్టర్‌ను మలిపే క్రమంలో ట్రాక్టర్ టైరు పక్కనే ఉన్న వరి బస్తాను ఎక్కడంతో ట్రాక్టర్ బోల్తా పడుతుందనే భయంతో ట్రాక్టర్‌పై నుండి కిందకు దూకడంతో ట్రాక్టర్ టైరు రైతు రామకృష్ణ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయం కావడంతో ఎవరు చూడకపోవడంతో శుక్రవారం ఉదయం ఐకేపి కేంద్రానికి వచ్చిన రైతులు చెట్ల పొదల్లో ట్రాక్టర్ ఇంజన్‌ను చూసి వెళ్లే సరికి రామకృష్ణ మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రామకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.





## ఇందిరమ్మ ఇండ్లలో తప్పులుండొద్దు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : ఇందిరమ్మ ఇల్లు త్వరగా పూర్తి చేయాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్ల విషయంలో అధికారులు ఏలాంటి తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథలయ సంస్థ చైర్మన్ ఎండి ఆవేస్ చిస్తీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పొత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బర్రె జహంగీర్, కూర వెంకటేష్, టి.రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించే సిఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుతుందని రాష్ట్ర పర్యాట అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 15మంది లబ్దిదారులకు రూ. 6.88లక్షల సిఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల కాలంలోనే పేద ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రేవంత్ రెడ్డి రూ. 1000కోట్ల రూపాయలు అందించారన్నారు. సిఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు డాక్టర్ రాంమూర్తి యాదవ్, నాయకులు వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చొక్కయ్య పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడియాక్టు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మిన, సరఫరా చేసిన వారిపై పిడి యాక్టు కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్‌పి కె నరసింహ హెచ్చరించారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేశానికి వెన్నుముఖ అయిన రైతుల నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విత్తన కంపెనీల డీలర్లు, వ్యాపారులు బాధ్యతగా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు జిల్లాలో రాకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, మధ్యవర్తుల గురించి తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## భూ భారతితో రైతు సమస్యలు పరిష్కారం

సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుక వచ్చిన భూ భారతితో రైతుల సమస్యలను పరిష్కారమవుతాయని, ఈ యాప్‌ను సిపిఐ పార్టీ స్వాగతిస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణితో రైతుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పట్టాలదారుల వివరాలు మార్పులు, చేర్పులు కాక ప్రలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిన భూ భారతి యాప్‌తో ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కారమవుతారని రైతులు విశ్వసిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకట రెడ్డి, షెక్ నబిసాహెబ్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి ఆదర్శం

**ప్రజాపక్షం/చివ్వెంల:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి ఆదర్శమని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మున్యానాయక్ తండా ఆవాసం పీక్లనాయక్ తండాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరు సమానంగా స్వచ్ఛమైన వాతావరణంలో జీవించేలా రాజ్యాంగం ద్వారా బిఆర్ అంబేద్కర్ అన్ని వర్గాలకు హక్కులు కల్పించారన్నారు. ప్రపంచ మేధావుల్లో ఒకరైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎన్నో ఉన్నతమైన చదవులు చదివి దేశంలోని అన్ని కులాలు, మతాల వారికి సమన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రైకార్ ఇస్లావత్ రామచంద్రు నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అధికారులు కె లత, శంకర్, తహసీల్దార్ కృష్ణయ్య, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ మహేశ్వర్, సామాజిక కార్యకర్త నరసింహారావు, మాజీ సర్పంచ్ బికారి, మాజీ ఎంపిటిసి సుశీల సాగర్, విగ్రహదాత సురేష్ నాయక్ పాల్గొన్నారు.



## భూ భారతి కాంగ్రెస్ చరిత్రలో సువర్ణాధ్యాయం

భూభారతి చట్టంతో ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచిపోయారు

రైతు సంక్షేమ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కాంగ్రెస్ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయమని రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. భూదానోద్యమ వజ్రోత్సవాల, భూదాన జయంతి సందర్భంగా శుక్రవారం భూధాన్ పోచంపల్లివినోబా నగర్ డెవలప్మెంట్ సొసైటీ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉద్యమ ఉద్రోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన భూభారతి భూదాన భూముల పరిష్కారాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు భూభారతి రూపకర్త ల్యాండ్ సునీల్ రెడ్డిలతో పాటు రైతు కమిషన్ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నిరంతరంగా కృషి చేస్తున్న విషయాన్ని ఎవరు మరువద్దని హామీ ఇచ్చినట్లుగానే భూభారతి చట్టము రైతుల సంక్షేమం కోసం ఈ చట్టం ప్రవేశపెట్టడం జరిగిందని ధరణి సమస్యలు ప్రజల్లో ఒక రకమైన భయాందోళనలకు గురిచేసిందని వివరించారు. వివిధ రకాల భూ సమస్యల పరిష్కారాలకు భూభారతి చట్టం పరిష్కారాలు చూపుతుందిని తెలిపారు. అవగాహన సదస్సులో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రూపకర్త సునీల్ రెడ్డి భూభారతిలోని ప్రతి అంశాన్ని రైతులకు క్షుణ్ణంగా వివరించి ఏ సమస్య ప్రతి సమస్యకు పరిష్కార మార్గం వైపు భూభారతి దిక్సూచిగా పనిచేస్తుందని తెలిపారు. భూభారతి రూపకర్త భూమి సునీల్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ పేదల భూములకు భరోసానివ్వడానికే అత్యద్భుతమైన ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కల్పన ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ యాదగిరి నేతృత్వంలో స్థానికులైన హోదా ఉద్యమకారులకు ముగ్గురిని శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అవార్డులతో సత్కరించారు. కాగా వినోబాభావే ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ తడక యాదగిరి గాంధీ గ్లోబల్ సాహితీ, అధ్యక్షులు కే.గోపాల్, మహిళా కన్వీనర్ వెన్ రెడ్డి సంధ్య, రైతు విభాగం కన్వీనర్ పావని రెడ్డి, యువజన విభాగం హరిదీప్ రెడ్డి, కే.సుభాష్ చంద్ర, గ్రామ నిర్మాతల విభాగం కన్వీనర్ జి.గోవర్ధన్, భవాని రెడ్డి, గోపాల్ రెడ్డి, జెడ్పిటిసి కడియం పరమేశ్వర్, వివిధ జిల్లాల గాంధీ గ్లోబల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నెమ్మికంటి సుమిత్రమ్మకు సిపిఐ నివాళి

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన అడ్వకేట్ నెమ్మికంటి గౌరి శంకర్ తల్లి నెమ్మికంటి సుమిత్రమ్మ ఇటీవల మరణించారు. శుక్రవారం ఆమె నివాసానికి వెళ్ళిన సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్‌బండ్ కల సాకారానికి పునాది

భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : భూదాన్ పోచంపల్లి పట్టణ ప్రజలు ఏళ్లనాటి నుంచి ఎదురుచూస్తున్న మినీ ట్యాంక్‌బండ్ కళా సాకారానికి ఎట్టకేలకు పనులు ప్రారంభించేందుకు శుక్రవారం శంకుస్థాపన శిలాఫలకాన్ని వేయడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. పోచంపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపనలో భాగంగా ఆయన దాదాపు రూ.10 రూపాయలతో కలపెట్టనున్న పోచంపల్లి పెద్ద చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. పోచంపల్లి టూరిజంతో పాటు యునెస్కోతో హెరిటేజ్ విలేజ్‌గా ప్రకటించబడి ఉత్తమ టూరిజంగా అవార్డు అందుకున్నప్పటికీ గత బిఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధికి నోసుకోలేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతకు ముందు ఆయన భూదాన జయంతి సందర్భంగా వినోబా మందిరం వద్ద ఏర్పాటుచేసిన భూదానోద్యమ వజ్రోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని వినోబాభావే వెదిరె రామచంద్ర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, ఉపాధ్యక్షులు పకీరు నర్సిరెడ్డి కాసుల అంజయ్య, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.



## చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/డిండి:** యాసంగి పంటకు సంబంధించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణీ ఉన్నప్పుడు రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతుల అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ భూ భారతితో అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించబోతున్నారని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధర ఏగ్రేడ్ 2320, బి గ్రేడ్ కు రూ. 2300 పొందాలని సూచించారు. దొడ్డు రకాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఉన్న రకాలకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నది మన ప్రజా ప్రభుత్వం అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, వెంకటయ్య, తహశీల్దార్ ఆంజనేయులు, ఏవో రహనా, డిటిసిఎస్ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ గోవర్ధన్‌రావు, సీఈవో బాల్‌రెడ్డి, డైరెక్టర్లు రాజేందర్‌రెడ్డి, లక్పతి, కాషన్న, సుమిత్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, యూత్ అధ్యక్షులు సాయి, లక్ష్మణ్, తేజు, శ్రీనివాస్, బద్య, ఏఈవో పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** అక్రమ రవాణ నిరోధించడంలో భాగంగా జిల్లా ఎస్పీ నర్సింహ అదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్, హైటక్ బస్టాండ్ ప్రాంగణాలలో, రద్దీ ప్రాంతాలు, ఫ్లైఓవర్, ముఖ్యమైన వాణిజ్య సముదాయాల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్సులు నిలుపు ప్రాంగణాలను, దుకాణాలను, బస్సుల ప్రయాణీకుల లగేజీ అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ వీర రాఘవులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణ పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేదిత పద్దార్ధాలు అక్రమ రవాణ నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడంలో భాగంగా జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. గుర్తింపు నిర్ధారణ లేని వ్యక్తులకు, అనుమానితులు లాడ్జిల నందు వసతి ఇవ్వవద్దని కోరారు. శాంతిభద్రతల రక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు, ఆర్‌ఎస్‌ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర 4వ మహాసభలకు తరలిరండి

**ప్రజాపక్షం/డిండి:** ఈనెల 21, 22 తేదిలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం డిండి సిపిఐ కార్యాలయంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎన్నో సంవత్సాలు పోరాటాలు చేసి 1996లో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసుకున్నారని, నిజమైన కార్మికులకు తంబు పడక నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తంబు విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని అన్నారు. సాధారణ మరణానికి లక్ష, 50ఏళ్లు దాటిన ప్రతి కార్మికునికి నెలకు 5వేలు పెన్షన్ ఇవ్వాలని, కేంద్ర




ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా కుదించి కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలని, కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులు భర్తీ చేసి కార్మికులకు మెరుగైన సేవలు అందించవలసిన అవసరం అధికారులపై ఉందని అన్నారు. కార్మికులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇస్తూ, ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 21 తేదిన జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు బుషిపాక సాయిలు, ఎలిమినేటి దేవయ్య, నాయకులు లింగమయ్య,చెన్నయ్య, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## మల్లేశ్వరి కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాపక్షం /నిడమనూరు:** మండల పరిధి భోగమంతలపాడు గ్రామంలో అగ్రకుల యువకుడి చేతిలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న దళిత యువతి మల్లేశ్వరి కుటుంబానికి అండగా ఉంటామని మాజీ శాసనసభ్యులు నోముల భగత్ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఒక్కమంతలపాడు గ్రామంలో మల్లేశ్వరి స్వగ్రామ్ లో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత యువతి ఆత్మహత్య చేసుకుంటే కనీసం ప్రభుత్వ నుండి ఇప్పటివరకు అధికార పార్టీ నాయకులు ఎవరు కూడా వచ్చి పరామర్శించకపోవడం విడ్డూరమని, పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు, మల్లేశ్వర కుటుంబానికి కోర్టు ద్వారా న్యాయం చేసేందుకు చొరవ తీసుకుంటామని ఆయన అన్నారు. సూసైడ్ ఆధారంగా పెద్దమనుషులందరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు టి సత్యపాల్, బిఆర్‌ఎస్ నాయకులు బొల్లం రవి, నల్లబోతు వెంకటేశ్వర్లు, పిల్లి రమేష్, సలీం,కామెర్ల జానయ్య, రామలింగయ్య పాల్గొన్నారు.

**మల్లేశ్వరి ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి:స్కైలాబ్ బాబు**

మండల పరిధి బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన దళిత యువతి మల్లేశ్వరి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు, శుక్రవారం మండల పరిధి బొకంతలపాడు గ్రామంలో మల్లేశ్వరి చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు బొట్టు శివకుమార్ కోడి రెక్క మల్లయ్య దైద శ్రీను జిల్లా కమిటీ సభ్యులు దొంతాల నాగార్జున ధోరేపల్లి మల్లయ్య బొంగరాల వెంకటయ్య ఇంజమూరి శివ దైద జనార్ధన్ కోటేష్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :నల్లగొండ జిల్లా కేంద్రంలో పోలీసుల వి స్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు నల్లగొండ టూ టౌన్ ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యం లో నిషేధిత మత్తు పదార్ధాలు, ఇత ర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తిం చేందుకు గాను ప్రత్యేకంగా శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించా రు. బస్టాండు తో పాటు లాడ్జి, దు కాణాలను సిబ్బందితో కలిసి తని ఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు మా ట్లాడుతూ ఎవరైనా అనుమానా స్పద వ్యక్తుల ఆనవాళ్లు ఏమైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇ వ్వాలని కోరారు. అదే సందర్భంలో లాడ్జీల్లో బస చేసే వారి సరైన ధ్రువీ కరణ పత్రాలు తీసుకోవాలని, వారి వివరాలు రికార్డుల్లో నమోదు చే యాలని సూచించారు. చట్ట విరు ద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్ద న్నారు. అనుమానితుల వివరా లను వెంటనే తమకు తెలియజే యాలని సూచించారు.నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చ ర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మత్తు ప దార్థాలకు దూరంగా ఉండాలని వాటి నిర్మూలనకు ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. పట్టణంలో గంజాయి మూలాలను తొలగించడం కోసం పట్టణ పోలీసు లు పటిష్ఠంగా పనిచేస్తున్నామన్నారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట:** శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని పట్టణ సిఐ వీర రాఘవులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డాగ్, బాంబ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ సిబ్బందితో కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్‌తో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై ఉన్న జిల్లా కేంద్రంలో ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుర్తుపు లేని, నిర్ధారణ లేని వ్యక్తులకు లాడ్జీలలో వసతి ఇవ్వవద్దని కోరారు. మాదకద్రవ్యాలు రవాణాను గుర్తించేందుకు డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ఆంజనేయులు, ఆర్‌ఎస్‌ఐ మహేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# క్రీడ

## కుమార్తె పేరు చెప్పిన కెఎల్ రాహుల్.. అర్థమేంటో తెలుసా..?




టీమ్ఇండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ పుట్టిన రోజు నేడు. పలువురు క్రికెటర్లు, అభిమానులు అతడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని రాహుల్, నటి అతియా శెట్టి దంపతులు ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. ఇటీవలే తమ జీవితాల్లోకి వచ్చిన తమ గారాలపట్టిని ప్రపంచానికి పరిచయం చేసిన ఈ జంట.. ఆమె పేరును ప్రకటించింది. తమ కుమార్తెకు ఇవారా అని పేరు పెట్టినట్లు చెప్పారు. చిన్నారిని ఎత్తుకున్న ఫొటోను షేర్ చేసిన రాహుల్ దంపతులు.. 'మా బేబీ గర్ల్.. మా ప్రపంచం. ఇవారా భగవంతుడి కానుక' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం నెట్టింట ఈ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది. రాహుల్, అతియాకు అభిమానులు మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'ఇవారా' అనేది సంస్కృత మూలాలున్న పేరు. దేవుడిచ్చిన ప్రసాదంగా అభివర్ణిస్తూ.. కవిత్వాల్లో ఎక్కువగా ఈ పేరును ఉపయోగిస్తారు. రాహుల్ సతీమణి అతియా శెట్టి మార్చి 24న పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే.

## టిమ్ డేవిడ్ సూపర్ హాఫ్ సెంచరీ..

### పంజాబ్ లక్ష్యం 96



సొంతగడ్డపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు మరోసారి విఫలమయ్యారు. వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ పేసర్లు చెలరేగడంతో టాపార్డర్ కుప్పకూలింది. అయితే.. కెప్టెన్ రజత్ పాటిదార్(23) ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. ఆ తర్వాత టిమ్ డేవిడ్50 నాటౌట్) విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. హర్‌ప్రీత్ బ్రార్ వేసిన 14వ ఓవర్లో డేవిడ్. వరుసగా మూడు సిక్సర్లు బాది అర్ధ శతకం సాధించాడు. డేవిడ్ మెరుపులతో కోలుకున్న ఆర్సీబీ దాంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆర్సీబీకి శుభారంభం దక్కలేదు. చిన్నస్వామిలో తొలి విజయం కోసం నిరీక్షిస్తున్న బెంగళూరును అర్ష్‌దీప్ సింగ్(223) దెబ్బకొట్టాడు. అతడు తొలి ఓవర్లో బౌండరీ బాదిన అదే ఓవర్లో ఫిలిప్ సాల్ట్(4) వికెట్ కీపర్ ఇంగ్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన రజత్ పాటిదార్(23) ధాటిగా ఆడాడు. అర్ష్‌దీప్ మరోసారి ఆర్సీబీకి షాకిస్తూ.. విరాట్ కోహ్లీ(1)ని పెవిలియన్ పంపాడు. కోహ్లీ లాంగాన్‌లో కొట్టిన బంతిని యాన్సెన్ పరుగెడుతూ వెళ్లి అందుకున్నాడు. ఈ సీజన్‌లో పెద్దగా రాణించని లివింగ్‌స్టోన్(4) ఒక బౌండరీతో టచ్‌లో ఉన్నట్టే కనిపించాడు. కానీ, బార్ట్‌లెట్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. జితేశ్ శర్మ (2) పెద్ద షాట్ ఆడబోయి నేహల్‌కు దొరికాడు అంతే.. 32 పరుగులకే నాలుగు కీలక వికెట్లు పడ్డాయి. ఆ తర్వాత వచ్చిన వాళ్లు వచ్చినట్టే పెవిలియన్ చేరారు. ఓవైపు వికెట్లు పడుతున్నా టిమ్ డేవిడ్(50 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అయితే..

హర్‌ప్రీత్ బ్రార్(225) వేసిన 12వ ఓవర్లో వరుస బంతుల్లో భువనేశ్వర్ కుమార్(8), యశ్ దయాల్(0)లను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ, హేజిల్‌వుడ్ వికెట్ కాపాడుకున్నాడు. 14వ ఓవర్లో రెచ్చిపోయిన డేవిడ్ హ్యాట్రిక్ సిక్సర్లతో జట్టు స్కోర్ 90 దాటించాడు. ఆఖరి బంతికి రెండు రన్స్ తీసి అర్థ శతకం సాధించి ఆర్సీబీకి గౌరవప్రదమైన స్కోర్ అందించాడు.



## సింగపూర్‌లో ఐసిసి వార్షిక సదస్సు..

### ఆ మూడు కీలక నిర్ణయాలు తీసుకుంటారా..?

అంతర్జాతీయ క్రికెట్‌లో పలు మార్పులకు సిద్ధమైన ఐసిసి త్వరలోనే మరోసారి సమావేశం కానుంది. ఈసారి జరుగబోయే వార్షిక సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఈసారి సింగపూర్ వేదికగా మీటింగ్ జరుగనుంది. జూలై మూడో వారంలో ఈ మీటింగ్ నిర్వహించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. వరల్డ్ క్రికెట్ కమిటీ సిఫారసుల నేపథ్యంలో సింగపూర్ భేటీపై ఆసక్తి నెలకొంది. అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి వార్షిక సమావేశం ఇదే కావడం విశేషం.

ఈ మధ్యే జింబాబ్వేలోని హరారే వేదికగా ఐసీసీ కీలక సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు అందరూ వార్షిక సమావేశం వేదిక, తేదీలపై చర్చించారు. ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ అయిన ఇమ్రాన్ ఖవాజా ప్రతిపాదన మేరకు సింగపూర్‌లో క్రికెట్ పురోగతికి అవసరమైన తీర్మానాలు తీసుకోవాలని నిర్ణయించారు. సౌరభ్ గంగూలీ నేతృత్వంలోని క్రికెట్ కమిటీ సూచించిన మార్పులు, చేర్పులపై వార్షిక సమావేశంలో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

### చర్చించే అంశాలు ఇవే..

ఐసిసి వార్షిక సమావేశంలో ప్రధానంగా చర్చించే అంశాలు ఇప్పటికే ఖరారు అయ్యాయి. వన్డేల్లో రెండో బంతిని వినియోగించడాన్ని రద్దు చేయడం, టెస్టుల్లో టైమర్‌ను ప్రవేశ పెట్టడం, టీ20ల్లోనూ అండర్ 19 వరల్డ్ కప్ నిర్వహించడం వంటివి ముఖ్యమైనవి. వన్డేలు, టీ20ల్లో అమలు చేస్తున్న టైమర్ విధానం విజయవంతం కావడంతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ ఈ పద్ధతిని తీసుకురావాలని ఐసీసీ భావిస్తోంది.

ఈ నిబంధన అమల్లోకి వస్తే పూర్తి అయిన 60 సెకన్లలో మరో ఓవర్ వేయాల్సి ఉంటుంది. దాంతో, ఒక్క రోజులో 90 ఓవర్లు పూర్తి చేయడం సాధ్యమవుతుంది. ఇక మూడోది.. వన్డే తరహాలోనే టీ20ల్లోనూ అండర్ 19 వరల్డ్ కప్ పోటీలు నిర్వహించడం. తద్వారా పొట్టి ఫార్మాట్‌కు విశేష ప్రచారం కల్పించాలనేది ఐసీసీ ఉద్దేశం.



## వినూత్నంగా 'హిట్ 3' ప్రమోషన్స్!

నాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రం హిట్ 3 కోసం అందరికీ తెలిసిందే. మరి నాని సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించగా రీసెంట్ ట్రైలర్‌తో మరిన్ని అంచనాలు ఈ చిత్రంపై ఏర్పడ్డాయి. ఇక నాని సినిమాలు అంటే ప్రమోషన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో అందరికీ తెలిసిందే. తన సినిమాల లానే ప్రమోషన్స్ కూడా నాని వినూత్నంగానే ట్రై చేస్తూ ఉంటాడు. ఇపుడు ఇదే వినూత్నత హిట్ 3 ప్రమోషన్స్‌లో కనిపిస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో హిట్ 3 ఇంటర్వ్యూల తాలూకా సెటప్ వైరల్‌గా మారింది. సినిమా థీమ్‌కి తగ్గట్టుగా ఆయుధాలు, రక్తం ఇలా డిఫరెంట్‌గా మొత్తం సెట్ చేసి ప్లాన్ చేస్తున్నారు. ఇలా మొత్తానికి మాత్రం హిట్ 3 ప్రమోషన్స్ కూడా హిట్టే అని చెప్పవచ్చు. ఇక ఈ అవైటెడ్ సినిమా ఈ మే 1న రాబోతుండగా సాలిడ్ హైప్ ఈ సినిమా పట్ల నెలకొంది.




## మాస్ యాక్షన్‌తో ఆకట్టుకున్న సూర్య

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రెట్రో'పై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటివరకు రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం మాస్ యాక్షన్‌తో కట్ చేయడంతో సూర్య ఫ్యాన్స్‌కు ఇది బాగా నచ్చుతోంది. ఇక ఈ సినిమాలో సూర్య లుక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రేమ, నవ్వులు, యుద్ధం అనే కాన్సెప్ట్‌తో దర్శకుడు కార్తీక్ సుబ్బారాజ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. టెంప్లేట్ పాతదే అయినా, ఈ సినిమాను సరికొత్తగా ప్రెజెంట్ చేయబోతున్నారని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా జోజు జార్జ్, జయరాం, కరుణాకరన్, నాజర్, ప్రకాష్ రాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా మే 1న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

# రీల్



## నా పేరుతో గుడి ఉంది

– ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మరోసారి తన వ్యాఖ్యలతో ఆన్‌లైన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాతో నవ్వులపాలైన ఈ నటి, ఇప్పుడు నమ్మశక్యం కాని మరో వాదనను తెరపైకి తెచ్చింది. సన్నీ డియోల్, రణదీప్ హుడా నటించిన 'జాట్' సినిమాలో ఒక ఐటమ్ సాంగ్ చేసిన ఊర్వశి, తాజాగా తన పేరుతో ఉత్తరాఖండ్‌లో ఒక గుడి ఉందని, ఇప్పుడు దక్షిణ భారతదేశంలో కూడా తన పేరుతో ఒక గుడిని నిర్మించాలని కోరుకుంటున్నట్లు చెప్పింది. ఉత్తరాఖండ్‌లో నా పేరుతో టెంపుల్ ఉంది. మీరు బద్రీనాథ్ టెంపుల్‌కి వెళ్లినప్పుడు, సరిగ్గా దాని పక్కనే అది మీకు కనిపిస్తుంది. ప్రజలు ఆ గుడిలో ప్రార్థనలు చేస్తారని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు కూడా తనను ప్రార్థిస్తారని అలాగే తన ఫోటోలకు పూలమాలలు వేసి 'దండమమాయి' అని కోలుస్తారని ఊర్వశి చెప్పింది. నా కోరిక ఏమిటంటే.. గత ఒకటిన్నర సంవత్సరాల వ్యవధిలో మెగాస్టార్ చిరంజీవితో పాటు పవన్ కళ్యాణ్, బాలకృష్ణలతో కలిసి నటించాను. వారికి దక్షిణాదిలో గుళ్లు ఉన్నట్లే.. నా అభిమానుల కోసం కూడా దక్షిణ భారతంలో గుడి ఉండాలని నా కోరిక అని ఊర్వశి చెప్పుకోచ్చింది.




## నవతరానికి కొండవీటి కుటుంబం స్ఫూర్తి

### పలివెలలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహావిష్కరణ



ప్రజాపక్షం/మునుగోడు: కొండవీటి కుటుంబం ఈనాటి నవతరానికి స్ఫూర్తి అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు కొండవీటి బుచ్చిరెడ్డి కొండవీటి జగన్మోహన్ రెడ్డిల విగ్రహాలను ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ కొండవీటి కుటుంబం స్వార్థం కోసం పోరాడలేదని నిరంతరం పేద ప్రజల పక్షాన నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో ఎన్నో ఏళ్లుగా జైలు శిక్ష అనుభవించారని అన్నారు. 11 ఏళ్లుగా పూర్తికాని డిండి ప్రాజెక్టును ఈ రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లతో శ్రీశైలం ద్వారా ఏదుల నుంచి డిండి ప్రాజెక్టుకు నీరు అందించేందుకు టెండర్లు పూర్తి చేశారని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి కిష్టాపురం చెరువుకు నీళ్లు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సాయుధ పోరాటంలో పాశం పుల్లారెడ్డికి వ్యతిరేకంగా పలివెల గ్రామం నుండి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కొండవీటి కుటుంబం పోరాటాలు చేసి పేద ప్రజలకు విముక్తి కలిగించారన్నారు. సాయుధ పోరాటం ద్వారానే నిజామును లొంగదీశారన్నారు. పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాటంలో పలివెల గ్రామం నుండి బచ్చిరెడ్డి,గుర్నాథ్ రెడ్డి,గోస్కొండ పెద్దులు మరో 30మంది పోరాట యోధులు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. భారత ప్రభుత్వానికి లొంగిపోయిన నిజాం నవాబును భారత ప్రభుత్వం గౌరవించడం ఏంటని ప్రశ్నించారు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయకపోతే హైదరాబాద్ మరో పాకిస్తాన్ మారేది అని తెలిపారు. అనంతరం మాజీ ఎంఎల్‌ఏ కొండవీటి గుర్నాథ్ రెడ్డి చరిత్ర పుస్తకాని విష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములు, మాజీ ఎంఎల్‌ఏ నంద్యాల నర్సింహారెడ్డి, రిటైడ్ ఇంజనీరింగ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వేంరెడ్డి శ్యాం ప్రసాద్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, కొండవీటి కుటుంబ సభ్యులు కొండవీటి సునీల్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగమే సర్వోన్నతం

(మొదటి పేజీ తరువాయి)

అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు తమ వద్ద పెండింగ్ పెట్టేందుకు వీల్లేకుండా సుప్రీంకోర్టు న్యాయపరంగా మార్గాన్ని సుగమం చేసిందని రాజా తెలిపారు. మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలని అధికరణ 74(1) స్పష్టం చేస్తుందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పదవిలో ఉన్న రాష్ట్రపతి ఇలాంటి విషయాల్లో సొంతంగా నిర్ణయాలు తీసుకోరని, ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాల అణచివేతకు గవర్నర్ వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్– బిజెపి దుర్వినియోగించడాన్ని చట్టబద్ధంగా సమర్థించేవిగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదకర ధోరణి ఇటీవల పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. 'తొలి గిరిజన మహిళా రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము రాజ్యాంగబద్ధ అత్యున్నత స్థానం చేపట్టారు. ఈ స్థానం సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కలిగించే వివక్షపూరిత ప్రణాళికలకు ముసుగుగా వినియోగం కావడం ఆందోళనకరం. జడ్జి ఇంటి నుంచి భారీగా నగదు లభ్యం కావడం వంటి ఘటనలు తీవ్ర పరిశోధనలు, దిద్దుబాటు చర్యల అవసరాన్ని సూచిస్తున్నాయి. ఇటువంటి కేసులతో న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించే అజెండా బహిర్గతమవుతోంది' అని రాజా అన్నారు. సీపీఐ సహా 55 మంది పార్లమెంటు సభ్యులు తీర్మానం ప్రవేశపెట్టి... అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి చేసిన మతతత్వ, విభజన వ్యాఖ్యలపై రాజ్యసభలో చర్చను కోరితే... చైర్మన్ స్థానంలో ఉన్న ఉప రాష్ట్రపతి అందుకు అనుమతించలేదని రాజా గుర్తుచేశారు. న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తిస్వాతంత్ర్యాన్ని, సమాఖ్యవాదాన్ని బలహీనపర్చడానికి... నిరంకుశ పాలకుల చేతిలో అధికారాన్ని కేంద్రీకరించే ప్రమాదకరమైన వ్యూహానికి ఇలాంటి చర్యలు దారితీస్తాయని సీపీఐ హెచ్చరిస్తోందన్నారు.

## అన్నదాతతో ప్రకృతి చెలగాటం

(మొదటి పేజీ తరువాయి)

కంట కన్నీరు కారుతుంది. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు జరగకపోవడం, కొనుగోళ్లు జరిగినా ధాన్యం తరలింపు ఇతరత్రా జాప్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖమ్మంజిల్లా కల్లూరు మండలం పుల్లయ్యబంజర్ కొనుగోలు కేంద్రంలోనే లక్ష బస్తాల ధాన్యం తడిసిపోయిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. వరి పొలాలు గాలి దుమారానికి దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంట సైతం తడిసిపోయింది. ప్రతి పాలకుడు రైతే వెన్నెముక, రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పే మాటలు నీటి మూటలవుతున్నాయి. రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎందుకో పాలకులు ముందుకు రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేస్తే రాష్ట్రంలో సైతం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పాలకులు విఫలమవుతున్నారు. గతంలో వ్యవసాయ పనిముట్ల మొదలు రసాయనిక ఎరువుల వరకు రైతులకు గత ప్రభుత్వాలు సబ్సిడీలు ఇచ్చేవి. మోడీ పాలనలో వ్యవసాయ సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు పంటల బీమా కూడా కార్పొరేట్ కంపెనీలకు వర ప్రధాయినిగా మార్చారు. ఈ దశలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుభరోసా అంటూ ఇచ్చిన హామీల అమలులో సైతం వైఫల్యం చెందింది. ప్రకృతి సహాయ నిరాకరణ, పాలకుల ప్రోత్సాహం లేకపోవడంతో వ్యవసాయ రంగం కుదేలవుతుంది. వ్యవసాయంపై ఆధారపడిన రైతుల కంట కన్నీరు కారుతుంది. ఆ కన్నీరు తుడిచేందుకు ఏ పాలకుడు సిద్ధం కాకపోవడం శోచనీయం. కల్లాల్లో తడిచిన ధాన్యం, మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఉత్తదే

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు పరిశీలించినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దాదాపు 120 మంది అనుమానితులను ప్రశ్నించామని, ఆ తర్వాత యువతిపై అత్యాచారయత్నం జరగలేదని తేల్చినట్లు వెల్లడించారు.మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న యువతిపై ఒక యువకుడు ఎంఎంటిఎస్ రైలులో అత్యాచారానికి యత్నించినట్టు వార్తలు రావడంతో కలకలం రేగింది. కొంపల్లి సమీపంలో రైలు బ్రిడ్జి వద్ద కిందపడటంతో ఆమె గాయపడింది. ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె ప్రస్తుతం పూర్తిగా కోలుకుంది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com